# విన్నవీ కన్నవీ

(బలభద్రపాత్రుని వారి వంశ చరిత్ర)

డా॥ బలభద్రపాత్రుని కేశవరావు

*ఓం శ్రీబాలాత్రిపుర సుందరీ దేవతాభ్యోనమః*

# విన్నవీ కన్నవీ

*డా|| బలభద్రపాత్రుని కేశవరావు*

భావి తరాల సంతతి తమ వంశం గురించి, పూర్వీకులను గురించి, వారి బంధువులను గురించి తెలిసికొనుటకు ప్రయత్నించడం ప్రకృతి సహజం. అందరికీ ఈ ఆసక్తి ఉండక పోవచ్చు. కాని కొందరైనా తమ వంశము, దాని పుట్టుపూర్వోత్తరముల గురించి తెలుసు కోవాలనే జిజ్ఞాసతో తపించేవారుంటారు. ఈ దిశలో బహుధా ప్రయత్నం చేస్తారు. అట్టివారికోసం లభించిన ఆధారాలతో, చరిత్ర సాక్ష్యాలతో, మా కుటుంబ పెద్దలు చెప్పిన అంశాలతో బలభద్రపాత్రుని వారి వంశ చరిత్రను సమీక్షించడం జరిగింది. ఆ ప్రయత్నమే ఈ 'విన్నవీ కన్నవీ' !

ఈ వంశ కర్త గుణ్ణం బలభద్రుడు[1]. ఆయన విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు. కటకంలో ప్రతాప రుద్ర గజపతి వద్ద ప్రధాన సైన్యాధ్యక్షుడు. ఆయనకు 'పాత్రుడు' అనేది బిరుదు. ఒరిస్సా లోని కటకం ప్రాంతంలోచాలా మంది ఈ బిరుదు కలిగి యున్నారు. వీరిలో ప్రతాపరుద్ర గజపతి వద్ద ఉన్నట్టి పదహారు మంది పాత్ర సామంతులు[2]. (ఈ 16 మంది పాత్ర సామంతులు.) సేనా నాయకులే కాక, సామంతరాజ్యాధిపతులు. రాజ్యం అనగానే మనం పెద్ద పెద్ద భూభాగాలు గలిగిన రాజులని భావించరాదు. వారి వారి అధికారము ననుసరించి కొన్న కొన్ని మండలాలాకు సామంతులుగా జేసి వారు కొంత సైన్యమును పోషించే విధంగా నిర్ణయించేవారు.

ఈ పద్ధతి మొగలాయీలలోనూ, ఛత్రపతి శివాజీ రాచరికంలోనూ, తరువాత వచ్చిన ఆసఫ్ ఝా రాజ్యంలోనూ మనం గమనించవచ్చు.

ఇక్కడ ఒక విషయం విపులీకరించాలి. అసలు బలభద్రపాత్రుడు ఒరియావాడే నని, ఆంధ్ర దేశానికి వలస వచ్చిన ఈయన సంతతి ఒరియావారే నని భావిస్తారు. కానీ ఈయన ఆరువేల నియోగి బ్రాహ్మణుడు.ఆపస్తంభ సూత్రుడు. యజుశ్శాఖాధ్యాయి. కౌండిన్యస గోత్రోద్భవుడు. వాసిష్ఠ, మైత్రావరుణ, కౌండిన్య త్రయారుషేయుడు. నియోగి బ్రాహ్మణశాఖ ఆంధ్రదేశానికే పరిమితము. మరియే ప్రదేశములోనూ ఈ శాఖ లేదు. ఓరుగల్లును రుద్రమ దేవి పాలించు కాలమున ఆ సామ్రాజ్యము ఉత్తరమున దాదాపు కటకము వరకూ విస్తరించి యుండెను. ఆ రాజ్యములో అధికారులు చాలా మంది జైను లుండిరి. వారందరూ రుద్రమదేవి స్త్రీ గనుక రాజ్యార్హత లేదని వాదించెడివారు. అందుకు రుద్రమ దేవి భర్త, ఆమె సవతి కుమారులు సమర్థించుటయే కాక, ఆమెను హతమార్చుటకు నడుము కట్టిరి. ఆ కుట్రలో భాగంగా రాజ వ్యతిరేక చర్యలకు పూనుకొని, దేవగిరి యాదవ రాజును ఆహ్వానించిరి. అప్పుడే మరొక వంక వీర శైవము విజృంభించ దొడగెను.

---

1 గుణ్ణం బలభద్రుడనే పేరు ప్రప్రథమంగా గ్రామ కైఫీయత్తు 2 వ భాగం పుట 56 లో కనబడు చున్నది. ఈయనే తరువాత బలభద్ర పాత్రుడు గాను, తర్వాత ఈయన వంశం వారు బలభద్ర పాత్రుని వారుగా వ్యవహరింప బడు చుండెనని వ్రాయ బడినది. తర్వాత అప్పన్న గారు వ్రాయించిన వంశవృక్షము సర్వధారి నామ సంవత్సరం మాఘ శుద్ధ సప్తమి అనగా సుమారు క్రీ.శ. 1829 ఫిబ్రవరి మార్చి నందు గుణ్ణము బలభద్రుడుగా వంశకర్త నామము వ్రాయబడెను.

2 తిమ్మరుసు మంత్రి పుట 118

రుద్రమదేవి, గణపతి దేవులు శివదీక్షా పరులు. శివదేవయ్య దేశికులు వీరి గురువు. కాని అన్ని వర్గములు తమతమ యిష్టము ననుసరించి తమతమ ఆరాధనా పద్ధతులను ఆచరించుటకు చక్రవర్తి ఆదేశములున్నవి.

అదే సమయమున నెల్లూరు (విక్రమ సింహపురము) సామ్రాజ్యధిపతి మనుమసిద్ధి ఆయనకు మంత్రి, గురుతుల్యుడు కవిసార్వభౌముడు తిక్కన సోమయాజి. ఆయన అప్పుడే భారతములోని 15 పర్వములను తెనిగించెను. మనుమసిద్ధి దాయాదులతో పోరి, అందు ఓడి పోయి, రాజ్యభ్రష్టుడాయెను. ఆ పరిస్థితిలో మనుమసిద్ధి కొరకు సహాయ మర్థిచుటకై, తిక్కన సోమయాజి కాకాతీయుల రాజధాని ఓరుగల్లు జేరి, అక్కడ స్వయంభువేశ్వరాలయములో ప్రతి దినము భారత పఠనము జేయుచుండెను.

జైనుల రాజ ద్రోహము, రుద్రమదేవి భర్త, సవతి కుమారుల కుట్రలు, దేవగిరి యాదవరాజును ఓరుగల్లుపై దండయాత్రకు పురికొల్పినవి. దండయాత్ర విషయము రుద్రమదేవికి తెలిసినది. కాని ఆమె రాజ్య వ్యవస్థను స్తంభింపజేయుటకు జైనులు నిశ్చయించి యాదవరాజుకు సహాయము చేయుటకు వాగ్దానము చేసిరి.

ఆ సమయంలో రాజ్యపాలనకు నమ్మకమైన వారు వెంటనే కావలిసి వచ్చినారు. తిక్కన సోమయాజి ఆధ్వర్యములో ఆరు వేల మంది బ్రాహ్మణులకు శస్త్రాస్త్ర విద్యయందు, గణితము నందు, రాజ్యపాలన యందు శిక్షణ నిచ్చి, రాజ్యములోని అన్ని కీలక ప్రదేశములలోనూ వారిని అధికారులుగా నియమించిరి.[3] వీరే ఆరువేల నియోగులు. కాకతీయుల కాలములో నియోగము అనే పదము ఉద్యోగమునకు

పర్యాయ పదముగా వాడబడినది. వారి వద్ద 72 విధములైన నియోగము లుండెడివి.

కాకతీయుల తర్వాత కొండవీడు, అద్దంకి, కొండపల్లి, రాజ మహేంద్ర వర రాజ్యములలో వీరు విజయనగర రాజ్యములో స్థల కరణాలుగా నుండిరి. తరువాత రాజమహేంద్రవరము నుండి ఓరుగల్లు వరకు గల ప్రదేశములు కొంత కాలము ఓఢ్రుల పాలన క్రింద నుండినవి. మహాకవి శ్రీనాధుని అంతిమ దశలో ఓఢ్ర పాలన యుండెడిది. శ్రీనాధునికి బొడ్డుపల్లి (కృష్ణానదిలోని ఒక లంక) వయ్వసాయమునకై 700 టంకాలకు కౌలుకిచ్చి, ఆయన సకాలములో కౌలు చెల్లించ లేదని ఆయనకు గుదిబండ వేసిరి. ఆ అవమానమును భరించలేక, మహాకవి ప్రస్థానము చేసెను.

బలభద్రుడు ఓఢ్ర దేశీయుడునుటకు, ఆయన సంతతి ఓఢ్ర దేశము నుండి వలస వచ్చినట్లాధారములు లేవని చెప్పుటకే పై విషయములు ప్రస్థావన చేయుట జరిగినది. వారందరూ కాకతీయ సమ్రాజ్యములో అధికారులుగా నుండి, ఓఢ్రుల పాలనలోకి వచ్చిన తర్వాత గూడ అధికారులుగానే కొనసాగి, తరువాత ప్రతాపరుద్ర గజపతి కాలములో బలభద్రుడు ప్రధాన సేనా పతిగా నుండెననుటకు సందేహము లేదు.

---

3 క్రీ.శ 1145 సంవత్సరమున ఈ నియోగములు జిరగి నట్లు గ్రామ కైఫీయత్తు 2 వ భాగం పుట 28 నందు ఉదహరింప బడినది. ఈ నియోగులలో తెలగాణ్యులు, కౌండిన్యస గోత్రీకులు గుజ్జం వారు కూడా వుండిరని గ్రామ కైఫీయత్తు 2 వ భాగం పుట 33 లో ఉదహరింపబడినది. ఆ విధముగా బలభద్ర పాత్రుని వారు క్రీ.శ. 1145 సంవత్సరంలో నియోగులైరి.

మరోవిషయము బలభద్రపాత్రుని వారిలో చాలామంది నాతో మాట్లాడేటప్పుడు మనమందరమూ ఓఢ్రదేశీయులమని, ఈ ప్రదేశమునకు వలస వచ్చితిమనీ చెప్పుట జరిగినది. మా పినతండ్రి బలభద్రపాత్రుని చంద్ర కళాధరరావు గారు కూడా అనేక పర్యాయములు ఈ విధముగానే మాట్లాడిరి. వారికి ఈ పై విషయములు తెలియజెసిననూ, బలభద్రుడు కటకం నుండి గోల్కొండ వచ్చిరి కదా! అందువలన మనము ఓఢ్ర దేశీయులమే అనెడి వారు.

దేశము అల్లకల్లోల పరిస్థితిలోనుండి, అన్నియూ చిన్న చిన్న రాజ్యములుగా చీలి నిరంతరమూ ఒకరితో నొకరు పోరు సలుపు కాలములో, ఆ రాజ్యములో అధికారులు, సైనికులు కొంతకాలము ఒక రాజ్యమునందు, మరి కొంతకాలము మరో రాజ్యమునందు ఉండుట సహజమే కదా.

తిక్కన సోమయాజి కాలములో ఏర్పడిన ఆరువేల నియోగులు, చాలాకాలము వరకూ 'నియోగము' ఒక అధికారము (ఉద్యోగము) గానే భావించి, బ్రాహ్మణ నియమాలైన షట్కర్మలు (యజన, యాజన, అధ్యయన, ఆధ్యాపన, దాన, ప్రతిగ్రహణ) జేయుచుండిరి. కాని కాలప్రమేణ 17వ శతాబ్దములో ఆరువేల నియోగులనే ఒక శాఖగా మారి, మిగిలిన శాఖలతో వివాహాది సంబంధ బాంధవ్యాలను పాటించకుండిరి. ఉదాహరణకు మంత్రిత్వము గరపిన అనేక మంది నిత్య నైమిత్తిక కర్మలు చేసినట్లు ఆధారములు మనకు చరిత్రలో కనబడును. అంతవరకూ ఎందులకు! మా పితామహి తండ్రి శ్రీ కోటంరాజు వేంకటాచలం పంతులుగారు వృత్తిరీత్యా న్యాయవాది యైనా, నిత్యాగ్ని హోత్రులు,

వైశ్వదేవం చేసేవారు. వారు 20వ శతాబ్దం పూర్వభాగంలో పరమపదించారు. వారు నరసరావుపేట వాస్తవ్యులు.

ఈ క్రింద పొందు పరచిన భాగము (విషయములు) మా తండ్రిగారు కీర్తిశేషులు బలభద్రపాత్రుని సూర్యారావుగారు వ్రాసిరి. వారు జాగ్రత్తగా విషయములను తెలిసికొని, పరిశీలించి, పరిశోధన జరిపి వ్రాసిరి. అవసరమైన చోట విషయములను విపులీకరింప ప్రయత్నించెదను.

క్రీస్తుశకము 1510 సంవత్సరముకు ముందు కటక పురాధీశ్వరుడైన ప్రతాపరుద్ర గజపతి తన సైన్యాధ్యాక్షులలో 16 మందిని ఎంపిక చేసి వారికి 'పాత్రుడు' అని బిరుదు నిచ్చి సామంతులను చేసెను. వారే 16 గురు పాత్ర సామంతులు.

వారి నామములు[4] 1. బలభద్ర పాత్రుడు, 2. దుర్గా పాత్రుడు, 3. భీమా పాత్రుడు, 4. ముకుంద పాత్రుడు, 5. భీకరపాత్రుడు, 6. భేరు పాత్రుడు, 7. రణరంగ పాత్రుడు, 8. ఖడ్గ పాత్రుడు, 9. అఖండల పాత్రుడు, 10. మురారి పాత్రుడు, 11. వజ్రముష్ఠి పాత్రుడు, 12. తురగ రేవంత పాత్రుడు, 13. గజాకుశ పాత్రుడు, 14. అసహాయ పాత్రుడు, 15. మృగేంద్ర పాత్రుడు, 16. వీరభద్ర పాత్రుడు.

కటకపురి సామ్రాజ్యము తూర్పున బంగాళాఖాతము నుండి పడమట ఉదయగిర్వి[5] వరకు విస్తరించి ఉండినది. వంశధార, గోదావరి, కృష్ణానదులు[6] ప్రవహించు సస్యశ్యామలమైన క్షేత్రము.

నూతనముగా హంపి వద్ద ఏర్పడిన విద్యానగర సామ్రాజ్యము క్రీ.శ. 1509 లో శ్రీకృష్ణ దేవరాయలు సింహాసన మధిష్ఠింపగనే, మహామంత్రి

తిమ్మరుసు తోడ్పాటుతో దక్షిణ దిగ్విజయ యాత్రకు బయలు దేరి దక్షిణమున కావేరీ నదీ ప్రాంత మందలి శివసముద్రము, శ్రీరంగ పట్టణములను జయించి, స్వాధీన పర్చు కోనెను. దక్షణమున శ్రీరంగ పట్టణమును ముఖ్య పట్టణముగా ఏర్పరుచుకొని తన సామ్రాజ్యమునందు కలుపు కొనెను. తూర్పున గల కటకపురి సామ్రాజ్యము పైన రాయల కన్ను పడెను. పూర్వ దిగ్విజయాత్ర అను నెపమున కృష్ణానదికి దక్షణమున గల గజపతి రాజ్యమును కబళింప మహామంత్రిని ప్రేరేపించెను. మహామంత్రి రెండు సంవత్సరముల గడువు కోరి సైన్యమును కూర్చి బలపరచసాగెను.

క్రీ.శ. 1513 వ సంవత్సరమందు రాయలు పూర్వ దిగ్విజయ యాత్రకు రణభేరి మ్రోగించి, బయలుదేరి ఉదయగిరి కోటను ముట్టడించెను. తదుపరి పోరు సల్పుతూ కోటలను స్వాధీన పరచు కొనుచూ వచ్చి క్రీ.శ.1515 మార్చి నెలలో గజపతి సామ్రాజ్యములో కృష్ణానదికి దక్షణమున గల చిట్టచివరి కోటయైన కొండవీడును ముట్టడించెను.

---

4 ఈ విషయములు శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు రచించిన తిమ్మరుసు మంత్రి అను తారిత్రాత్మక గ్రంధము నుండి గ్రహింప బడినది. దీని ప్రచురణ కాలము 10.05.1917

5 ఇది ప్రస్తుతము నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి. శ్రీకృష్ణదేవరాయలు ఈ కోటను ప్రతాపరుద్ర గజపతి నుండి గెలిచెను). ఈ సామ్రాజ్యము నందు

6 వంశధార, గోదావరి, కృష్ణ ఆంధ్ర ప్రాంత నదులు. వీటితో పాటు మహానది కూడ కటక రాజ్యములో నున్నది)

శ్రీ వీర ప్రతాపరుద్రగజపతి కుమారుడైన శ్రీ వీరభద్ర గజపతి కోటను రక్షించు చుండెను. కుమారుని సహాయమునకై తన అల్లుడైన శ్రీ పూసపాటి రాచిరాజును సర్వ సేనానిగా నియమించి 1300 ఏనుగులను, 20,000 అశ్విక దళమును, 5 లక్షల కాల్బలమును పంపెను. శ్రీ గజపతి సేనలు కృష్ణానదికి దక్షణమున రాయల సైన్యముతో పోరు సలిపి ఓడి పోయిరి. శ్రీ పూసపాటి రాచిరాజు కృష్ణానదిని దాటి కటకపురి చేరేను. రాయలు కొండవీటిని స్వాధీన పరచు కొనెను.

యుద్ధ పిపాసియు, విజయముతో గర్విష్ఠుడైన రాయలు తన సైన్యమును కృష్ణానది దాటించి కటకపురి పైకి పోవ ఆజ్ఞ యిచ్చెను. మహామంత్రి తిమ్మరుసు ఇది తప్పుడు నడక యనియు, గజపతి ప్రభువు బలశాలి యైన శత్రువనియు బోధించెను. రాయలు మంత్రి మాటను త్రోసివైచి, కృష్ణానదిని దాటి రాజమహేంద్రవరమును ముట్టడించెను.

రాజమహేంద్రవరమును రాయని సైన్యము ముట్టడించెనని తెలిసి 16 మంది పాత్ర సామంతులు శ్రీ వీర ప్రతాపరుద్ర గజపతి మహారాజు వద్దకు వెడలి రాయల నెదుర్కొన ఆజ్ఞను కోరిరి. అల్లుని వలన విని, గజపతి యుద్ధమునకు ఆజ్ఞ నిచ్చెను. ఆనుజ్ఞ పొంది 16 మంది పాత్ర సామంతులు తమ సేనలతో హుటాహుటి రాయల సేనలను, రాయల సేనలు వచ్చి గజపతి మహారాజు సేనలను కలియు లోపల, రాజమహేంద్రవరమునకు ఉత్తరమున గల అడవులలో ఢీకొని, రాయల సేనను ఓడించిరి. మహామంత్రి బోధనలను తిరస్కరించి, అపజయమును తెచ్చి పెట్టుకున్నందుకు మిక్కిలి ఖిన్నుడై న రాయలు మహామంత్రి వద్దకు జేరెను. గడచిన దానికి చింతింప వలదని రాయల నోదార్చి,

మంత్రి తిమ్మరుసు ఒక యుక్తిని పన్నెను. 16 పెట్టెలను బంగారు నాణెములతో నింపి, పాత్ర సామంతుల పేరిట 'శ్రీకృష్ణ దేవరాయలు షరతుల నంగీకరించెను. షరతుల ప్రకారము గజపతిని మీరు మా కప్పగించిన యెడల, నిర్ణయ ప్రకారము గ్రామములు, రత్నాభరణములు మీ యాధీనము చేసెదము' అను లేఖల నుంచి, సేవకులతో పెట్టెలను గజపతి చూచునట్లు వెళ్లుడని ఆజ్ఞాపించెను. వారు అటులనే వెడలి, గజపతి సేనకు పట్టుబడిరి. ఆ పెట్టెలను గజపతి మహారాజు ముందుంచ, వారు ఆ పేటికలను తెరిపించి, అందరి లేఖలను చదివించుకుని, పాత్ర సామంతులు రాజ ద్రోహులైనారని భావించి వెంటనే రాయనితో సంధి చేసుకొనెను.

బలభద్ర పాత్రుడు రాజాగ్రహమునకు గురియై, అవమాన భారముతో కటకము నుండి గోల్కొండ వచ్చి, బహమనీ సుల్తాను కొలువులో చేరియుండవలెను. బలభద్ర పాత్రుడు శస్త్రజీవి. కటకంలో నిలువ వీలులేదు. విజయనగర సామ్రాజ్యమునకు వెళ్ళుటకు అసలు వీలు లేదు. అందువలన గత్యంతరము లేక బహమనీ సుల్తాను కొలువులో చేరి యుండవలెను. అంతేగాక గోల్కొండ బహమనీ సుల్తాను విజయనగర రాజ్యమునకు శత్రువు. ఆయన కొలువులో మంత్రి పదవులలో హిందువులుండిరి. కొలువునందు హిందూ ద్వేషము అధికముగా లేదని తెలియుచున్నది.

తరువాత క్రీ.శ. 1710 వరకు వీరి వంశస్తులు ఏమిచేసినదీ, ఎక్కడ ఉన్నదీ వివరములు తెలియలేదు. క్రీ.శ. 1707 లో ఔరంగజేబు దక్కన్ లో మరణించెను. అంతకు ముందే శివాజీ మహరాజ్ కూడా మరణించెను.

ఔరంగజేబు గోల్కొండను గెలిచి తన రాజ్యములో కలుపు కొనెను. అనగా బలభద్రపాత్రుని వంశీయులు మొగలాయీల ఆధీనంలోని రాజ్య భాగంలోనే ఉన్నారు. కాగా, క్రీ.శ 1754 ప్రాంతంలో అలంగీర్ మొహరు తో వున్న ఫర్మాన్వా ప్రకారం వీరి సంతతి వారు అన్నదమ్ములు ఆస్తి పంపకమును ధృవీకరించించినట్లు దాఖలా వున్నది. ఆ ఫర్మానా యిప్పటికీ మా వద్ద ఉన్నది. వీరందరూ అప్పటికి మొగలాయీల ఆధీనంలోని మూర్తజా నగర్ సర్కారు (గుంటూరు) మండలానికి వచ్చి, భూమి శిస్తు వసూలు జేసే దేశపాండ్యాలుగా నున్నట్లు తెలియు చున్నది.

దేశ పాండ్యా, దేశముఖ్ వంటి ఉద్యోగములు మహారాష్ట్ర సాంప్రదాయము లో నున్నవి. రాజుకు రావలిసిన భూమి శిస్తు వసూలు చేసి, తన భాగమునుంచుకొని, మిగిలిననది రాజునకు పంపే బాధ్యత గల ఉద్యోగము. శిస్తు వసూలు యందు సహకరించుటకు తగు మాత్రము సైన్యము వీరి వద్ద యుండెడిది. మూర్తజా నగర్ సర్కారుకు ముఖ్య మైన స్థలము కొండవీడు. ఆ విధముగా వీరు కొండవీటి నివాసులైరి. క్రీ.శ. 1788 సేప్టెంబరు వరకు వీరు కొండవీడు లోనే యున్నట్లు నిశ్చయము. కాగా రాజ్యము అప్పటికి మొగలాయీల ఆధీనము నుంచి అసఫ్ జా ( మొగలాయీల రాజ ప్రతినిధి., తర్వాత మొగలాయీల ప్రాబల్యం క్షీణించిన తర్వాత స్వతంత్రము ప్రకటించిన నీజాం ఉల్ ముల్క్ అసఫ్ జా) పాలనలోకి వచ్చిన భూ భాగము. విజయనగర సామ్రాజ్య పతనానంతరము, ప్రముఖ మైన రాజ్యాల్వు . హైదరాబాదా ఆసఫ్

* అనుబంధం 3 చూడుడు

జాలు, 2. మైసూరు టిప్పు, 3. పూనాలో పేష్వాలు. వీరి మధ్య ఘర్షణలలో ఇంగ్లీషు, ఫ్రెంచి వారు తమతమ శక్తి పెంచుకొనుటకు పరోక్షముగానూ ప్రత్యక్షముగాను పాల్గొన్నారు. అప్పుడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నున్న భూభాగం అంతా ఆసఫ్ జా రాజ్యములో నుండెను. క్రీ.శ. 1780 ప్రాంతములో అసఫ్ జా లకు సహాయము చేసినందులకు ఉత్తర సర్కారులను అసఫ్ జా లు ఇంగ్లీషు వారి ఈస్టిండియా కంపెనీకి ధారాదత్తము చేసెను. అందులో బాగమైన కొండవీడు ముఖ్య పట్టణముగా గల ముర్తజా నగర్ సర్కారు (గుంటూరు మండలము) ను చెన్నపట్టణములో అప్పగించవలసినదిగా బలభద్రపాత్రుని సుందర రామయ్య, శ్రీనివాసరావు, జోగన్న దేశపాండ్యలకు అసఫ్ జా తాఖీదు క్రీ.శ. 1788 సెప్టెంబరులో పంపబడెను. తాఖీదు లోని విషమును పూర్తి గా అమలు చేసిన వారి వాజిబీ హక్కులు సలామత్‌గా ఉండునని, ఎదురు తిరిగిన శిక్షా పాత్రులని తాఖీదులో నున్నది. ఈ తాఖీదు 1 ఇప్పటికీ మన వద్దనున్నది.

క్రీ.శ. 1788 సెప్టెంబరులో దేశపాండ్యా ఉద్యోగములు వదలి వీరు అనగా బలభద్రపాత్రుని సుందర రామయ్య, శ్రీనివాసరావు, జోగన్న దేశపాండ్యలు, వారి మాతామహులు మామిడి సింగన్న వంశీయులు ( మామిడి సింగన్న కొండవీటి రెడ్డి రాజుల ప్రధాన మంత్రి. కొండవీటి చివరి రాజైన కుమారగిరి రెడ్డిని వదలి తన అగ్రహారములైన మామిళ్ళ పల్లికి వచ్చినట్లు తెలుస్తున్నది. ఈయన మహాకవి శ్రీనాధునకు సమకాలికుడు. వీరనారాయణ బిరుదాంకితుడైన కొండవీటి పాలకుడు అనవేమారెడ్డి కి ప్రధాన మంత్రి) నివశించుచున్న ప్రాంతమునకు

వెళ్ళుటకు నిశ్చయించి, ప్రస్తుతము గుంటూరు జిల్లాలోని వలివేరు, అంగలకుదురు, గ్రామములకు వచ్చిరి.

బలభద్రపాత్రుడు శస్త్ర జీవి. తరువాత వారి వంశీయులు శస్త్రములు వదలి భూమి పన్ను సేకరించు దేశ పాండ్యా అనే అధికారులుగా నుండి కడకు క్రీ.శ. 1788 తర్వాత పరిస్థితుల వలన ఆ అధికారమును గూడా వదలి వ్యవసాయమును గ్రహించిరని తెలుస్తున్నది. బలభద్రుని సంతతి బహుశః మనుమలు, మామిడి సింగన వంశీయులతో వివాహ సంబంధములు చేసిరి.

మామిడి సింగన వంశీయులకు ప్రస్తుతము తెనాలి పరిసర ప్రాంతములలో నున్న కూచిపూడి, వలివేరు,చినగాదెలవర్రు, మండూరు, అంగలకుదురు, చావారి పాలెం మొదలగు గ్రామాలున్న ప్రదేశం గాగల జమీందారీ ఉన్నట్లున్నూ, వారు ఆ జమీందారీ తమ దౌహిత్రులైన బలభద్రపాత్రుని వారికి క్రీ.శ. 1580 ప్రాంతమున యిచ్చినట్లున్నూ మెకంజీ రిపోర్టుల వల్లనూ, గ్రామ కైఫీయత్తుల వల్లనూ తెలియుచున్నది. ఆ కాలమున భూమియంతయూ తద్రాజ్యాధిపతిధిగా నుండి, అందు కొంత భూభాగములకు జమీందారులు, జాగీర్దారులు (దేశ్ముఖ్) లు గా నుండెడి వారు. భూమి సాగు చేయువారు వంశ పారంపర్యంగా భూమిలోని ఫలసాయాన్ని కొంత భాగం జమీందారు / జాగీర్దారుల కిచ్చి, మిగిలినది వారు అనుభవించెడి వారు. ఆ భూమిని వారు అమ్ముకొనుటకు, తనఖా పెట్టుకొనుటకు అధికారము లేకుండెనని

* అనుబంధం 2 చూడుడు

తెలియుచున్నది. ఆ జమీందారులు, జాగీర్దారులు తమ భాగమునకు వచ్చిన శిస్తులో కొంత రాజ్యాధికారి యైన రాజున కిచ్చి, మిగిలిన బాగములో తమ స్వంతమునకు, తమ సైన్యమును పోషించు కొనుటకును వినియోగించెడి వారు. అంతేగాక, దేవ, బ్రాహ్మణలకు కొన్ని కొన్ని సమయములలో రాజులు అగ్రహారములను దానము చేయుచుండెడివారు. అగ్రహారములు నుండి రాజునకు ఎలాంటి శిస్తు లభించేది కాదు. ఈ దానములు ఆచంద్రార్కములుగా దేవ బ్రాహ్మణులు అనుభవించవలెనని, అందుకు భిన్నముగా ఎవ్వరడ్డుకున్నను గోహత్యాపాతకమునకు గురియౌదురని శిలా, తామ్ర దాన శాసనములు చేసెడివారు. మామిడి సింగన్న కొండవీటి ప్రభువైన అనవేమారెడ్డి వద్ద ఒకానొక సూర్యగ్రహణ సమయమున, అగ్రహారములను దానముగా గ్రహించెను. ఆయన శ్రీనాధ మహాకవికి సమకాలికుడు, ఆప్త మిత్రుడు. అంతే కాక సూర్యసిద్ధాంత గ్రంధ కర్త. అనగా కూచిపూడి, వలివేరు మొదలగు గ్రామము లన్నియు ఆయన 14వ శతాబ్దములో పొందిన అగ్రహారములలో భాగమే. హిందూ రాజ్యవంశము లన్నియును ఈ దానములను గౌరవించినవి. కొండవీడు, రాజమహేంద్రవర రాజ్య పతనము, తర్వాత దేశము ఓఢ్ర గజపతుల ఆధీనమున నుండెను. ఈ కాలములో మామిడి సింగన్న వంశీయులు ఈ అగ్రహారముల ననుభవించిరి. తుదకు ముస్లిమ్ రాజ్యభాగమైనప్పటికీ ఈ ఆగ్రహారముల ఉనికి చెడకుండుట కారణములు రెండు 1. కుతుబ్ షాహీ వారు హిందూ ద్వేషము ఎక్కువగా వున్నవారు కారు. 2. ఈ అగ్రహారములు కుతుబ్ షాహీల వద్ద ఉద్యోగము చేసెడి వారివి.

(భూమి స్వంతము, దానిని అన్యాక్రాంతము చేసికొను అధికారము బ్రిటిష్ వారి పాలనలో జరిగినట్లు తెలియు చున్నది. (బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ గవర్నరు జనరల్ కర్నవాలీస్ క్రీ.శ.1793 లో బెంగాలు, బీహార్లలో శాశ్వత నిర్ధారణ (Permanent Settlement) ను అమలు చేసెను. దీనివలన అప్పటివరకూ ఉన్న జమీందారులు, జాగీర్దారులందరూ భూస్వాములైరి. అంతవరకు భూమిపై వచ్చు శిస్తులో భాగస్వాములైన వీరు భూమికి స్వంతదారులై, అన్యాక్రాంతము చేయు అధికారము గల వారైరి. భూమిలో పనిచేయు రైతులు, కౌలుకు చేసే పనివాళ్ళుగా మారిరి. ఈ స్వంతము అనే పదము, అన్యాక్రాంతము చేసే అధికారముతో పాటు, వంశ పారంపర్యముగా అనుభవించుటకు కూడా అధికారము కల్గించినది. 1793 వరకున్న పరిస్థితి ఒక్కమారు రూపురేఖలు మారిపాయి, భూమి దున్నేవాని నుండి వేరు చేయబడటమే కాక, ప్రభుత్వానికి భూమిపై అధికారము పోయినది.

దక్షిణ భారత దేశములో 1793 తర్వాత రైత్వారీ పద్ధతి ప్రవేశ పెట్టబడినది. తద్వారా అప్పటివరకు భూమిని దున్నించుకుంటూ ఉన్న చిన్న చిన్న జమీందారుల లాంటి వారంతా భూస్వాములైరి. వారితో పాటు చిన్న చిన్న భూభాగములను దున్నుకునే వారందరూ ఆ భూభాగములను స్వంతము చేసుకొని వంశపారంపర్యంగా అనుభవించే హక్కు, అనయాక్రాంతము చేయు హక్కు గలవారైరి. Modern India - pp 101 - 104 published by NCERT and written by Bipin Chandra.)

అప్పుడు జమీందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లు తమ స్వాధీనములో నున్న భూమికి స్వాము లైరి. ఈ వ్యవస్థకు కారణములు 1. ఇంగ్లండులో ఇటువంటి వ్యవస్థ ఉండుట., 2. ఈ వ్యవస్థ వల్ల భూమిని అమ్మి డబ్బు చేసుకొని దానితో ఇంగ్లండు నుండి వచ్చు దిగుమతులను కొనుటకుకావలిసిన మారకము సాంపాదించు వెసులుబాటు. ఈ విషయమును చరిత్రకారులు ధృవ పరచు చున్నారు.

మనకు స్వాతంత్ర్యము వచ్చు వరకు, గ్రామములలో రెండు రకముల భూమి యుండెడిది. 1. రైత్వారి భూమి దీనికి స్వామి రైతు. అతనికి ఈ భూమిని అన్యాక్రాంతము చేయు అధికారము అతనికి యుండెడిది. 2. ఇనాము భూమి (అగ్రహారభూమి) ఈ భూమిని అన్యాక్రాంతము చేయ వీలు లేదు.

స్వాతంత్యృము వచ్చిన తర్వాత ఇనాము భూములను స్వంతము చేసుకొను అధికారమిచ్చిరి. అట్లు బలభద్రపాత్రునివారు క్రీ.శ. 1580 సంవత్సరము నుండి మామిడి వారికి వారసులై, వారి అగ్రహారములను అనుభవించు చుండిరి. గ్రామ కైఫీయత్తుల ప్రకారం వారు అప్పటికే కొండవీడు (మూర్తజా నగర్ సర్కారుకు) స్థల కరణాలు ( దేశ్‌పాండ్యాలు) గా నున్నట్లు కూడ తెలియుచున్నది.

భూమి స్వంతము కానప్పుడు అన్నదమ్ములు దానినెట్లు విభజించు కొనిరన్న ప్రశ్న ఉదయించును. గ్రామములలో వృత్తులమీద ఆధారపడిన చాకలి, మంగలి, కుమ్మరి కులములవారు వారి పిల్లలకు గ్రామములోని యిండ్లను పంచెడివారు. అట్లే అగ్రహారములు కూడ వారనుభవించు భూములను తమ సంతతికి పంచెడివారు. కొన్ని సమయములలో వారికి

రాజు గారి ధృవీకలణ అవసరమయ్యేడిది. అందువలలనే బహుశః బలభద్రపాత్రుని వారు ఆస్థిపంపకమునకు రాజు అంగీకారమును క్రీ.శ.1754 లో తీసికొని యుండిరి.

అట్లు క్రీ.శ. 1580 నుండి అనుభవించు భూమి పై బలభద్రపాత్రునివారి వంశమువారు క్రీ.శ 1793 తర్వాత సర్వ అధికారములతో తమ స్వంతము చేసికొనిరి. ఎట్లనగా, క్రీ.శ 1788 సెప్టెంబరు లో ముర్తజా నగర్ సర్కారును బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వారికి చెన్నపట్టణములో ఆసఫజా నవాబుల ఆదేశానుసారం అప్పగించి, గత్యంతరము లేని పరిస్థితులలో తమ స్వంత గ్రామాలైన వలివేరు, చావారి పాలెం, అంగలకుదురు ప్రాంతమునకు వచ్చియుండవలెను.

వీరి వాజిబీ హక్కులనబడే మూర్తజా నగర్ సర్కారుపైని శిస్తులో భాగము, ప్రభుత్వము మారుట వలన వీరికి అందియుండలేదని తెలియుచున్నది. లేదా వీరు మరల హైదరాబాదుకు వెళ్ళి ఆసఫ్ జా నవాబుల వద్ద తమ హక్కుల పరిరక్షణకై అభ్యర్థించ నిష్ఠ పడక తమ అగ్రహారములకు తరలి వచ్చి యుందురు. అప్పుడున్న రాజకీయ పరిస్థితిలు, సామాజిక పరిస్థితులు వారికి తిరిగి ఏ విధమైన అధికారము కలుగ జేసినట్లు ఆధారములు లేవు.

వీరి అగ్రహారపు భూములు తూర్పు కనుమలలో పుట్టిన తుంగభద్రా నది యెడ్డున యుండి, వ్యవసాయమునకు కొంత జలాధారము కలిగి యున్నవి. కనుక, వీరు కమత గాళ్ళ ద్వారా వ్యవసాయము చేయించగల్గి, వ్యవసాయదారులుగా నుండి క్రీ.శ 1793 తర్వాత ఈ భూమి యంతటికి సర్వ హక్కులు పొందిరనుకొనవలయును.

...... వీరు కొండవీడులో నున్నపుడే శ్రీబాలాత్రిపుర సుందరీ భక్తులు. త్రిపురాంతకంలో వీరు విస్తృత పూజలు చేయుచుండెడి వారు.....

క్రీ.శ 1788, సెప్టెంబరు లో మూర్తజానగర్ సర్కారును బ్రిటిష్ వారికి అప్పగించవలసినదిగా చేసిన తాఖీదు లో బలభద్రపాత్రుని జోగన్న దేశపాండ్యా, సుందరరామయ్య, శ్రీనివాసరావు పేర్లున్నవి. వీరు ముగ్గురూ అన్నదమ్ములుగారు. కాని వారు ప్రథమ దేశపాండ్యా బలభద్రపాత్రుని పెద అప్పయ్యగారు. క్రీ. శ. 1712 లో కొండవీడు నందు దేశపాండ్యాగా నుండిరి. కాని వారికి క్రీ. శ. 1580 సంవత్సరము నుండి వలివేరు, అంగలకుదురు, చావారి పాలెం మొదలయిన గ్రామాలు అగ్రహారములుగా నున్నట్లు తెలియు చున్నది.

మా నాయనగారు ఈస్ట్ ఇండీయా కంపెనీకి మూర్తజానగర్ సర్కారును అప్పగించిన వారు చన్నయ్య, రామయ్య అని వ్రాశారు. అట్లు వ్రాయుటకే ఆధారములున్నవో తెలియుట లేదు. కాగా బలభద్రపాత్రుని జోగన్న దేశపాండ్యా వీరి తరువాత తరం వారు. అందువలన స్పష్టముగా వీరు అప్పగించినట్లు చెప్పుటకు వీలులేదు. మా నాయన గారు వ్రాసిన ప్రకారం. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు కొంత భరణముల యిచ్చిరి. కాని కాలక్రమేణ ఆ భరణం ఆగి పోయింది.

గ్రామ కైఫీయత్తులలో మండూరు గ్రామ కైఫీయత్ వున్నది. దీని ప్రకారం ఈ గ్రామములన్నియు కూచిపూడి సంతులో జేరి, రేపల్లె తాలూకాలో భాగముగా నుండెనని తెలియుచున్నది. అప్పటికి తెనాలి ఒక తాలూకాగా పరిగణింపబడక రేపల్లె తాలూకాలో భాగముగా నుండెనని

విశదమవుతున్నది. ఈ రేపల్లె తాలూకాను ఒక జమీందారీ గా వ్యవహరించేవారు. దీనికి రాచూరు జమీందారు రాజా మల్రాజు వేంకట గుండారాయణంగారలు. వీరు బ్రాహ్మణులు. ఈ జమీందారీని వారు కొనుగోలు చేసినట్లు మండూరు కైఫీయత్ వలన తెలుస్తున్నది.

క్రీ.శ. 1793 తర్వాత భూమిని శాశ్వత నిర్ధారణ చేసి రైత్వారీ పద్ధతి ప్రవేశ పెట్టిన తర్వాత, ఈ తాలూకాను బ్రిటిష్ వారు అమ్మకము చేసినట్లు తెలికొనవలయును. బలభద్రపాత్రుని వారికి, రేపల్లె తాలూకా జమీందారులకును మంచి స్నేహమున్నట్లు తెలియుచున్నది. ఆ స్నేహం మా ముత్తాత నరసింహం గారి తండ్రి కోటయ్యగారి వరకు వున్నట్లు తెలియుచున్నది. అనగా, క్రీ.శ. 1880 ప్రాంతము వరకు వున్నట్లు శ్రుతము. అంతేకాక, ఈ రెండు కుటుంబములకు బంధుత్వము కూడ కలదు. 1580 సంవత్సరమునుండి అనుభవించు అగ్రహారపు గ్రామములన్నియు బలభద్రపాత్రుని వారికి దక్కలేదు. 1793 సంవత్సరపు భూమి నిర్ధారణము వలన ఎవరు సాగు చేయు భూమి వారికి చెందుట వలన, వీరికి వలివేరు, చావారి పాలెం, అంగల కుదురులో నున్న భూమి, యిండ్లు మాత్రము మిగిలి నట్లు తెలియుచున్నది.

దేశపాండ్యా అను ఉద్యోగము వంశపారం పర్యంగా చెందు ఉద్యోగము. అనగా దేశపాండ్యాగా నున్న వారి పెద్ద కుమారునకు సంక్రమించు ఉద్యోగము. అందువలలనే జోగన్నను దేశపాండ్యాగాను, ఆయన కన్న పై తరముల వారైన సుందరరామయ్య, శ్రీనివాసరావులకు దేశపాండ్యాబిరుదు ఉపయోగింపకనూ తాఖీదును యిచ్చిరి. జోగన్న దేశపాండ్యా గానూ, మిగిలిన యిద్దరూ(సుందరరామయ్య,

శ్రీనివాసరావులు) వయస్సులో పెద్దవారైననూ, జోగన్నకు తండ్రి, తాతల తరము వారైనప్పటికీ, జోగన్న క్రింద పని చేయ వలసిన వారై యుండి యుందురు. బహుశః, తర్వాత వచ్చిన స్పర్థలకు యిదియే మూల కారణమైయుండుననుటకు సందేహము లేదు.

పెదఅప్పన్నగారు, మూర్తజానగర్ సర్కార్ (గుంటూరు) నకు(కొండవీడు ముఖ్యపట్టణముగా మున్నది), ప్రథమ దేశపాండ్యాగా నుండిరి. వీరు క్రీ.శ. 1710 ( 1122 ఫసలీ) లో దేశపాండ్యా గా వున్నట్లు మండూరు కైఫీయత్తు వలన తెలియు చున్నది. వీరికి చన్నయ్యా, అచ్చయ్యా, కోనయ్యా, పెద పాపన్న అను నలుగురు కుమారులు. వీరిలో చన్నయ్యా గారు, పెద అప్పన్న గారి తర్వాత దేశపాండ్యా పదవి చేపట్టిరి. వీరు సుమారు క్రీ.శ.1760 సమయంలో దేశపాండ్యాగా వుండియుండవచ్చును. వీరికి వేంకటాచలం, అప్పయ్యా అను యిర్వురు కుమారులు. వారిలో వేంకటాచలం సుమారు క్రీ.శ. 1784 లో దేశపాండ్యా గా వుండియుండవచ్చును. ఈయనకు పురుష సంతతి లేనందున తన తమ్ముడు అప్పయ్యా గారి జ్యేష్ట పుత్రుడు జోగన్న దేశపాండ్యా అయ్యెను. ఈయన సుమారు క్రీ.శ. 1785 నుండి దేశపాండ్యా పదవిలో వుండియుండ వచ్చును. ఈయనయే దేశపాండ్యాగా పదవిలో నున్న చివరి బలభద్రపాత్రుని వంశజుడు. అనగా ఈ వంశములో పెద అప్పన్న, చన్నయ్యా, వేంకటాచలం, జోగన్నలనే నలుగులు దేశపాండ్యా పదవిలో నుండిరి. జోగన్న దేశపాండ్యా 1788 సెప్టెంబరులో మూర్తజానగరు సర్కారు (గుంటూరు) ను బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వారికి ఒప్పగించిరి. తరువాత వీరు తమ తమ్ములు చన్నయ్యా, నర్సయ్యా లతో కలిసి వలివేరు

చేరినట్లు తెలుస్తున్నది. వీరి పితామహులైన చన్నయ్య గారి తమ్ములు అచ్చయ్య, కోనయ్య పెదపాపన్నలలో అచ్చయ్యగారికి పురుష సంతతి లేదు. పెద పాపన్నగారు వలివేరు చేరినట్లును, కొంతకాలం మండూరు గ్రామము ననుభవించినట్లును మండూరు గ్రామ కైఫియత్ తెలుపుతున్నది.

అప్పుడు మండూరు ప్రాంతమంతయు చిట్టడవిగా నుండుట, వాసయోగ్యము కాదనుకొని తిరిగి వలివేరు చేరినట్లు తెలియుచున్నది. కోనయ్యగారు కొండవీటి యందే యుండి, అన్నగారు చన్నయ్య దేశపాండ్యా పదవిలో ఉన్నప్పుడు ఆయన వద్ద ఉద్యోగము చేసెనని అనుకోవలసి వస్తున్నది. ఈ కోనయ్యగారి కుమారుడు సుందరరామయ్య జోగన్న దేశపాండ్యా గారి కాలం వరకు ఉద్యోగంలో ఉన్నట్లు తెలియు చున్నది. ఈ సుందరరామయ్య గారు, జోగన్న దేశపాండ్యాతో కలిసి మూర్తజానగర్ సర్కారు (గుంటూరు) ను బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి అప్పగించుటకు తాఖీదు వున్నది. ఈ సుందర రామయ్యగారు జోగన్న దేశపాండ్యాకు పిన తండ్రి వరుస. సుందరరామయ్యగారి జ్యేష్ట సోదరులు సుబ్బారాయుడుగారు, పట్టాభి రామయ్యగారు లకు పురుష సంతతి లేదు. వీరి తమ్ముడు చిన పాపన్నకు పురుష సంతతి యున్నది.

జోగన్న దేశపాండ్యా, సుందరరామయ్యల కన్న ముందే వీరందరూ వలివేరు వచ్చినట్లు విశదము. అప్పటికే పెద పాపన్నగారు వలివేరు చేరియుండిరి. ప్రథమ దేశపాండ్యా యైన పెద అప్పన్న గారి తమ్ముడు చిన చెన్నప్ప గారి వంశీయులు చావారిపాలెం, అంగలకుదురులలో స్థిరపడినట్లు వూహించవలెను. బహుశః వీరు క్ర.శ. 1720, క్రీ.శ. 1740

మధ్యలో యిక్కడు నివాస మేర్పరుచుకున్నట్లు వూహించవచ్చును. ఈ చిన చెన్నప్ప గారి కుమారుడు రామన్న గుజరాత్ వలస పోయి కొంత కాలము తర్వాత తిరిగి వచ్చెననీ, అందువలన ఆయనను గుజరాతు రామన్న యనెడి వారని అనుశ్రుతి.

పెద అప్పన్న దేశపాండ్యాగారి పిన తండ్రి మంగళాద్రిగారు. ఆయన కొండేపాడు (ఒంగోలు జిల్లాలో వున్నదని తెలుస్తున్నది) నివాసం గా ఉన్నట్లు తెలియు చున్నది. జోగన్న దేశపాండ్యా కాలం వరకు బలభద్రపాత్రుని వంశం వారు వలివేరు, చావారి పాలెం, అంగలకుదురు, కొండేపాడుల నందు నివాస మేర్పరుచుకున్నట్లు విశదము. కాని కొండేపాడు క్రీ.శ. 1712 లకే మంగళాద్రి గారి నివాసమై యుండవచ్చును. తరువాత క్రీ.శ. 1720 నుండి క్రీ.శ. 1740 మధ్య చిన చెన్నప్ప గారి వంశము చావారి పాలెం, అంగలకుదురు లను చేరినవి. చివరగా, దేశపాండ్యా గారి వంశస్థులు వలివేరులో నివాస మేర్పరుచు కొనిరి. ఈ వలసకు కారణములు రెండుగా కన్పిస్తున్నవి. మంగళాద్రి వారి వంశములో భార్యకు సంబంధించినవారు కొండేపాడు వాస్తవ్యులు కావచ్చును. అంతేకాక జీవనం గడుపుటకు అక్కడ నీటి వసతి యుండి, అప్పటికే వాసయోగ్య మై యుండవచ్చును.

అప్పటికి వలివేరు, చావారిపాలెం,అంగలకుదురులు వాసయోగ్యము కాకుండుటేనేమో, కొండేపాడు కుదురు వారు యిప్పటికి ఒంగోలు ప్రాంతంలో ఉన్నారని అనుశ్రుతి. చావారి పాలెం, అంగలకుదురుల వంశీయులు ప్రస్తుతం గుంటూరు లో వున్నారు. వలివేటి కుదురు, రెండుగా చీలి, ఒక వంశము మండూరు కుదురుగా, రెండవ

వంశము వలివేటి కుదురుగాయేర్పడినవి. ఈ కుదురులన్నీ ఒకదాని కొకటి ఎంత దూరమైన వంటే, ఆ కుదురులలో ఒకరితో నొకరు సంబంధ బాంధవ్యాలు లేక పోవడమే గాక, మృతి అశౌచము, పురుడు అశౌచములుగూడ పాటించే వారు కారు.

మండూరు కుదురు వారు, చాలావరకు కొటంరాజు వారి తోను, కొమరవోలు వారితోను వివాహ సంబంధాలు పెట్టుకున్నారు. కోటంరాజు వారు, కొమరవోలు వారు నరసరావుపేట, పొన్నూరులం దెక్కువ యున్నారు.

ఈ కుదురు వారు ఎక్కువకాలం కొండవీటి యందుండుట వలన ఈ సంబంధ బాంధవ్యాలు పెరిగినవి వూహింప వచ్చును. అట్లే వలివేరు కుదురు వారు వివాహ పరంగా పోచిరాజు వారు, లక్కరాజు వార్లతో సంబంధములు చేసిరి. పోచిరాజు వారు పెనుగుదురుపాడు నివాసీయులు. లక్కరాజు వారు కతేవరం వాస్తవ్యులు. కొండేపాడు, చావారిపాలెం, అంగలకుదురు వారుగూడ తమ నివాసములకు దగ్గర వున్న కుటుంబముల వారితో వైవాహికసంబంధములను నెరపి యుండవచ్చును.

బలభద్రపాత్రుని వంశీయులు బహు దర్పము, పట్టుదల కలవారని తెలుస్తున్నది. కాని ధనము మిక్కుటముగా సంపాదించినట్లు లేదు. వీరు 16 వశతాబ్దములో గజపతుల వద్ద సామంతులు గానుండి, అప్పటికే కూచిపూడి సంతునందు 44 గ్రామములు కలవారు. తర్వాత నాలుగు తరములు దేశపాండ్యా పదవిలో వున్నవారు. అయినను 1793 సంవత్సరమునందైన శాశ్వత నిర్ధారణ లో వారు జమీందారీ కొనుగోలు

చేయలేక పోవుటయే కాక, తమ గ్రామములు, రాచూరు జమీందారీలో భాగమై, దానిని రాజా మల్రాజు వేంకట గుండ్రాయణంగారు కొనుగోలు చేసినప్పటికీ యేమియు చేయలేక పోయినట్లు స్పష్టము.క్రీ.శ 1793 సంవత్సరము వరకు జోగన్న దేశపాండ్యా కుమారుడు చలమయ్యా, ఆయన తమ్ముడు చన్నయ్య కుమారులు అప్పయ్య, కన్నయ్యలకు యింకొక తమ్ముడు నరసయ్యలకు వలివేరు నందేస్థిరాస్తి యుండుట ఆశ్చర్యము. మరి ఏ యితర గ్రామములందు వారికి స్తిరాస్తి లేదు. కారణము ఆ గ్రామము లన్నియు అడవిగాయుండి వ్యవసాయమునకు అనుకూలముగా లేకపోవుట, త్రాగు నీటి సౌకర్యము లేకపోవుట వలన వాసయోగ్యము కాక పోవచ్చును. ఉదాహరణకు మండూరు గ్రామములో క్రీ.శ. 1940 వరకు కూడ మంచినీటికై చెరువు ఆధారముగానున్నదనే విషయము నాకు తెలుసు. వలివేరు నందు కూడ పూర్వము అనగా 80 సంవత్సరముల క్రితము తుంగభద్ర తీరముననున్న బావి నుండి త్రాగునీరు గ్రామవాసు లందరు తీసుకు వెళ్ళేవారు. మండూరు గ్రామ ప్రదేశము అడవిగా నుండెడిదని గ్రామ కైఫీయత్తు తెల్పుచున్నది.

జోగన్న దేశపాండ్యా ఆయన తమ్ములు చెన్నయ్య, నరసయ్యలతో వలివేరు నందు స్థిర నివాస మేర్పరుచుకున్నారు. నరసయ్యగారికి పుత్రసంతతి లేదు. వీరి ముగ్గురిది ఉమ్మడి కుటుంబం. జోగన్న దేశపాండ్యా కుమారుడు చెలమయ్య. చెన్నయ్య గారి కుమారులు అప్పయ్య, కన్నయ్యలు.తరువాతకాలం లో అప్పయ్యగారి యాజమాన్యం వచ్చినట్లు శ్రుతము. బహుశః అప్పయ్యగారు వయసులో చలమయ్యగారికన్న పెద్దకావచ్చును. ఉమ్మడి కుటుంబంలో

యాజమాన్యం పెద్దవానిదే కనుక ఈ ఊహ సరియైనదే నని తోచుచున్నది. అంతేకాక, నరసయ్య గారికి పుత్ర సంతతి లేక పోవడం వల్ల ఉమ్మడి ఆస్థికి యాజమాన్యం అప్పయ్యగారికి వచ్చి యుండవచ్చును.

ఈ అప్పయ్యగారు ప్రముఖుడు. లలితో పాసకుడు. లలితను తన పుత్రికగా చూచు చుండెడి వాడని తెలియు చున్నది. దీనికి ఉదాహరణగా ఒక కథ యున్నది.

అప్పయ్య గారికి పుత్ర సంతతతిలేదు. ఆరుగురు ఆడపిల్లలు. ఒకనాడు గాజుల వ్యాపారి తన మలారంతో వీరింటికి గాజులు వేయుటకు వచ్చెనట. గాజులు వేయు కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ప్రతిఫలం తీసుకునే సమయంలో గాజుల వ్యాపారి తాను 7 గురు ఆడపిల్లలకు గాజు లిచ్చినట్లు, అప్పయ్య గారి భార్య 6 గురు పిల్లలకు మాత్రమే గాజులు వేసెననియు తర్జన భర్జన పడిరట. అప్పుడు అప్పయ్యగారి భార్య గాజుల బత్తుకు తమ 6 గురు పిల్లలను చూపించినను, అతను అంగీకరింపలేదట. అంతేకాక ఏడవ పిల్లను వర్ణించెనట.

ఈ విషయము తెలుసుకుని అప్పయ్యగారు 'లలిత' గూడ గాజులు వేయించు కున్నది. ప్రతిఫలమిచ్చి పంపించుమని తనభార్యకు చెప్పి రట. తర్వాత అమ్మవారికి గాజులు వేయు వ్యవస్థను ఏర్పరచి కొంత భూమిని మాన్యముగా యిచ్చిరట. ఇప్పటికీ ఆ భూమిని గాజుల మాన్యమని పిలుతురు. ఆ విధముగా ఆయన లలితను తన కుమార్తెగా చేసుకున్న పుణ్యాత్ముడు. అప్పయ్యగారు శ్రీ లలితామ్మవారికి దేవాలయమును నిర్మించి ఆ దేవాలయ కార్యక్రమములు విధిగా జరుగుటకు విడివిడిగా భూ మాన్యమును ఏర్పాటు చేసిర్వి సుమారు

300 ఎకరముల భూమి శ్రీ లలితా దేవాలయ కైంకర్యమునకు వివిధ మాన్యములను యిచ్చెను. ఇవి పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యములు, వంది మాగధులు, గాజులు మొదలైన పేర్లతో ఈ మాన్యములు పిలువ బడుట విశేషము.

ఈ మాన్యములను వదలిన తర్వాత ఆయన ఉమ్మడి కుటుంబమునకు 300 ఎకరముల భూమినుంచెనట. ఆ భూమిని ఆయన 27గురు కమత గాళ్ళతో వ్యవసాయము చేయించు చుండెనట. ఆయన ఉదయం నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీలలితో పాసన చేసి, తరువాత వ్యవసాయపు పనులను తన కమత గాళ్ళతో చర్చించు చుండెనట. ఆకాలములో ఆయనకు పురాణం సుబ్బయ్య గారు పురోహితులుగా నుండిరి. రూపాకులవారు, అంబటిపూడు వారు కూడ పురోహితులుగా నుండిరట. కాని పురాణం సుబ్బయ్య గారు ముఖ్యపురోహితులు.

ఫలసాయము యింటికి తేరిన తర్వాత, వాటిని రాసులుగా పోయించెడి వారట. తన కార్యక్రమము పూర్తి యైన పిమ్మట, పావుకోళ్ళు వేసుకుని ప్రతిరాశి పైకి ఎక్కేవారట. కొంత పైకి ఎక్కిన తర్వాత ఆగి, తను ఎక్కినంత ఎత్తు ధాన్యము తనదిగను, మిగిలినది కమత గాళ్ళ ధాన్యముగాను నిర్ణయించెడివారట. తన వంతు ధాన్యముతో తన కుటుంబమును పోషించుకొనెడి వారు. ఆ విధముగచేయించుట వలన మిక్కిలి ధన సంపాదనకు ఎలా కలుగును

ఇట్లు ప్రశాంతముగా కాలము గడుపుచున్న సమయములో, ఒక రోజున, అప్పయ్య గారు అనుష్టానాది కార్యక్రమములు పూర్తి చేసుకుని

బయటకు వచ్చిన తర్వాత, ప్రధాన కమత గాడు అయనతో 'మన గుఱ్ఱము తమ పినతాత కోటయ్యగారి భూమిలో గడ్డి మేసినదనే నెపంతో, వారి బావమరదులు పోచిరాజు వారు, మన కమత గాడికి వంగినిలబడే శిక్ష వేశారు' అని చెప్పెనట.

అంత ఆయన వెంటనే 'ఈ గ్రామములో యిక మంచి నీరైనా ముట్టనని' చెప్పి, తమ ప్రధాన పురోహితులు పురాణం సుబ్బయ్య గారిని రప్పించి, నీరు తెప్పించి, పురాణం సుబ్బయ్యగారిని చేయి చాచమని చెప్పి, వారి చేతిలో నీళ్ళు విడుచుచూ, 'ఈ గ్రామము నందలి యావత్తు స్థిరాస్తి నీకు దానము చేయు చున్నానని' పల్కిరట. పురాణం సుబ్బయ్య గారు దిగ్భ్రమ చెంది 'అయ్యా మీరేమి చేయుచున్నా రనెనట'.

అప్పుడు అప్పయ్య గారు 'అవమానము జరిగిన ప్రదేశములో నే నుండను. అందువలన ఈ స్థిరాస్తిని మీకు దానముచేసితి'నని చెప్పెనట. వెంటనే తన కమత గాళ్ళను, బండ్లు కట్టమని ఆజ్ఞాపించెనట. 27 బండ్లలో తమ చరాస్తి తోను, కుటుంబముతోను, తన పశుసంపదతోను, ధాన్యముతోను బయలు దేరి తూర్పు దిక్కుగా ప్రయాణమైనారట. వారు రేపల్లె రాజా మల్రాజు వేంకట గుండారాయణం గారి దగ్గరకు (రాచూరు జమీందారు) వెళ్ళవలెనని సంకల్పించిరట. చీకటి పడే సమయానికి వీరందరూ ప్రస్తుతము మండూరు గ్రామమున్న ప్రదేశమునకు

---

* *క్రీ.శ. 1805లో అప్పయ్యగారు వలివేరులో శివాలయము పునరుద్ధరించి, శ్రీ లలితామ్మవారిని ప్రతిష్ఠించి, యినాములు యిచ్చిరి. గ్రామ కైఫీయత్తులు 5 భాగం. వలివేరు పుట 148 151*

చేరిరట. వీరితో వీరి పురోహితులు అంబటిపూడివారు, రూపాకులవారు వెంటనడచిరట. ఆ ప్రదేశములో నున్న స్థానికులు ఎదురువచ్చి అప్పయ్య గారిని ఆ ప్రదేశమున వుండమని కోరిరట. ఆ కాలములో ఆ ప్రదేశ మంతయు చిట్టడవి. త్రాగు నీరు లేదు. దేవాలయము లేదు. అవి అన్నియు గమనించి అప్పయ్య గారు తాము దేవాలయము లేని ప్రదేశములో వుండమని చెప్పిరట. అప్పుడు ఆ స్థానికులు యిక్కడ ఒక శివ లింగ మున్నది, స్వామి పేరు మాండవీశ్వర స్వామి అని, ఆయనకు పూజా పునస్కారములు లేకున్నవని చెప్పిరట. వెంటనే ఆ ప్రదేశము శుభ్రము చేయించి, తమ పురోహితులతో సంప్రోక్షణ కార్యక్రమము జరిపించిరట. అప్పటికి కమత గాళ్లు బండ్లను దింపి తత్కాల విడిది చేయగా స్త్రీ జనము వంటలు చేసిరట. పూజా కార్యక్రమము పూర్తిచేసి, అందరూ భోజనములు చేసి విశ్రమించిరట. అప్పటి నుండి అప్పయ్యగారు తిరిగి వలివేరు ఎప్పటికీ వెళ్ళలేదు. అంతేకాక తమ దాయాదులతో సంబంధములు తెంచుకొనెను. పోచిరాజు వారితో సంబంధములు చేయలేదు. ఆ కుదురులో తరవాత వారు గూడ తమతో పూర్వము నుండి సంబంధములు గల కోటంరాజు వారితోను, కొమరువోలు వారితోను, సంబంధములు కొనసాగించిరి.

ఈ వంశమువారి పట్టుదలకు దర్పమునకు యిది యొక నిదర్శనము. సౌమ్యుడు, లలితో పాసకుడు అయిన అప్పయ్యగారు తమకు అవమానం జరిగిన చోటును శాశ్వతముగా విడిచిరి. బలభద్రుడు యింతకు పూర్వము తమకు గజపతులవలన జరిగిన పరాభవమునకు వగచి, తిరిగి కటకమునకు గాని, తమ సామంత రాజ్యమునకు గాని

వెళ్లలేదు. ఈ పరిస్థితిని విశ్లేషించిన అప్పయ్య గారి నిర్ణయము సబబేనని మనకు విశదమౌతుంది. తనకు అవమానము జరిగినదని తెలిసిన వెంటనే ప్రతీకారపుటూహ కలుగుట సహజము. ఆ ప్రతీకారము పోచిరాజు వారి పైనా, లేక తన దాయాదుల మీదనా?

తమ దాయాదుల అండ లేక పోయిన పోచిరాజు వారికింత ధైర్యముండదని ఆయనకు స్పష్టమైనది. వీటికి కారణము అంతరంతరంగా వీరి కుటుంబములో నున్న స్పర్థ. దాయాదుల అసూయ. అప్పయ్య గారు వెంటనే ప్రతీకారము చేయ నెంచిన తమ దాయాదులకు గూడఆ జ్వాలలు తగులును. అంతటితో ఆ స్పర్థ ఆగదు. ప్రతీకారము చేయకుండుట తన దర్పమునకు, గౌరవమునకు మచ్చ. దానికి శాస్వత పరిష్కారము దాయాదులను పూర్తిగా వదలి వేయుట. వారితో సంబంధ బాంధవ్యములను త్రుంచి వేయుట. ఆ గ్రామమును వదలుట. ఆగ్రామమును వదలుటకన్న తన ఆరాధ్యదేవతైన శ్రీలలిత దేవాలయమును వదలుట ఆయనకు మిక్కిలి బాధ కల్గించి యుండవలెను.

ఏది ఏమైనను లలితను కుమార్తెగా పొందితి నను సంతోషము, తాను ఆమె దేవాలయమును వీడుపోవు చున్నానను బాధ కంటె మిన్న గదా. తన కుమార్తె తనతోనే వచ్చుచున్నది కదా. ఈ విషయములన్నియు ఆయన మధించి, నిర్ణయము తీసుకుని వెంటనే కార్యరూపమిచ్చెను. లలిత తమ కుటుంబముతోనే వచ్చినదను పూర్తి విశ్వాసముండుట వలననే వలివేరులోని దేవాలయముతో గాని, దాని యాజమాన్యమునుగాని ఎటువంటి సంబంధము పెట్టుకొనలేదు. ఆ దేవాలయము తో తర్వాత ఏమీ సంబంధము లేనట్లు మండూరు కుదురు వారు నడచు కొనిరి.

ఈ విషయము లన్నియు పరిశీలించిన పిమ్మట అప్పయ్యగారి గొప్పతనము విశదమవుతుంది. ప్రతీకారాపేక్షతో అపకారము చేయుటకన్నా, ఆ ప్రదేశమును వదలుట, ఆస్థిని తృణ ప్రాయముగా నెంచుట, దేవాలయమును వదలి వెళ్ళిపోవుట మంచిదని ఆయన తెలుసుకొనుట ఈ లక్షణాలన్నీ ఆయన ఘనతను పెంపొందించాయి. అయితే ఆయనలోని దర్పము, ప్రతీకార వాంఛ, తమ దాయాదులతో సంబంధ బాంధవ్యాలను త్రెంచి వేసింది.

అప్పయ్యగారి వెంట ఆయన పెదతండ్రి జోగయ్య దేశపాండ్యా కుమారుడు చలమయ్య, అప్పయ్య గారి తమ్ముడు కన్నయ్యలు తమ కుటుంబములతో ఉమ్మడి కుటుంబముగా నుండినవి. మండూరు చేరిన తర్వాత అక్కడి పరిస్థితులు సింహావలోకనం చేసిన అప్పయ్యగారికి త్రాగు నీటి సమస్య పెద్దదిగా కన్పించి యుండవలెను. ఆయన వెంటనే స్వజనాన్ని తాత్కాలిక విడిదియందు విడిచి, రాచూరి జమీందారు రాజా మల్రాజు వేంకట గుండారాయణం గారిని కలిసికొని, మండూరుకు సంబంధించిన భూమిలో 600 ఏకరములను వ్యవసాయమునకు 'కైకోలు' చేసెను.కైకోల అనే పదము గ్రామ భూముల విషయంలో అందరికీ తెలిసిందే. జమీందారు భూములలో తమకున్న ఆస్తిని, దానిపై ప్రభుత్వపు పన్ను చెల్లించలేని పరిస్థితులలో వ్యవసాయదారులు విడుదల చేయించుకుని, భూమిని ప్రభుత్వ పరం చేసెడి వారు. వ్యవసాయము చేసి, పన్ను చెల్లించ గలవారికి అటువంటి ప్రభుత్వ భూములను కైకోలు చేసెడి వారు. ఈ ఆచారము క్రీ.శ. 1930 లో కూడ నుండినదట. అట్లు సంపాదించిన భూమిని మరల బాగు చేయించి, వ్యవసాయమునకు

అనుకూలముగ చేయుట, వాసయోగ్యమైన గ్రామమును నిర్మించుట, అప్పయ్యగారి సమస్యలు.

తాను సంపాదించిన 600 ఎకరముల భూమిలో 30 ఎకరములలో త్రాగు నీటి చెఱువును, మరో 30 ఎకరములలో పశువుల కొఱకు చెఱువును త్రవ్వించెను. మంచి నీటి చెరువు కలుషితం కాకుండుటకు ఒక కాపలా దారుని నియమించి, వాని జీత భత్యములకోసం 3/4 ఎకరం భూమిని ఏర్పాటు చేయించెను. మాండవేశ్వరస్వామి దేవాలయమును వృద్ధిచేసి, కొంత నిర్మాణము చేసి, ఆ దేవాలయమును (నిర్వహణకు) యాజమాన్యము చేయుటకు, మాండవేశ్వర స్వామి అమ్మవారి నిత్య నైమిత్తిక పూజలు నిరాఘాతంగా జరుగుటకు విడి విడి గా భూమిని కేటాయించి, దానిని మాన్యము చేయించిరి.

మాన్యమనగా ప్రభుత్వ పన్నులు వసూలు చేయని భూమి. ఆయన జీవిత కాలములో అప్పుడే గ్రామముగా నేర్పడుతున్న చినగాదెలవర్రు గ్రామములో మల్లీశ్వరస్వామి దేవాలయమునకు 25 ఎకరములు మాన్యముగా నిచ్చిరి. ఈ దేవాలయమును ప్రతిష్టించినవారు కొమరవోలు వారు.

అప్పయ్యగారి పెదతండ్రి జోగన్న గారి పుత్రుడు చలమయ్యగారు అప్పయ్యగారితో మండూరు వచ్చినా రనుటకు ఒక వృత్తాంతము అనుశృతముగా నున్నది. ఈయన కొంచెం భోగలాలసుడు. ఉదయమైన తర్వాత కొంత సమయమునకు (సుమారు 10 గంటల ప్రాంతము) ప్రతి దినము వీధి అరుగు మీద కూర్చుండెడి వాడట. అప్పుడు ఆ దారి వెంట కృష్ణ కాలువ నుండి మంచి నీరు కావడితో తెచ్చుకునే వారిని

ఆపి ఆ నీటిని తన పూల చెట్లకు, కాయగూర తోటలకు పోయించేవాడట. కృష్ణ కాలువ మండూరుకు సుమారు మైలు దూరములో నుండును. చలమయ్యగారు కావడితో నీరు తెచ్చు వారి శ్రమను మగనించక ఆ నీరు తమ చెట్ల పాదులకు పోయించెడివారు. గ్రామ వాసులు బాధ పడినా ఏమీ అనలేక ఓర్చుకునేవారట. అయితే చలమయ్యగారు వీరందరకూ కష్టకాలమున ధాన్యము విరివిగా దానము చేసెడి వారట. ఈ వృత్తాంతము వలన చలమయ్యగారు, అప్పయ్యగారు, కన్నయ్యగారు క్రీ.శ. 1848 లో మండూరు నందున్నారు. ఎందుకనగా కృష్ణానదికి ఆనకట్ట వేయబడి, కాలవల ద్వారా నీటి సరఫరా మొదలైనది ఆకాలములోనే. అప్పయ్యగారు మండూరు లో మంచినీటి చెఱువు ఏర్పాటుకూడా త్రాగు నీరు యిబ్బంది గమనించి చేసియుండురు.

చలమయ్యగారికి కోటయ్య అనే ఒక కుమారుడు కలిగెను. ఆడ సంతతి కూడ ఉండియుండ వచ్చును. ఈ కోటయ్యగారికి పుత్రసంతతి లేదు. కన్నయ్యగారికి కోటయ్య, కామయ్య అను యిద్దరు కుమారులు. వీరు జోగన్న దేశపాండ్యా మనుమడు కోటయ్యగారికి సమకాలికులు. జోగన్న దేశపాండ్యాగారి మనుమడు కోటయ్యగారితో జోగన్న దేశపాండ్యా గారి వంశము ఆగి పోయినవి. ఆ తర్వాత కన్నయ్యగారి కుమారుడు కోటయ్యగారు, కామయ్య గారి వంశములే మండూరు కుదురుగా మిగిలి పోయినవి. వీరే అప్పయ్యగారి ఆస్థి, జోగన్న దేశపాండ్యా మనుమడు కోటయ్యగారి ఆస్థికి వారసులైనారు. ఒక వేళ దేశపాండ్యా ఉద్యోగము ఈ వంశములో వుండి వుంటే జోగన్న దేశపాండ్యా గారి మనుమడు కోటయ్యగారి తర్వాత చన్నయ్య గారి

మనుమడు (కోటయ్యగారి కుమారుడు) నరశింహంగారు, ఆయన కుమారుడు సుందరరావు గారు, ఆయన కుమారుడు సూర్యారావుగారు దేశపాండ్యాగా నుండెడి వారు.

అందువలననే కాబోలు మాతండ్రి సూర్యారావుగారు తమను దేశపాండ్యాగా కొన్ని రోజులు చెప్పేవారు. మహారాష్ట్ర సంప్రదాయంలో ఈ దేశపాండ్యా పదవిని యింటి పేరుగా పరిగణించు చున్నారు. ఆ పద్ధతిన బలభద్రపాత్రుని వంశములోని వారందరూ దేశపాండ్యా లని తెలుపుకోవచ్చును. కాని దేశపాండ్యా పదవి జోగన్న దేశపాండ్యా తోనే ఆగి పోయింది.

కోటయ్య గారి భార్య పేరు రత్తమ్మ గారు. క్రీ.శ. 1916 ప్రాంతమున తీసిన వారి చాయాచిత్రము మా దగ్గర నున్నది. ఆమె కోటంరాజు వారి ఆడపడుచని వినికిడి. కోటయ్యగారు శృంగార పురుషుడని వినికిడి. ఆయన తరచూ రాచూరు జమీందారుల వద్దకు వెళ్ళు చుండెడి వాడనియూ, గుఱ్ఱము పై వెళుతూ దారిలో గ్రామ ములందు మజిలీలు చేసెడి వారట. ప్రతి గ్రామమునందుఒక వనిత అయన కోసం ఎదురు చూచేదట. ఆయనకు యిద్దరు కుమారులు. వారు నరశింహంగారు, వెంకటప్పయ్యగారలు. ఒక కుమార్తె. ఆమెను తెనాలికి దగ్గరనున్న కుచ్చెళ్ళ పాడు గ్రామ కరణంగారికి యిచ్చి వివాహము చేసిరి. కుచ్చెళ్ళపాడు కరణంగారు కూడ కోటంరాజు వారు. కోటయ్యగారు కొద్దికాలం పెదగాదెలవర్రు, చినగాదెలవర్రులకు కరిణీకం చేసి తమ 57వ ఏట దివంగతులైరి. కామయ్యగారు మండూరు గ్రామ కరణంగానుండి అక్కడనే స్థిర పడిరి. ఆయనకు శేషయ్యగారొక్క రే పుత్ర సంతానము. శేషయ్యగారు నరశింహం

గారి కన్న వయస్సులో పెద్ద. శేషయ్యగారు, నరశింహం గారు పొన్నూరు సమీపంలో నున్న మునికుదురు గ్రామానికి చెందిన కోటంరాజు వారి ఆడపడుచులు అక్కచెల్లెండ్రను వివాహమాడిరి. శేషయ్యగారి భార్య సుబ్బమ్మగారు. నరశింహం గారి భార్య శేషమ్మగారు. ఈ వివాహముతో శేషయ్యగారి కుటుంబము, నరశింహంగారి కుటుంబము దగ్గరయినవి. వేంకటప్పయ్యగారు మతుకుమల్లి వారి ఆడపడుచును వివాహమాడెను.

సుబ్బమ్మగారికి, శేషమ్మగారికి సోదరులు లేరు. నరశింహం గారు వారి తల్లికి దత్తుగా దాయాదులైన కోటంరాజు దుర్గయ్య గారిని యిప్పించి, ఆయనకు ఆస్థి యిప్పించిరి. దుర్గయ్యగారు చాలా కాలము తమ అక్కగారైన శేషమ్మగారి యింటియందుండిరి.

మన సాంప్రదాయములో సోదరులులేని వనితను వివాహమాడుటలేదు. దీనికి కారణము పుట్టినింటి వంశము అంతరించకుండుట ముఖ్యమని. అంతకంటె ప్రబలమైన కారణము సోదరులు లేని యింటనుండి వచ్చిన వనిత ఎప్పటికిని పుట్టినిల్లు తనదే యనుకొనును. మెట్టినిల్లు తనదనుకొనుటకు పుట్టినింట సోదరులు అవసరము.

బలభద్రపాత్రుని వారి మండూరు కుదురులో నింకొక ఆచారమున్నది. నీరు దేశపాండ్యాలుగా నున్న సమయములో తమ కుమార్తె వివాహము చేసిన వెంటనే వరుని వెంట పంపక, కొన్ని ఘడియల తర్వాత వధువుని కొంత బంధుజనముతో, అరణములతో అత్తవారింటికి పంపించుట ఆచారముగా నుండెడిది. ఆ ఆచారము ఇప్పటికిని పాటించు చున్నాము.

మన వివాహాలు వేదోక్తమై అందరికీ ఒకే రకమైన విధముగా నిర్వహించినను కుటుంబములో నున్న ఆచారములు తప్పక పాటించవలెనన్న ధర్మము వలన ఒక్కొక్కప్పుడు వేర్వేరు పద్ధతులుగా నుంటవి. ఈ సందర్భములో వివాహమును గురించి మరి కొన్ని విషయములు అప్రస్తుతమైనా వ్రాస్తున్నాను. ఆంధ్రదేశంలో కొన్ని ప్రాంతాలలో బాసికములు కట్టు పద్ధతి లేదు. అట్లే ఎదురుకోల అనే తంతు జరుపుతారు. వరుని, వారి బంధు జనముతో కలిసి వివాహమునకు వచ్చు నపుడు తండ్రి, తల్లి, బంధుజనము ఎదురేగి వారిని విడిదికి తీసుకుని వచ్చుట ఆచారము.

ఈ ఎదురుకోళ్లు తంతు అందుకు భిన్నంగా వధూసహితంగా ఆమె బంధు జనము వరుని సహితంగా వారి బంధుజనము ఎదురెదురుగా నడచుచూ చేసుకునే సల్లాపాలు. వివాహములో వధూవరులు వివాహ ముహూర్తమున హస్త మస్తక సంయోగం జరిగినప్పుడే ఒకరి నొకరు చూచెదరు. అందు కొరకు ఆసమయము వరకు వదూవరుల మధ్య తెరసెల్లా పెట్టెదరు.

కాని ఈ ఎదురుగోళ్ల తంతులో వధూవరులు ఒకరినొకరు చూచుకొనెదరు. మన ధర్మములో అష్ట విధ వివాహములున్నవి. అనేక పరిస్థితులలో స్త్రీ పురుషుల కలుసుకునే పరిస్థితులున్నప్పుడు వారి కలయికను వివాహం క్రిందికి తీసుకువచ్చి వారికి గలిగే సంతానానికి అవమానములు జరుగ కుండా చేసిరి. అందు బ్రాహ్మణులు వేదోక్త వివాహం ప్రశస్తమని చెప్పారు. అదేవిధంగా, అష్టవిధ పుత్రులను కూడ పేర్కొనిరి. వీని వలన సమాజంలో కొంత మందిపై న్యూనతా భావం

వుండకుండ తీసుకున్న జాగ్రత్తలు అని తెలియు చున్నవి. ఈ విషయముల వలన కుటుంబంలో కొన్ని ఆచారములుగా మిగిలి పాటింబడుతవి. ఈ ఆచారములను గూడ గౌరవించ వలయు నన్నది శాస్త్రము. ఈ ఎదురుకోలు తంతు కూడ కొన్ని కుటుంబములలో అట్లే పాటింప బడు చున్నది.

అప్పయ్యగారు మండూరులో శ్రీ చక్రము తమ గృహములో ప్రతిష్ఠించి, ఉపాసన చేసెడి వారు. మండూరు కుదురు వారు ఈ యంత్రమును (పీఠమును) దాదాపు క్రీ.శ. 1942 వరకు అవిఘ్నముగా అందరూ ( మండూరు, చినగాదెలవర్రు లో నున్నవారు కూడా) కలసి దేవీ నవరాత్రములలో (దసరా) విస్తృత పూజలు చేసే వారు. మాణిక్యారావు (కన్నయ్యగారి ముని మనవడు, మండూరు గ్రామ కరణం) గారు దివంగతులైన తర్వాత, ఈ పీఠమును కృష్ణానదిలో వదలి వచ్చిరి. బలభద్రపాత్రుని వారి యిండ్లలో శ్రీచక్ర పూజ ఆగిపోయి, ప్రతి శుక్ర వారం శ్రీలలితా సహస్రనామంతో పూజ చేయుట జరుగుతున్నది. ఇప్పటికీ శ్రీలలిత ప్రతి తరంలోను తమ పుత్రికగా భావించబడటం ఈ కుటుంబాలలో జరిగింది. ఇది పూర్తిగా తెలిసి చేస్తున్నా రని అనుకో గూడదు. తమ సంతానానికి శ్రీ లలిత పేర్లు పెట్టుకోవడం లోని ఔచిత్యం పరోక్షంగా ఈ భావనను బలపరుస్తున్నది. మండూరులో వీరి గృహములన్నియు మంచి నీటి చెఱువుకు దక్షిణముననూ, తూర్పున ప్రధాన మార్గముగల ప్రదేశములలోను ఉన్నవి. ఇప్పటికీ ఈ గృహములలో నొకటి (శ్రీ బలభద్రపాత్రుని మాణిక్యారావుగారి గృహము) అచ్చటనే యున్నది.

కన్నయ్యగారి కుమారులైన కోటయ్యగారు కామయ్యగారి తరం వచ్చేటప్పటికి ఆస్థి కరిగిపోయి 60 ఎకరముల భూమి మాత్రం మిగిలింది. బహుశః అసమయంలో బ్రిటిష్ ప్రభుత్వం గ్రామ పరిపాలనలో భాగంగా గ్రామ కరణాలను నియమించు చుండిరి. కామయ్య గారు మండూరు గ్రామ కరిణీకం చేపట్టిరి. తరువాత కోటయ్య గారు చినగాదెలవర్రు, పెదగాదెలవర్రుల గ్రామ కరణీకం చేపట్టిరి. కోటయ్యగారు సుమారు 57 సంవత్సరములు జీవించి నట్లును, ఆయన జీవితంలో చివరి దశలో చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు లకు గ్రామ కరిణీకం చేసిరని శ్రుతము. కోటయ్యగారు తాము మండూరు నుండియే కరిణీకంలో నుండిరని తెలియవస్తున్నది.

జోగన్న దేశపాండ్యా గారి కుటుంబము వలివేరులో 40 సంవత్సరముల కన్న ఎక్కువ రోజులు ఉండలేదు. కోటయ్య గారి వంశము మండూరులో సుమారు 50 సంవత్సరములు, చినగాదెలవర్రులో 65 సంవత్సరములుండిరి. బలభద్రపాత్రుని వంశం వారు ఏ ప్రదేములోను నికరముగా నుండక, ప్రతి 50 60 సంవత్సరములకు ఆవాసం మార్పు చేస్తున్నట్లు కనబడుతుంది.

మొదట కాకతీయ రాజ్యమునందు, తదుపరి ఓడ్ర రాజ్యములోను, క్రీ.శ. 1500 ప్రాంతంలో కటకమునందు, తదుపరి హైదరాబాద్ లో కుతుబ్ షాహీల వద్ద, కతుబ్‌షాహీల పతనానంతరం ఔరంగ్ జేబ్ రాజ్యంలోను, తర్వాత నిజాం నవాబురాజ్యంలోనూ వుండి, చివరకు క్రీ.శ. 1710 ప్రాతమున కొండవీటికి వచ్చిరి. కొండవీటియందు 4 తరములు ( అనగా సుమారు 80 సంవత్సరములు), వలివేరు నందు సుమారు 40

సంవత్సరములు, తరువాత మండూరు నందు నివాసమేర్పరుచుకొనిరి. కాని మామిడి వారి దౌహిత్రులుగా వారసత్వముతో క్రీ.శ. 1580 నుండి క్రీ.స 1793 వరకు. వలివేరు, మొదలగు 44 గ్రామములు అగ్రహారముగా అనుభవించిరి. జమీందారులుగా వ్యవహరించు చుండిరి. క్రీ.శ 1793 తర్వాత వారికి మండూరు గ్రామంతో సంబంధం యేర్పడి క్రీ.శ 1820లో 600 ఎకరములకు భూస్వాములుగును, క్రీ.శ. 1870 సంవత్సర ప్రాంతమున 60 ఎకరముల భూస్వాములుగను మిగిలిరి. మిగిలిన 540 ఎకరముల భూమి మాండవేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి వారల నిత్య నైవేద్య దీపారాధనలకు, స్వస్తవాచకము చెప్పుటకును మాన్యములుగా నిచ్చిరి. అందు 60 ఎకరములు మాత్రము త్రాగు నీటి చెఱువుల, పశువుల చెఱువుల క్రింద నుండినది. ఈ సమయమున రూపాకులవారు, అంబటిపూజి వారు పురోహితులుగా నున్నట్లు తెలియుచున్నది.

కన్నయ్య గారి తదనంతరం, వారి కుమారులు కోటయ్యగారు, కామయ్యగారు ఉమ్మడి కుటుంబంలోనే యుండిరి. కోటయ్యగారు పెదగాదెలవర్రు, చినగాదెలవర్రు గ్రామాల కరిణీకం చేపట్టిన తరువాత, ఆయన చివరి దశలో నివాసమునకు చినగాదెలవర్రు వచ్చిరని తెలియుచున్నది. అప్పుడు కోటయ్యగారు, కామయ్యగారు ఆస్తి పంపకము చేసి కోగా, కోటయ్యగారికి 30 ఎకరముల, కామయ్యగారికి 30 ఎకరముల భూమి వచ్చెను.

కోటయ్యగారి అనంతంరం వారి కుటుంబం చినగాదెలవర్రులో స్థిరపడిరి. ఇక్కడ యింకొక విషయం ప్రస్థావించడం అవసరమనుకుంటాను.

చినగాదెలవర్రులో కోటయ్యగారు తమ గృహమునకు వశ్చిమమున నున్న నివేశస్థలము, గృహము కొమరవోలు అప్పయ్య గారి తాత గారికిచ్చిరి. అట్లే చినగాదెలవర్రులోని కొంత భూమి తాడిగొండ శేషగిరిరావు గారి తాత గారికి యిచ్చిరి.

దీనిని గురించి ప్రచారంలో వున్న విషయమే మమనగా, వీరి కుటుంబమున యిద్దరు ఆడపిల్లలు వికలాంగు లగుటచే ఒక ఆడపిల్లను కొమరవోలు వారింటి కోడలుగాచేసి వారికి ఆస్థినిచ్చి చినగాదెలవర్రు వాస్తవ్యులుగా చేసిరని, మరియొక ఆడపిల్లకై ఆరాధ్యులైన తాడికొండ వారిని తీసుకు వచ్చి వారికి కూడ అస్థి యిచ్చిరని. కొమరువోలు వారి కుటుంబము దాదాపు 1945 వరకు ఆగృహముననే యుండి తర్వాత ఆస్తి, యిల్లు విక్రయించి వేడలి పోయిరి. వీరి కుటుంబము పొరుగునున్న బలభద్రపాత్రుని కుటుంబముతో శత్రుత్వముతో నుండిరి.అయినను కొమరువోలు అప్పయ్య గారి మరణ కాలమున శ్రాద్ధ సమయమున మా తండ్రిగారు సూర్యారావు గారు వెళ్లిరి. ఈ ఇద్దరు ఆడ పిల్లలు కోటయ్య, కామయ్య గార్లకు తోబుట్టువులని నా ఊహ. కారణము మండూరులో కోటయ్యగారు, కామయ్యగారు ఉమ్మడి కుటుంబముగా నున్న సమయములోనే ఈ వివాహములు జరిగియుండవలెను. ఈ రెండు కుటుంబములకు ఆస్థి యిచ్చిన తర్వాతనే కోటయ్యగారు, కామయ్యగారు చెరి 30 ఎకరముల భూమిని తీసికొనిరి. తరువాత కాలములో కామయ్యగారి కుటుంబముతో ఈ రెండు కుటుంబములకు ఏమీ సంబంధములు కన్పడవు.

కోటయ్య గారి తర్వాత ఆయన జ్యేష్ఠ కుమారుడు నరశింహం గారుపూర్తిగా చినగాదెలవర్రు వాస్తవ్యులు, గ్రామ కరణం ఆయెను. ఈయన చిన్న తనములోనే అనగా 35 36 సంవత్సరములు జీవించి మరణించెను. ఈయన స్త్రీ లోలుడు. తరచు సుఖ వ్యాధులతో బాధ పడెడి వాడని ప్రతీతి. కాని బహు ఉదారుడు. ఆయనకు ప్రభుత్వము నుండి నెలకు 7 1/2 రూపాయలు వేతనము వచ్చెడిది. ఆ కాలములో రూపాయిని చూసినవారే బహు తక్కువ. రూపాయికి 16 అణాలు. 2 అణాలు బేడ అనెడివారు. అణాకు 4 కానులు. అనగా రూపాయికి 64 కానులు. కానికి 3 పైసలు. అనగా రూపాయికి 192 పైసలు.

ఒక పైస కూడ వస్తువు కొన గలిగెడిది. వివాహ సమయములో చాల ధనవంతులు మాత్రమే ఒక రూపాయి చదివించ గలిగే వారు. వరకట్నము 116 రూపాయలన్న చాలా ధనికుల సంబంధమని అనుకొనెడివారు. 7 1/2 రూపాయలతో భార్యా,భర్తలు, ఇద్దరు పిల్లలు ఒక నెల సాధారణముగా జీవింప గలిగే వారు. అణా నాణెము చాలా సాధారణముగా కనిపించే నాణెము. ఈ కాల పరిస్థితులు బాగుగా తెలియవలె నన్న శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి వేయిపడగలు చదువ వలెను. రూపాయి నాణెమును 7/8 తులము వెండితో చేసెడి వారు. బంగారము 8 గ్రాములు, 10 రూపాయలుండెడిదట. అట్టి సమయములో తెనాలి నందు ఇంగ్లీషు చదువు నేర్పు బడి లేకపోవుట వలన నరశింహం గారు తన తమ్ముడు వేంకటప్పయ్యగారిని గుంటూరు పంపించి చదివించారు. వేంకటప్పయ్యగారు చదువు పూర్తి చేసి తెనాలి తాలూకా కచేరీలో (ఆఫీసులో) గుమాస్తాగా చేరారు. తాలూకా కచేరీలో

పదవీ విరమణ చేసి వారు 1950 వరకు జీవించి వున్నారు. వారిని నేను గూడ చూచితిని, మాట్లాడితిని.

ఆయనను మండూరు వాస్తవ్యులు, మతుకుమల్లి వారు అల్లునిగా చేసికొనిరి. నరసింహం గారు తమ అక్కగారితో రాకపోకలు లేక యుండెడి వారు. నరశింహం గారిని, ఆయన తల్లి రత్తమ్మ గారు తమ కుమార్తెను చూచుటకై కుచ్చెళ్ళపాడు వెళ్ళుటకు తరచు ప్రోద్బలము చేసెడిదట. ఆయనకు అక్కడకు వెళ్లుట యిష్టముండెడిది కాదు. తమ బావగారికి మర్యాద తెలియదని, అసూయ పరులని అనెడి వారట. కాని తల్లి బలవంతము పైన గుఱ్ఱము నెక్కి కుచ్చెళ్లపాడు వెళ్ళిరట. ఆయన రాకకు అక్కగారు మిక్కిలి సంతోషించి, కమతగానితో మా తమ్ముడు వచ్చినాడు. వాని గుఱ్ఱము శుభ్రపరచి, శనగగుగ్గిళ్లు పెట్టుమన్నారట. వెంటనే ఆమె భర్త శనగగుగ్గిళ్లు అవసరము లేదు. ఉలవగుగ్గిళ్ళు పెట్టుమనెనట. అది విన్న నరశింహం గారు, ఆరోజే అక్కడినుండి తిరిగి వచ్చెనట. ఆ తర్వాత ఆ కుటుంబముతో సంబంధము పెట్టుకొన లేదట.

ఆయన మరణానంతరం, ఆడపిల్ల 12 సంవత్సరములు పుట్టింటికి రాకుండ ఉండటం మంచిది కాదని, ఆమెని తీసుకు వచ్చి, నిద్ర చేయించి, బట్టలు పెట్టి పంపారట మా తాతమ్మగారు. కాని ఆకుటుంబముతో వేంకటప్పయ్యగారికి సంబంధముండేది. రాక పోకలుండేవి. మా చిన తాతగారు హనుమంతరావుగారు కూడ వారింటికి వెళ్ళేవారు. కాని మా తాతగారు సుందరరావు గారు ఎప్పుడూ వాళ్ళింటికి వెళ్ళలేదు. హైదరాబాదులో ఒకసారి మా చిన తాతగారు హనుమతరావుగారు 1954లో వారి మేనత్త మనుమడు కోటంరాజు బాబూరావు గారింటికి

నన్ను తీసుకు వెళ్ళారు. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయములో ఎమ్.ఏ చదివేటప్పుడు, బాబూరావు కెమిస్ట్రీ లో ఎమ్.ఎస్.సి చేసి రిసెర్చి స్కాలర్ గా వుండేవాడు. తర్వాత అతను కెనడాలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ కుటుంబము కూడా హైదరాబాదులోనే ఉన్నట్టు మా చిన తాతగారు హనుమంతరావుగారు చెప్పేవారు.

నరశింహం గారు క్రీ.శ 1900 ప్రాంతంలో చనిపోయారు. అప్పుడు ఆయన పెద్ద కొడుకు (మా పితామహులు) సుందరరావు గారు చాల చిన్న వారు. మశూచి తగిలి, తగ్గిన తర్వాత స్నానం చేయిస్తున్నప్పుడు నరసింహం గారి తమ్ముడు వేంకటప్పయ్య గారు వచ్చి, బలవంత పెట్టి ఆస్తి పంపకం చేయించారట.

నరశింహం గారి కుటుంబానికీ, వేంకటప్పయ్యగారి కుటుంబానికీ చెరి 15 ఎకరముల భూమి వచ్చినది. ఆయన భాగం యిల్లు యల్లంపల్లి వీరయ్య అనే వైశ్యుడు కొన్నారు. వేంకటప్పయ్యగారు ఉద్యోగం చేసేటప్పుడు తెనాలిలో కొంత యింటి స్థలము కొని తన బావమరది పేర వ్రాయించిరట. ఆ స్థలము తన పేరు మీద వుంటే అందులో అన్నగారికి భాగం యివ్వాల్సి వస్తుందనే భయం తో అలా చేశారట. ఆస్తి పంపకాల తర్వాత అయన తెనాలి లోని స్తలాన్ని తనపేర మార్పించుకుని యిల్లు కట్టుకుని అక్కడే స్తిర పడ్డారు. వేంకటప్పయ్యగారి మనుమరాలి వివాహానికి ఆయింటికి మానాన్నగారితో నేను కూడా వెళ్ళాను. నరశింహం, వేంకటప్పయ్య గార్ల తల్లి రత్నమ్మగారు చినగాదెలవర్రులోనే వుండేవారు. మొట్ట మొదటి సారిగా తల్లికి మనోవర్తిని విభాజనలో భాగంగా చేసిన ఘనత వేంకటప్పయ్యగారికే దక్కుతుంది.

పిల్లల ఆస్తి పంపంకం చేసుకునేటప్పుడు తల్లికి పిల్లలందరూ ఆమె జీవితాంతం భృతికి యిచ్చే దాన్యము, బట్టలు, భూమిని మనోవర్తి అనెడివారు. పిల్లలు తండ్రితో విభాజనము చేసుకున్నప్పుడు, పిల్లలతో సమానముగా, ఆయనకు ఒక వంతు వచ్చేది. ఆ భాగము మీద తండ్రికి సంపూర్ణ అధికారముంటుంది.

వేంకటప్పయ్యగారు తల్లి రత్నమ్మ గారిని సంవత్సరానికి ఒకసారి తెనాలి తీసుకు వెళ్ళేవారు.అప్పుడు ఆమెకు రావలసిన మనోవర్తి ధాన్యము, బట్టలు, ఆమెకు యిప్పించి తనతో తీసుకెళ్ళేవారు. రత్నమ్మగారికి, ఆమె చిన్నకోడలికి పొసగేది కాదట. అందువల్ల తెనాలిలో ఒక వారం కన్నా ఎక్కువ రోజులు వుండేది కాదట. వారం కాగానే మళ్ళీ చినగాదెలవర్రు చేరేదట. ఆమె జీవితాంతం అలాగే జరిగిందట. ధన,ధాన్య దరిద్రాన్ని ఎప్పుడూ ఆధిగమించవచ్చు. మళ్లీ సంపాదించ వచ్చు. కాని భావ దారిద్ర్యాన్ని అధిగమించలేము. అది మానవుని మరణాంతం పీడిస్తూనే వుంటుంది.

మండూరులో కామయ్యగారి కొడుకు శేషయ్యగారు తండ్రి తరువాత కరణం అయ్యారు. ఆయన సుబ్బమ్మగారిని (నరశింహం గారి భార్య శేషమ్మగారి అక్క) వివాహమాడారు. ఆయన సంతతి మాణిక్యారావు గారు, కామేశ్వరరావు, సుందరరావు, ఆదిలక్ష్మి, వరలక్ష్మి. శేషయ్యగారు స్త్రీలోలుడు. మండూరులోనే ఒక చాకలి వనితతో సంబంధ మేర్పరుచుకుని, ఆమెకొక యిల్లు కట్టించారు. ఆమె కోసం చేసే వ్యయం కోసం అప్పులు చేయడం ప్రారంభించారు. సుబ్బమ్మగారు చదువులేని అమాయకురాలు. లలిత యొక్క గణాచారి. అమెను

శ్రీలలితాంబ ఆవహించేది. దేవి ఆవహించిన సమయంలో అమె మా తాతగారు సుందరరావుగారి నాలుక పై బీజాక్షరాలు వ్రాసిందట. ఆమె క్రీ.శ. 1944 వరకు జీవించింది. అమె నాకు చాలా బాగా తెలుసు. ఆ ప్రస్థావన మరోసారి చేస్తాను.

నరశింహం గారు మరణించే సరికి ఆయనకు 15 ఎకరముల భూవసతి,యిల్లు వుండేవి. ఆయనకు నలుగురు పిల్లలు. వాళ్లు సుందరరావు గారు, హనుంతరావుగారు, శ్యామలాంబ, కామేశ్వరమ్మ గారలు. శ్యామలాంబగారు, మా తాతగారు సుందరరావుగార్లు రోగ పీడతులట. శ్యామలాంబగారికి వివాహమైనా గూడ, యేకారణం చేతనో భర్త తీసుకొనివెళ్ళక పోవడంతో సోదరుల వద్దనే వుండేది. ఆమె చిన్నతనం లోనే చనిపోయింది.

సుందరరావుగారు నరసరావు పేట లోని కోటంరాజు వేంకటాచలం పంతులుగారి నాలుగవ కుమార్తె సీతారామమ్మను పెండ్లి చేసుకున్నారు. శ్రీ వేంకటాచలం పంతులుగారు వృత్తిరీత్యా న్యాయవాది. ఆయన పెద్ద కూతులు ఆదిలక్ష్మి కామేశ్వరీ దేవి. ఆమె భర్త దినవహి కృష్ణారావుగారు. రెండవ కుమార్తె సుబ్బమ్మగారు. ఈమెను మేనల్లునికే యిచ్చి పెండ్లి చేశారు. మూడవ కుమార్తె వరలక్ష్మమ్మగారు. ఈమె భర్త వల్లూరు బసవరాజు గారు. ఐదవ కుమార్తె లక్షమ్మ గారు. ఈ మె అబ్బరాజు వారి కోడలు. అమెకు బాల్యంలోనే భర్తృవియెగం కలిగింది. వీరందరిని నేనెరుగుదును. శ్రీవేంకటాచలం పంతులుగారికి పురుష సంతతి లేదు. ఎల్లాప్రగడ భగవంతరాయడు ఈయన బావ మరది.

శ్రీవేంకటాచలం పంతులుగారు చనిపోయేటప్పుడు సత్యనారాయణ అనే పిల్లవానిని దత్తత తీసుకున్నట్లు వ్రాశారట. ఈ సత్యనారాయణగారు మా నాయనమ్మ సీతారామమ్మ గారికన్న చిన్న. లక్ష్మమ్మ గారికన్న పెద్ద. ఎల్లాప్రగడ భగవంతరాయుడుగారు తన కూతుర్ని సత్యనారాయణగారికి యిచ్చి పెళ్లి చేశారు.

ఇంతలో వేంకటాచలం పంతులు గారి ఆస్తిని దాయాదులు ఆక్రమించుకున్నారు. అప్పుడు న్యాయస్థానములో వ్యాజ్యము వేయుటకు భగవంత రాయుడు గారు సత్యనారాయణను తీసుకుని వల్లూరి బసవరాజు గారితండ్రి జగన్నాధ రాజు గారి వద్దకు వెళ్ళారట. వల్లూరు జగన్నాధరాజుగారు చాలా ధనవంతులు వడ్డీ వ్యాపారులు కూడా. ఆయన విషయమంతావిని, 'సత్యనారాయణా, మీ నాన్నగారు కాగితం మీదవ్రాసిన దత్తు ఆధారంగా వ్యాజ్యం నడపమంటున్నావు, నేను గెల్చినచోకర్చులు యిస్తావు సరే, కాని ఒక వేళ నేను ఓడిపోతే మరి కర్చులు ఎలా యిస్తావు' అని ప్రశ్నించి, తను సహాయము చేయక పంపివేసెను. అప్పుడు భగవంత రాయుడు గారు అల్లుని వెంట బెట్టుకుని, మా తాత గారు సుందరరావు గారి సహాయము కోరి వచ్చారు. అప్పటికే మా తాత గారు కరిణీకం తీసుకొని తాలూకాలో బుద్ధిశాలిగా మంచి పేరు కలిగి వున్నారు. ఆయన యిప్పటి 8వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆయన రోగిష్టి అగుటచే ప్రతి రోజూ సూర్యుని ఆరాధిస్తూ, సూర్యనమస్కారాలు చేసే వారు. ఆయనను సంప్రదించ వచ్చిన బంధువులకు సమయము దొరకక, యింట్లోనే బస చేసి, భోజన సమయంలో తమ గోడు చెప్పుకునే వాళ్ళు.

మా తాత గారికి తన తల్లి శేషమ్మగారిపై ప్రేమ గౌరవం ఎక్కువగా వుండేవి. శేషమ్మగారు ఏమీ చదువుకోక పోయినా, మంచి వ్యవహార దక్షురాలు. పిల్లల చిన్నతనంలోనే మరిది ఆస్తి పంపకాలు చేసుకుని వెళ్లి పోయిన తర్వాత, ఉన్న ఆస్తిని చాలా నేర్పుతో ఆమె యాజమాన్యం చేసేవారు. ఆమె దక్షతను తెలివితేటలను గురించి చినగాదెలవర్రు చుట్టుపక్కల గ్రామాలన్నింటిలోను గొప్పగా చెప్పుకునేవారు. అంతేకాక ఆమె వైద్యము చేసేదట.

చినగాదెలవర్రు గ్రామంలోని శ్రీమల్లీశ్వరస్వామి దేవాలయంలోని పూజారి మామిళ్లపల్లి పిచ్చయ్య గారికి వైద్యము నేర్పి, బసవరాజీయం తెప్పించి యిచ్చి, ఆయనతో యింటింట మామూలుగా వచ్చే సామాన్య రోగాలకు కావలసిన మందులు తయారుచేయించే వారు. ఆమె ఒక్కతియే యింట్లోవారికి, వచ్చిన బంధువులకు వంటచేసి పెట్టేది. భూములు, వ్యవసాయము, ధన సంబంధమైన వ్యవహారములు అన్నీ కూడా జ్ఞాపక ముంచుకుని ఒక క్రమ బద్ధంగా నిర్వహించేది. నోటి లెక్కలలో అమె దిట్ట. ఇంట్లోనూ, ఊళ్ళోను అందరికీ తలమానికంగా ఉండేవారు. అక్కగారి కుమార్తె ఆదిలక్ష్మిని కూడా తీసుకు వచ్చి పెంచిందట. ఆదిలక్ష్మి చిన్న తనములోనే భర్తను పోగొట్టుకుని, దిక్కుతోచక వుంటే, అమె సొమ్ముతో ఆమెపేరున భూమిని కొని ఆ వ్యవసాయం కూడాతనే చూసేది. ఇంతటి కార్యనిర్వాహకురాలైనా ఆమెకు చదవడం, వ్రాయడం రాదు.

అయినా కాని, శ్రీలలితా సహస్రనామం, అష్టోత్తరం, విఘ్నేశ్వర పూజ, మంత్రపుష్పం, అన్ని పూజా విధానాలు ఆమెకు కరతలామకం.

వేంకటాచలం పంతులుగారు చనిపోయిన 2 3 సంవత్సరముల తర్వాత, మా నాయనమ్మ గారికి మసూచి పోసినదని తెలిసి నరసరావు పేట వెళ్ళిన ఆమె (మా తాతమ్మ గారు), అక్కడ రక్తవర్ణముతో వున్న బియ్యముతో భోజనము చేయలేక బాధపుడుతున్న, 8 ఏండ్ల పిల్ల అయిన మా నాయనమ్మగారిని తన వెంట మావూరు (చినగాదెలవర్రు) తీసుకు వచ్చి, కోడలితో పథ్యము చేయించి, సంపూర్ణ ఆరోగ్య వంతురాలిగా చేసినారు. ఆమెను మా నాయనమ్మ అత్తగారి వలె కాక తల్లిలాగా చూసుకునేది. తరువాత కాలంలో ఆమెకు పెద్ద కుమారుని పక్షము తీసుకోవాలో, లేక అత్త గారి పక్షము తీసుకోవాలో నన్న క్లిష్ట పరిస్థితుల్లో అత్తగారి పక్షమే వహించేది. మా తాతమ్మగారికి మా నాన్నగారంచే వల్లమాలిన ప్రేమ. కాని చివరి దశలో తన చిన్న కుమారిని కోసమై ఆమె నడిపిన వ్యవహారము వలన తన పెద్ద మనుమనికి దూరము కావలసి వచ్చింది. ఆమెకు తానంటే ఎంతో ప్రేమయని మా నాన్న గారే చెప్పేవారు. ఆయన చెప్పిన మాటలే నేను ఉదహరిస్తాను. మా నాయనమ్మకు మా నాన్న గారి తర్వాత మరో కొడుకు పుట్టాడు. ఆయన పేరు నరసింహారావు గారు. ఆయన సంవత్సరం లోపునే మరిణించారు. మా తాతగారు గుంటూరు వెళ్లి బండిలో మా నాయనమ్మను, మా నాన్న గారిని తీసుకుని వచ్చి, బండి దిగగానే, అమ్మా, నీ మనవణ్ణి గుంటూరులోనే ఖననం చేసి వచ్చాను అన్నారుట. వెటనే భోరు భోరున దుఃఖంతో విలపించిందట. ఇంతలో మా నాన్న గారు బండి దిగి రాగానే ఆమె దుఃఖం మటుమాయమై పోయి మా నాన్నగారిని హత్తుకుని అక్కున జేర్చుకుని ముద్దాడారట. మరొక ఉదాహరణ మా నాయన గారి తండ్రి మరణం తన 14 ఏట జరిగింది.

అప్పటికి ఉపనయనమైన ఆయన శ్రాద్ధము పెట్టాలి. మా నాన్నగారు ఆకలికి తట్టుకోలేరు. ఒక వైపు పుత్ర మరణ దుఃఖం ఏంతగానో వున్నా, మనవడిమీద ఆపేక్షతో, శ్రాద్ధమై పురోహితులు భోజనము చేసి పిండాలకు నైవేద్యము పెట్టిన గారెలను, భోజనమునకు ఆలస్య మగునని, విడిగా మా నాన్నగారి చేత తినిపించేవారట. మా తాతమ్మ గారిని గురించి తెలిసిన విషయములు వ్రాశాను. ఆమె చేసిన అసాధ్యమైన పనులు ఇతరుల ద్వారా విన్నపుడు , ఇటువంటి పనులు చదువు లేని ఒక సామాన్య స్త్రీ చేయగలిగిందా అని ఆశ్చర్య పడక మానము.

అటువంటి మా తాతమ్మగారు వడ్డిస్తుండగా, మా తాతగారి సహ పంక్తిలోమిగిలిన బంధువులు, అతిధులతో పాటు భగవంతరాయుడు గారు, సత్యానారాయణ గారు కూడా వున్నారట. భగవంతరాయుడు గారు మా తాతగారికి అన్ని విషయాలు చెప్పి, వల్లూరు జగన్నాధరాజు గారి మాటలు కూడా చెప్పారట. మా తాత గారు ఏమీ మాట్లాడలేదట. మా తాతమ్మగారు భగవంతం అంత పెద్ద ఆస్తిపరులే నీకు సహాయం చేయకుంటే, మే మేం సాయం చేయగలం అన్నారట.

ఆయన నిరుత్తరులైనారట. తర్వాత మా తాతగారు (బహుశః మా తాతమ్మగారి ప్రోత్సాహముతో) వ్యాజ్యము నడిపారు. మా తాతమ్మగారు ఈ విషయములో చొరవ చూపించడానికి కారణము అదే పరిస్థితులలో తన తండ్రికి కోటంరాజు దుర్గయ్యగారిని దత్తు యిప్పించి, పుట్టింటి ఆస్తియంతయు యిప్పించిన సంఘటనే అని నా ఊహ.

తన కోడలి పుట్టింటి వంశము వృద్ధి పొందాలన్నదే ఆమె కోరిక. తరువాత వ్యాజ్యము సత్యనారాయణ గారి పక్షమై, ఆయన గెలుస్తారు

అని నమ్మకం కలిగిన తర్వాత, వేంకటాచలం గారి దాయాదులు సత్యనారాయణ గారితో (మా తాతగారికి తెలియకుండా) మంతనాలు చేసి, ఆస్థిలో కొంత భాగము తీసుకుని మిగిలిన ఆస్తి నంతటిని సత్యనారాయణ గారికి యిచ్చేటట్లు ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందము ప్రకారము వ్యాజ్యమును ఉపసంహరించు కున్నారు. ఇది మా తాత గారికి పెద్ద అవమానము. దీనికి మా తాతమ్మగారు, మా తాతగారును చాలా ఉదారంగా భగవంతం గారిని, సత్యనారాయణగారిని క్షమించిరని తెలుస్తున్నది. ఆ తర్వాత మా తాత గారి సహాయముతో సత్యనారాయణగారు తన ఆస్థి అంతయు చక్క బరచుకున్నారు. సత్యనారాయణగారిని స్వంత బావమఱది వలెనే ఆదరించారని తెలుస్తున్నది.

కాని మా నాయన గారు తమ పెంపుడు మేనమామను క్షమించలేదు. ఒక విధమైన జుగుప్స చూపెడి వారు. తల్లి బాధపడుతుందేమో నని కూడా చూడకుండా సత్యనారాయణగారిపై కోపము చూపెడి వారు. తరువాత సత్యనారాయణగారి కుమార్తె శ్యామలను మా బాబాయిగారు చంద్ర కళాధరరావుకు వధువుగా నిచ్చుటకు ప్రయత్నించగా మా నాయనగారు యిష్టపడలేదు. సత్యనారాయణకారికి మా నాన్నగారన్న విపరీతమైన భయము. ఎదురుగా వచ్చి ఎప్పుడూ మాట్లాడటం నేను చూడలేదు.

మా తాతగారు సుమారు 17 సంవత్సరములు కరిణీకం చేసి, 1924 లో స్వర్గస్థులయ్యారు. ఆయన అంత తక్కువ సమయములో తమ భాగమునకు వచ్చిన 15 ఎకరముల భూమిని పెంచి 20 ఎకరములు

చేయుటయే కాక, ఆ భూమిని ఫలవంతమైన ప్రదేశములో వుండేటట్లు మార్చారు. ఆయన ఆదాయం రోజుకు ఒక నవర్సు అట. అప్పటి వెల 10 రూపాయలు. ఆయన గ్రామ కరణంగా నెల వేతనం 71/2 రూపాయలు మాత్రమే. రోజూ ఉదయం భోజనము చేసి వ్యవహారము నిమిత్తము తెనాలి వేళ్ళేవారట. సాయంత్రం ఇంటికి వచ్చి తల్లి చేతికి నవర్సుకు తక్కువ కాకుండా యిచ్చే వారట. ఆయన తన భార్యకి, మరదలికి, ఇద్దరి చెల్లెళ్ళకు ఒక్కొక్కరికి 100 నవర్సుల బంగారపు నగలు చేయించారట. చదువుకోసం తమ తమ్ముడు హనుమంతరావుని బందరు పంపించారట.

మా తాత గారు తమ కుటుంబముతోను, మండూరులోని వారి పెదతల్లి సుబ్బమ్మ గారు, పెద తండ్రి శేషయ్యగారు, మరి కొందరు బంధుజనము, పురోహితులతో కలిసి సంపూర్ణ ఉత్తర దేశ యాత్ర చేశారట. వారు నాగ పురము మీదుగా ఉజ్జయిని, గయ, కాశి, ప్రయాగ, హరిద్వార్, ఆయోధ్య క్షేత్రములన్నీ దర్శించి, కాశీలో 10 రోజులు వున్నారట. గయ, కాశి, ప్రయాగ క్షేత్రాలలో శ్రాద్ధ విధులు నిర్వ ర్తించి, తర్వాత పండరీపురం చూచి, యింటికి తిరిగి వచ్చారట.

హరిద్వారము నుండి తెచ్చిన గంగోదకముతో రామేశ్వరములోని ఈశ్వరునకు అభిషేకము చేసినచో యాత్ర సమపూర్ణముగును. కాని ఆయన జీవిత కాలములో రామేశ్వర యాత్ర పూర్తి చేయలేక పోయారు. ఇంటికి వచ్చిన తర్వాత ఆయన చక్కదిద్ద వలసిన కుటుంబ వ్యవహారములు ఎక్కువగా యున్నట్లు తెలిస్తున్నది. మండూరులో శేషయ్యగారు అప్పులు చేయుటయే కాక తమ భూసంపద పోగొట్టునే

పరిస్థితి వచ్చింది. శేషయ్యగారి పిల్లలు ఆర్ధికంగా పూర్తిగా దెబ్బతినే పరిస్థితి. ఆప్పటికే శేషయ్యగారి పెద్ద కుమారుడుమాణిక్యారావుగారు, కొమరవోలు రామమూర్తి గారి రెండో కూతురు అన్నపూర్ణమ్మగారిని పెండ్లి చేసుకున్నారు. కొమరవోలు రామమూర్తిగారి పెద్ద కుమార్తె రాజమ్మగారిని హనుమంతరావుగారు వివాహ మాడిరి. దానితో మండూరు, చిన గాదెలవర్రు లోని బలభద్రపాత్రుని వారి కుటుంబములు మళ్ళీ దగ్గరైనవి. అలాగే మా పెద తాతమ్మ సుబ్బమ్మ (శేషయ్యగారి భార్య) గారి పెంపుడు తమ్ముడు దుర్గయ్యగారు తమ కుమార్తె దుర్గమ్మగారిని, సుబ్బమ్మగారి ద్వితీయ కుమారుడు కామేశ్వరరావు గారికి యిచ్చి వివాహము చేసిరి. మూడవ కుమారుడు సుందరరావుకు కూడా వివాహమైనది. సుబ్బమ్మ గారి రెండో కుమార్తె వరలక్ష్మి గారిని భీమవరపు నరసింహారావు గారి కిచ్చి వివాహము చేసిరి. పెద్ద కుమార్తె ఆదిలక్ష్మిని మతుకుమల్లివారి కోడలిని చేయగా ఆమె బాల్యములో నే వితంతువై ఎక్కువ కాలము తన పినతల్లి శేషమ్మగారితో చినగాదెలవర్రు లో వుండేది.

ఈ పరిస్థితులలో మా తాతగారు తమకున్న పలుకు బడితో శేషయ్యగారికి అప్పు దొరక కుండ చేశారట. తర్వాత అప్పిచ్చిన వాళ్ళందరూ ఒక్కసారిగా శేషయ్యగారిపై వత్తిడితెచ్చేటట్టు చేశారట. అప్పుడు శేషయ్యగారు మా తాత గారి దగ్గరికి వచ్చి, ఆయన సహాయాన్ని కోరారు. ఆయన ఒక నిర్ణయానికి కట్టుబడువుంటే సాయం చేస్తానని మాతాతగారు చెప్పారు. ఆయన సరే అనగానే, వారి ఆస్థి ముగ్గురు కుమారులకు సమానముగా పంచి, శేషయ్యగారు 2 ఎకరములు తన

యిష్టానుసారము వాడుకొనే విధంగా పరిష్కారము చేశారట. పరిష్కారము కాగానే అప్పులిచ్చిన వారిని పిలిపించి వాయిదాల పద్ధతిలో వారి అప్పు తీర్చే ఏర్పాటు చేశారట. ఈ ఏర్పాటును శేషయ్యగారు అవమానకరంగా భావించి, సుందరరావు గారు బ్రతికి వుండగా వారింటికి వెళ్ళనని ప్రతిజ్ఞ చేశారట. శేషయ్యగారు చనిపోయే వరకు ఆ 2 ఎకరములలోని ఫలసాయము తానుంచుకున్న చాకలి స్త్రీకే యిచ్చేవారట. తర్వాత ఆ ఆస్తి ఆమె కుమారునకే యిచ్చారట.

శేషయ్యగారు చనిపోయినప్పుడు మాణిక్యారావుగారు, కామేశ్వరరావుగారు, సుందరరావుగార్లతో పాటు ఆ చాకలి స్త్రీ కుమారుడు కూడా కర్మలో పాల్గొన్నాడట. మా నాయనగారు ఆయనను నవ్వుతూ ఒరే బాబాయి అని పిలిచేవారట.

వేంకటప్పయ్యగారికి ముగ్గురు కుమారులు. గోపాలరావుగారు, నరసింహారావుగారు, కనక సుందర శర్మలు. గోపాలరావుగారు రంగమ్మగారిని, నరసింహారావు గారు కోటంరాజు వారి ఆడపడుచు సీతమ్మగారిని, కనక సుందర శర్మ గారు వలివేరు కుదురుకు చెందిన కోనయ్యగారి దౌహిత్రి అప్పచ్చమ్మ గారి కుమార్తె సీతమ్మ గారిని వివాహమాడారు.

వలివేరు కుదురు వారైన కోనయ్య గారి కుమారుడు, వేంకటప్పయ్యగారి కుమార్తె అప్పచ్చమ్మగారు. ఈమెను పెనుగుదురుపాడు వాస్తవ్యులైన పోచిరాజు కృష్ణమూర్తిగారికిచ్చి పెండ్లి చేశారు. ఆమెకుమార్తె సీతమ్మ గారే కనకసుందరశర్మ గారి భార్య. *(అప్పయ్యగారు వలివేరు వదలిన తర్వాత వలివేరులో కోనయ్యగారి*

*వంశముతో సంబంధములు లేవు. దాదాపు 100 సంవత్సరముల తర్వాత ఈ వివాహము జరిగింది).* గోపాలరావుగారు, కనకసుందర శర్మ గార్లు వృత్తిరీత్యా న్యాయవాదులు. కనకసుందర శర్మగారు రాజకీయములలో ప్రవేశించి తెనాలి లో కాంగ్రెస్ పార్టీలో కొన్ని పదవులు నిర్వహించిరి. నవసిహారావుగారు రైల్వేలో డాక్టరుగా వుండేవారు. వీరందరు తరచు చినగాదెలవర్రు వచ్చేవాళ్లు.

వేంకటప్పయ్యగారికి, మండూరులో నున్న కుటుంబమునకు చిన్న చిన్న విషయములలో స్పర్ధలుండేవి. మండూరులో త్రాగునీటి చెరువు చుట్టూ చింత చెట్లుండేవి. ఆ చెరువులో తామరాకులుండేవి. పశువుల చెఱువులో జమ్ము వుండేది. ప్రతి సంవత్సరము వీటన్నింటిమీద కొంత డబ్బు వచ్చేది. అందులో భాగములు, యాజమాన్యంకోసం వీరిలో తరచు తగువులు జరిగేవి. మండూరులో అప్పయ్యగారిచే ప్రతిష్ఠింపబడిన శ్రీ చక్ర పూజ యధావిధిగా జరుగుతుండేది. దసరా లలో జరిగే విశిష్ఠ పూజలకు చినగాదెలవర్రు, మండూరు కుటుంబాలు మండూరులో కలిసేవి. వేంకటప్పయ్యగారి కుటుంబము మండూరులో జరిగే దసరా ఉత్సవాలకు వచ్చేవారుకారు. ఆయన అత్తవారు మండూరులో వుండే మతుకుమల్లివారు. వారింటికి రాకపోకలున్నను, శేషయ్యగారి కుటుంబముతో సత్సంబంధములులేవు.

మా చినతాతగారు, హనుమంతరావుగారు బందరులో చదువుకునే రోజుల్లోనే స్వాతంత్రోద్యమముతో సంబంధాలున్నాయని నాకుచెప్పేవారు. కాని తల్లికి, అన్నగారికి ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం యిష్టం లేదని అందువలన తాను పాల్గొనలేదని నాకు చెప్పారు.ఆయనకు

అన్నగారన్న ఎంతో గౌరవము. అన్నగారి మాటను ఎప్పుడూ జవదాటలేదట. కాని అప్పుడే ప్రతి గ్రామము నందు మహాత్మాగాంధి ప్రభావము, టంగుటూరి ప్రకాశం పంతులుగారి ప్రభావము, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి ప్రభావం ఎక్కువగా వుండేదట. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి రామ దండు పల్లెసీమను బాగా ఆకట్టుకుందట. అలాగే బ్రిటిష్ ప్రభుత్వం అనుయాయులు గూడా ప్రతి గ్రామంతోను వుండేవారట.

ఈ రెండు వర్గాలూ, గ్రామములో వుండే స్పర్ధలవలన పరస్పరం ఘర్షణ పడుతుండేవాళ్ళు. ఆసమయంలోనే మాతాతగారు గ్రామోద్యోగి అనే పత్రికకి సహాయం చేసేవారు. అంతేకాకుండా గ్రంథాలయోద్యమమునకు పరోక్షముగా సహాయము చేసేవారు. వారు తెలుగులో ప్రచురితమవుతున్న అనేక గ్రంథములను తెప్పించి, యింటిలోనే ఒక గ్రంధాలయమును నెలకొల్పారు. తర్వాత ఆయిల్లు అమ్మే సమయంలో మానాన్నగారు ఆగ్రంథాలయములోని పుస్తుకాలన్నీ వలివేరు గ్రథాలయమునకు దాన మిచ్చారు.

మా తాతగారు సుందరరావుగారు తెనాలిలో నివేశ స్థలము కొని అక్కడొక గృహము నిర్మించ దలచిరట. కాని తమ్ముడు హనుమంత రావుగారు తెనాలిలో కాపురము పెట్టునేమోయన్న తల్లిగారి సూచనతో ఆ ప్రయత్నము మానుకున్నారట.

అయినను హనుమంతరావుగారు తెనాలిలో కారపురము పెట్టుట ఆగలేదు. సుందరరావుగారు యాత్రనుండి తిరిగి వచ్చిన తర్వాత ఈ సమస్యలతో పాటు, ఆరోగ్యము కూడా దెబ్బతిన్నదట. ఆలాంటి

పరిస్థితులలో ప్రభుత్వము ఆయనకు స్వాతంత్రోద్యమముతో సంబంధమిన్నదన్న మిషతో గ్రామకరణం ఉద్యోగం నుండి సస్పెండు చేశారట. ఆయన పరోక్షముగా రామదండుకు, గ్రామోద్యోగి పత్రికకు ఆర్థిక సహాయం చేశారుగాని, ప్రత్యక్షముగా ఆయన ఉద్యమముతో సంబంధము పెట్టుకో లేదు. గ్రామ కరిణీకం లేనంత మాత్రాన ఆయన ఆదాయమేమీ తగ్గి పోలేదట. వీటన్నితోపాటు యింటి సమస్యలు తోడయినవి. పెద్దచెల్లెలు కామేశ్వరమ్మగారిని కొమ్ముమూరు (కొమ్మూరు) వేంకటప్పయ్యగారికిచ్చి వివాహము చేశారు. ఆయన మా తాతమ్మ శేషమ్మగారికి తమ్ముని వరుస. ఆస్థిపరులు. కాని ఆయనకు మానసిక రుగ్మత వున్నది. ఆ రోజులలో సరైన వైద్య సౌకర్యములు లేకపోవడం వలన ఆయన్ని లోకులు పిచ్చివానిగా పరిగణించేవారట. అప్పటికే కామేశ్వరమ్మగారికి సాంబమ్మ అనే పిల్లపుట్టి అనతికాలం లోనే మరణించింది. తర్వాత పుట్టిన సుశీల అనే కుమార్తెను తన వదినగారైె సీతారామమ్మ ( మా నాయనమ్మ) గారికి అప్పగించి, భర్త పిచ్చివాడుగా చూడబడుతున్నాడనే బాధతోనే మరణించారు. శ్యామలాంబగారు కూడా కాలం చేశారు. వీరిద్దరు అతి చిన్న వయసులో 30 సంవత్సరముల లోపే చనిపోయారు. మా తాతగారు సుందరరావుగారు, మా చిన తాతగారు హనుంతరావుగారు, మా తాతమ్మగారు శేషమ్మగారు ఈ మరణములతో మిక్కిలి దుఃఖము అనుభవించారట. కొమ్ముమూరి వేంకటప్పయ్యగారి చికిత్సాకాలములో హనుంతరావుగారు దురుసుగా ప్రవర్తించెనని ఆయన హనుంతరావుగారిని ద్వేషించుచుండెను. ఈ సమస్యలు, ఆనారోగ్యము మా తాతగారిపై గట్టి ప్రభావము చూపి, ఆయన

కూడా దాదపు 35 సంవత్సరముల వయస్సులోనే క్రీ.శ. 1924లో దివంగతులయ్యారు. అప్పటికి మా నాన్నగారికి వయస్సు 14 సంవత్సరాలు ( జననం 16 జూన్, 1910). ఉపనయనము చేశారు. తెనాలిలో నాల్గవ ఫారం చదువుతుండేవారు. మా పినతండ్రి చంద్రకళాధరరావు గారికి 7 సంవత్సరములు (జననం 1917) వయస్సు.

హనుమంతరావుగారికి వేంకటాచలపతిరావు ( జననం 1918), శ్యామసుందరి (జననం 1920), ప్రభావతి (జననం 1923) అను సంతానము గలిగారు. మా చిన తాత హనుమంతరావుగారికి వివాహమైన తరువాత దాదాపు 10 సంవత్సరముల వరకు సంతానము కలుగ లేదు. మా తాతమ్మ గారికి ఈ విషయం చాలా చింత కల్గించినదట. క్రీ.శ. 1918లో మా చిన తాతగారికి మగ పిల్లవాడు పుట్టినాడు. ఆయనకు వేంకటాచలపతి రావు అని నామ మిడిరి. ఆయనకు ఒక నెల దాటిన తరువాత తల్లి దగ్గర పాలు లేక పోవుట బాధకలిగించినదట. అప్పుడు మా తాతమ్మగారు గ్రామములో నున్న బాలింతల సంగతి విచారించి, ఒక చాకలి స్త్రీని, ఆ శిశువునకు పాలిప్పించుటకు వప్పించిరట. తర్వాత ఆ చాకలి స్త్రీ మరణింపగా, ఆమె కుమారులు, నరసాయ, కోటాయ యనువారలను యింటిలో పిల్లలుగా ఆదరించిరి. నరసాయ జీవితమంతా, మా నాన్నగారికి నమ్మిన బంటుగా, చాలా విశ్వాసముతో నుండెడివాడు.

ఈ కాలము వరకు బలభద్రపాత్రుని వంశము (మండూరుకుదురు) ఆకాలపు కొలబద్ద ప్రకారం భోగ భాగ్యాలతో, సిరిసంపదలతో, తోటివారికి ఈర్ష్య కలిగే టట్లుండేవారట. పాత్రుని వారి గొప్పదనము, దాతృత్వము

గురించి అందరూ చెప్పుకునేవారట. ఆ కాలపు పరిస్థితులలో ధనికులని గూడ చెప్పుకునే వారట. వారికి 20 ఎకరముల మాగాని భూమియే కాక, నివేశ స్థలములు, పశుసంపద, మెట్టభూమి, తాటి తోపులు, బంగారు నగలు, వెండి వస్తువులు వుండేవట. మా తాత గారి మరణంతో మళ్ళీ యింటి యాజమాన్యం మా తాతమ్మ శేషమ్మగారి పై పడింది. మాతాతగారి కాలంలో కూడా గృహయాజమాన్యము ఆమే చేసేవారు. కాని భూయాజమాన్యము, ధన సంపాదన మా తాతగారు చేసేవారు.

ఈ బాధ్యతలు కూడ శేషమ్మగారే తీసుకోవలసి వచ్చింది. క్రీ.శ. 1900 నుండి అరేడు సంవత్సరముల యాజమాన్యం తర్వాత మరల అంత బరువు ఆమె మోయవలసి వచ్చింది. ఆమెకు తన యిద్దరు కుమార్తెల మరణ శోకము తోపాటు, పెద్ద కుమారుని అకాల మరణ దుఃఖమును కూడ భరించవలసి వచ్చింది. ఆమె శోకము ఎవరూ తీర్చలేనిది. ఆమె సాయంత్రం సమయంలో గడ్డివాములున్న మెట్ట ప్రదజేశంలో కూరగాయల చెట్లకు  నీరు పెట్టించుటకు కమతగాడితో వెళ్లి, అక్కడ ఏడుస్తూ కూర్చునేవారట. యింట్లో దుఃఖించడం అమంగళకరమని ఆమె అలాచేశేవారట.

హనుమంతరావుగారు తెనాలిలో కాపురము పెట్టి, కో ఆపరేటివ్ ఉద్యమమును నడిపేవారు. అప్పుడు ప్రొవిన్షియల్ కో అపరేటివ్ బ్యాంక్‌ను స్థాపించారు. దానకి ఆయన నిర్దేశకుడు (డైరెక్టరు) గా వున్నారు. ఈ పనులతో ఆయనకు తరచు మద్రాసుకు, గుంటూరుకు  వెళ్ళవలసి వచ్చేది.  మా పిన తండ్రి చంద్ర కళాధరరావుగారు తెనాలిలోనే వుండి చదువుకొనేవారు.  హనుమంతరావుగారికున్న పలుకుబడితో కో ఆపరేటివ్

సంస్థలో వారి పెదతల్లి కుమారులైన కామేశ్వరరావు గారికి, సుందర రావుగారికి ఉద్యోగములు యిప్పించారు. మదరాసులో కూడా ఆయన పరపతి, పలుకుబడి బాగా పెరిగిందట. ఆయనకు తమ అన్నగారైన సుందరరావుగారిపై, మిక్కిలి ప్రేమ, అభిమానం, గౌరవం వుండేవి.

తమ అన్నగారు మరణించినప్పటి నుండి దేవతా పూజలు మానివేశానని నాతో చెప్పేవారు. తమ అన్నగారు బహు ధర్మాత్ములు, సౌమ్యులు, సహాయకారి, ధర్మశీలి, ఎడూ ఎవరికీ చెరుపు చేసేవారు కారని ఆయన చెప్పేవారు. అటువంచి అన్నగారి అకాల మరణం వల్ల తనకు దేవుని మీద నమ్మకం పోయిందని చెప్పేవారు. మానవుని కష్టాలకు, దుఃఖాలకు మాత్రమే దేవుడు భాధ్యుడిలా కనిపిస్తాడేమో...

కరిణీకం కూడా కుటుంబంలో లేదు. సుందరరావుగారు బ్రతికి వున్నపుడే ప్రభుత్వము ఆయనను సస్పెండ్ చేసి ఆ పదవిని మరొకరికి తాత్కాలికంగా యిచ్చారట. దానితో గ్రామంలో కరిణీకపు లెక్కలు, భూమి కొతలు, లావాదేవీల పత్రాలు వ్రాసేవారు ఎక్కువౌ చున్నారట.

మొదటి ప్రపంచ యుద్ధమై పోయి, 6 సంవత్సరములైన తర్వాత స్వాతంత్రోద్యమము ముమ్మరమై, గ్రామములో కక్షలు పెరుగుచుండెను. మహాత్మాగంధీ నాయకత్వములో పల్లెలన్నీ జాగృతమగు చుండెను. సైమన్ కమీషన్ వచ్చు సమయము. ఆ సమయంలో మా చిన తాత హనుమంతరావుగారు కొఆపరేటివ్ వుద్యమములో వున్నారు. వారికి మావూరి ఉప్పరి వాండ్లు బలమిచ్చు చుండిరి. కాని గ్రామములో అధిక జనాభాగా వున్న కమ్మ వారిలో ఒక వర్గము వారికి ప్రతి కక్షదారులుగా వుండి, ఏదో విధంగా ఆయనను యిబ్బంది పెట్టే ప్రయత్నం

జరుగుతుండేది. మా తాతమ్మగారు ఈ పరిస్థితులను ఎట్లా ఎదుర్కోవాలో తెలియక సతమతమయ్యేవారట. అయినను బలభద్రపాత్రుని వారి పూర్వ వైభవము తెలిసి, వారి ఎదురుగా నిలబడి మాటలాడే సాహసం చేయ లేక పోయే వారట.

క్రీ.శ. 1928లో మా నాయన గారు తెనాలి తాలూకా హైస్కూల్ లో స్కూల్ ఫైనల్ చదివేవారు. తండ్రి గారున్నంత వరకు ఆయన వద్దనున్న చనువుతో నాటకములు చూచుటకై డబ్బు అడిగెడి వారట. మా తాత గారికి నాటకములు చూచుట యిష్టములేదట. కాని మా నాన్నగారు ఎటులనో డబ్బులు యిప్పించుకుని నాటకము చూచే వారట. మా నాన్నగారి స్నేహితులలో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు ప్రభల సీతారామ శాస్త్రి, నాటకాలతో పరిచయం విన్న భీమవరపు నరసింహారావు, గోపాలకృష్ణమూర్తి (గోపి), త్రిపురనేని రామస్వామి చౌదరి గారి కొడుకు గోపీచంద్ , కబేలా యజమాని కుమారుడు వహాబ్, క్రిస్టియన్లు, నాయుళ్ళు కూడా వుండేవాళ్ళు. వీరిలో తర్వాత కాలంలో వహాబ్ సాహెబ్ భారత్ బీడీలు తయారు చేసే వారు. మా నాన్నగారు కలిసి నప్పుడు డల్లా ఒక బీడీల దిండు యిచ్చేవారు. ప్రభల సీతారామ శాస్త్రి మంచి బ్యాట్ మింటన్, టెన్నిస్ ఆటగాడు. తరువాత న్యాయవాది అయ్యారు. భీమవరపు నరసింహారావు మదరాసులో సినిమాలకు మ్యూజిక్‌డైరెక్టరరు అయ్యారు. గోపాలకృష్ణమూర్తికి జీవితమంతా నాటకాలలో వేషములే వృత్తిగా వుండేది. గోపీచంద్ తర్వాత గొప్ప రచయిత గా పేరు పొందారు. వీరే కాక కుస్తీ పట్టే పైల్వానులు, మెకానిక్కులు, సినిమా ఆపరేటర్ల వంటి వారు చాలా మంది ఆయనకు

స్నేహితులు.  నాకు తెలిసిన మెకానిక్అడపా నారాయణరావు. సినిమా ఆపరేటరు కొమరవోలు జగన్నాధరావు. మా తాత గారు గతించిన తర్వాత యిటువంటి అన్ని రకముల స్నేహితులతో ఉంటూ పాఠశాలకు వెల్లేవారు కాదని తత్ఫలితంగా ఆయన నాల్గవ ఫారం 2 సార్లు పరీక్ష పోగొట్టుకుని చదువులో 2 సంవత్సరములు పోగొట్టుకున్నారు.  మా తాతమ్మగారు ఆయన కోసం తెనాలి వెళ్ళి, వెతికి యింటికి తీసుకు వచ్చేవారట. మా నాయన గారి స్నేహితులంతా అమెకు బాగా పరిచయ మయ్యారు. ఒక్కొక్కప్పుడు వహాబ్ సాహెబ్ వంటి వారి యిళ్ళకు వెళ్ళి తీసుకు రావడం యిబ్బంది కల్గించేదట.

మా నాయనగారు, ఆయన స్నేహితులు తెనాలిలో వుంటే ఆవూరి కొబ్బరిచెట్లకు ముదిరిన కాయలుండెవి కావట. కొబ్బరి చెట్ల యజమానులకు కొబ్బరికాయలు దింపే బాధ వుండనిచ్చేవారు కాదట.

క్రీ.శ 1928 లో స్కూలుఫైనల్ చదివేటప్పుడు మా నాన్నగారు హెడ్ మాస్టరుతో వివాద పడి, ఆయనను కొట్టారట. వెంటనే ఆ హెడ్మాస్టరుగారు ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ యిచ్చి స్కూలు నుంచి పంపేశారట. పబ్లిక్పరీక్షలకు 3 నెలల వ్యవధి మాత్రమే వుండెనట. అప్పుడు బహు ప్రయత్నముమీద, దుగ్గిరాల హైస్కూల్ లో చేరి, బాగా చదివి పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అప్పుడాయన వయస్సు 18 సంవత్సరాలు. కాలేజీలో చేరి ఇంటర్ మీడియెట్ చదవాలనే కోరిక వుండేది. కాని పై చదువులు చదివినచో గ్రామమలో వుండక ఉద్యోగము కోసము బయటకు వెళ్ళి పోతారని మా తాతమ్మ శేషమ్మగారి భయము. అందుకని కాలేజీకి పంపలేదు.  మా నాయన గారు పై చదువులకు వెళ్ళలేదని బాధ పడేవారు.

18 సంవత్సరముల వయసు. ఏమీ చేయుటకు లేదు. అందుకని గ్రామములో వుంటూనే రోజూ తెనాలి వెళ్లి, స్నేహితులతో ఆటలు, కుస్తీలు, ఈత మొదలైనవి చేస్తూ కాలం గడిరపారు. గ్రామ కరిణీకం మా నాన్నగారికి యివ్వ వలసి వుంది. కాని యివ్వలేదు. ఈ లోపల కరణం పరీక్షలు, సర్వే పరీక్షలలో ఉత్తరీర్ణులైయ్యారు. కొన్ని రోజులు మా చిన తాతగారి బ్యాంకులో గుమాస్తాగా పని చేశారట. తర్వాత నాటకములకు హార్మోనియం వాయించుటకు ప్రయత్నము చేసారట.

నాటకములకు హార్మోనియం వాయించాలనే పట్టుదలతో దానికి కావలసిన సంగీతము నేర్చుకోవాలనే తపనతో ఉళ్లోని మరి కొంత మందిని కూడ జేర్చి, ధేనువుకొండ సుబ్బారావు గారిని గ్రామము నకు తీసుకును వచ్చి, కొన్ని నెలలు సంగీతము నేర్చుకున్నారు. ఆ కాలములో మహారాష్ట్రములో బాల గంధర్వ నాటకములు ప్రసిద్ధి చెందినవి. మా నాయన గారికి మహారాష్ట్ర (హిందూస్తానీ) సంగీతం పై మక్కువ. విశ్వనాథ సత్యనారాయణగారు వేయి పడగలలో వ్రాసిన విధంగా, తేలుగు దేశం అంతా మహారాష్ట్రాన్ని అనుకరించడం, వారి సంగీత బాణీలను తెనుగు నాటకములలో ప్రవేశ పెట్టడం చాలా ఎక్కువగా వుండేదట ఆ కాలములో జొన్నవిత్తుల శేషగిరిరావు గారు బాలగంధర్వ సంగీతమునుకరించి పాడటంలో మేటి అని స్వయంగా బాలగంధర్వ చేతనే ప్రశంసలు పొందినారట. ఆయన మా నాయన గారికి సన్నిహితుడు. దీనికి తోడు మిత్రుడు భీమవరపు నహసింహారావు నాటకములకు హార్మోనియం వాయించడం, మూకీ సినిమాలలో హార్మోనియం వినిపిస్తూ జీవనం గడిపే వారట. అయినా తగినంత సంపాదన లేక చాలా యిబ్బంది

పడేవారట. అందుకని గ్రామము నుండి, నెలకు కావలసిన బియ్యము ప్రతినెల మా నాన్నగారు పంపేవారట. మా నాన్నగారు ఆయనను కోతి మామా అని పిలిచే వారట. తర్వాత కాలంలో ఆయన మద్రాసులో స్థిరపడి సినిమాలకు సంగీత నిర్దేశకుడుగా వున్న సమయంలో మా నాన్నగారు తరచూ మదరాసు వెళ్ళి, ఆయన గదిలోనే వుండేవారు. భీమవరపు నరసింహారావుతో పాటు మా నాన్నగారు కూడా కొన్ని రోజులు నాటకములకు హార్మోనియం వాయించెడివారట. ఆయన మరో స్నేహితుడు గోపాల కృష్ణమూర్తి (గోపీ) నాటకములో వేషము వేసి జీవనం గడిపేవారట. ఆయనకు గూడా మా నాన్నగారు తగు సహాయం చేసే వారట.

మా నాన్నగారు కొంతకాలం జొన్నవిత్తుల శేషగిరిరావు గారితో కొన్ని నాటకములు వేయించే వారట. జొన్నవిత్తుల శేషగిరిరావు గారు త్రాగుడుకు బానిసలై నాటకములకు సమయములో వచ్చేవారు కారట. అప్పుడు ఆయనను వెదికి తీసుకుని రావటానికి మా నాయనగారు తమ స్నేహితులలో ఒకరిని నియోగించారట. ఒక రోజు జొన్నవిత్తుల శేషగిరిరావు గారు విజయవాడ నుండి సాయంత్రము 8 గంటలకు తెనాలి రావలసి యుండెను. సాయంత్రము 9 గంటల వరకు ఆయన రాలేదట. ఆయనతో వున్న మా నాయనగారి స్నేహితుడు కూడా రాలేదట. అప్పుడు మా నాయన గారు తెనాలి రైల్వే స్టేషన్‌కు వేళ్ళి చూడగా, శేషగిరిరావు గారు బాగుగా త్రాగి, పడిపోయి వుండిరట. ఆయన వెంట వున్న మనిషి దిక్కుతోచక వుండెనట. అప్పుడు మా నాయనగారు శేషగిరిరావు గారిపై నీళ్ళు పోసి, ఆయన మత్తు దింపి, బాగా కోపపడెనట. శేషగిరిరావు

గారు మా నాయన గారితో రంగస్థలమునకు వచ్చే టప్పటికి రాత్రి 10 గంటలైనదట. హాలులో దొమ్మీకి దిగే పరిస్థితి వచ్చిందట. అప్పుడు శేషగిరిరావు గారు మేకప్ చేసుకంటూనే, పరబ్రహ్మ అనే ప్రార్ధన మొదలు పెట్టిరట. వెంటనే హాలులో గొడవ సద్దు మణిగిందట. ఆవిధంగానే సిమారు 45 నిముషములు పాడి, నాటకము ప్రారంభించి, నాటకము రక్తి కట్టించిరట. ఆ విధంగా, పరువు నిలబడి, దెబ్బలు తప్పాయట. ఆ తరువాత, నాటకములు వేయించుట మాని వేశారు. ఆ కాలములో నాటకములు వేయించుచూ బాగానే గడించేవారట. కానీ, ఉదయం కాగానే, ఆయన స్నేహితులు ఎవరికి అందినంత వారు తీసుకుని వెళ్ళేవారట. సాయంత్రానికి జేబు ఖాళీ అయ్యేదట. నాటకములకు హార్మోనియం వాయించడం, నాటకాలు వేయింటడం వలన సమకాలీన నటులు, నాటక సమాజములతో మా నాన్న గారికి బాగా పరిచయం వుండేది. స్థానం నరసింహారావు గారిని 'మామా' అని సంబోధించే చనువు వుండేది, కాని ఏ కారణం చేతనో మా నాన్నగారికి బళ్లారి రాఘవ మీద సదభి ప్రాయం లేదు. ఆయన కంటే గొప్ప నటులు తెనాలిలో చాలా మందే వున్నారని, వారికి అవకాశము దొరకక పోవడం దురదృష్టకరమని అనేవారు.

ఆ కాలములో మా నాయనగారు, తెనాలిలో ఒక గది తీసుకుని వుండేవారట. ఉదయము లేచి మిత్రులతో క్లబ్‌కి వెళ్ళి, టెన్నిస్ ఆడేవారట. హోటల్ నుండి యిడ్లీలు, పెసరట్లు తెప్పించి అందరికీ పెట్టేవారట. ఆయన టెన్నిస్ రాకెట్‌కి గెట్ అల్లడం దగ్గర్నించి, ఆ ఆటకు సంబంధించిన ఏ పనియైనా కూడా కూలంకషంగా చేయగలిగే వారు.

గౌస్ మహమ్మద్ ఖాన్ వంటి ప్రముఖ టెన్నిస్ క్రీడాకారులను పిలిచి, గుంటూరులో టెన్నిస్ టోర్నమెంట్లు నిర్వహించేవారు. ఆయన స్నేహితులలో ప్రభల సీతారామ శాస్త్రి గారు మంచి టెన్నిస్ ఆటగాడని, కాని రెండవ సెట్ నుండి ఆట ఆడలేక పోయేవారని చెప్పేవారు. ఇంకొక సేనేహితుడు దుగ్గిరాల పూర్ణచంద్రరావు దేశములోని టెన్నస్ ఆడగాళ్లలో ఒకడని చెప్పేవారు. ఒకసారి ధ్యాన్‌చంద్ హాకీ బృందంతో మద్రాసు నుండి గ్రాండ్ ట్రంక్ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిసిందట. ఆ రైలు తెనాలిలో ఆగదు. అయినా ప్లాట్‌ఫారం మీద టీ కి అన్ని ఏర్పాట్లు చేసి, రైలు ఆపటానికి స్నేహితులతో కలిసి స్టేషన్ మాస్టరు మీద ఒత్తిడి తెచ్చి సిగ్నల్ యివ్వకుండా చేసి, రైలు ఆపి, వీరందరూ ధ్యాన్‌చంద్ ను, వారి టీమ్‌ను రైలు నుండి దింపి, వారికి ఉపాహారములు, టీ యిచ్చి సాగనంపారట.

సాయం సమయంలో, ఆయన తెనాలి క్లబ్‌కు మళ్ళీ వెళ్ళి చీట్లపేక ఆడేవారట. పోకర్ కూడా ఆడేవాడినని చెప్పేవారు. క్లబ్‌కు గోవిందరాజుల సుబ్బారావు గారు కూడా వచ్చేవారట. ఆయనతో కూడా పేక ఆడేవారట. సుబ్బారావుగారు గెలిచినప్పుడు డబ్బు వెంటనే తీసుకునేవారట. కాని ఓడిపోయినప్పుడు మాత్రము తర్వాత యిస్తాననే వారట. వారితో మాకు బంధుత్వము కూడా వుంది. ఒక రోజు ఆయన ఓడిపోయి, యధావిధిగా, తర్వాత యిస్తాన్నారట. వెంటనే మా నాయన గారు, 'యివ్వాళ నువ్వు యింటికి వెళ్ళవు మామా' అని అన్నారట. వెంటనే సుబ్బారావుగారు డబ్బు తెప్పించి యిచ్చారట. అప్పటినుండి ఆయన మా నాన్నగారితో ఆడడం మానేయడం, క్లబ్‌కి రావడం కూడా మానేయడం జరిగిందట.

మా నాయన గారికి 19 సంవత్సరముల వయస్సులో అనగా, 1929 1930 లో వివాహం జరిగింది. అప్పుడు మా అమ్మ గారి వయసు 8 సంవత్సరాలు. సత్తెనపల్లి వాస్తవ్యులు, కొర్నెపాటి లక్ష్మీ నరసింహారావు గారి ఏకైక పుత్రిక మా అమ్మగారు. మా మాతామహులు నరసింహారావుగారు రెవెన్యూ యిన్స్పెక్టరుగా పని చేయుచూ, చిన్నతనములోనే మరణించారు. ఆయన తనకు మంచి స్నేహితుడని, మా చిన తాతగారు, హనుమంత రావు చెప్పేవారు. వారికి పెనుగుదురుపాడులో బాగా భూవసతి వున్నదని, ఆస్తి అంతయు తమకే వచ్చునని చెప్పి, వివాహం చేశారని మా నాయనగారు చెప్పేవారు. మా మాతామహుడు, ఆ సంవత్సరం 1929 30 లోనే మరణించారు. ఆయన మరణించిన సంవత్సరంలోపలనే కుమార్తె వివాహం జరిపించాలనుకుని జరిపించారు. మా అమ్మగారికి దాదాపు 70 నవర్సుల బంగారం, నగలు పెట్టారట. మా మాతామహుడు కొర్నెపాటి లక్ష్మీ నరసింహారావు గారికి తమ్ముడు హనుమంతరావుగారు. ఈయనను మాతామహికి దత్తుయిచ్చారు. అందువలన ఆయన యింటిపేరు పోచిరాజు అయింది. వీరికి యిద్దరు చెల్లెళ్లు పెద్ద చెల్లెలు సౌభాగ్యమ్మ గారు. ఈమెను తమ బావమరిది పోచిరాజు మంత్రయ్యగారి కిచ్చి పెండ్లి చేశారు.

అందువలన మా అమ్మగారికి, మంత్రయ్యగారు మేనమామ, ఆయన భార్య సౌభాగ్యమ్మగారు మేనత్త అయ్యారు. భర్త చనిపోయిన తర్వాత, మా అమ్మమ్మగారు స్వరాజ్యలక్ష్మి (బుచ్చమ్మ) గారు, మా అమ్మగారు హనుమాయమ్మగారిని తీసుకుని పెనుగుదురుపాడు వచ్చారు.

అందువలన, మా నాయనగారి వివాహము పెనుగుదురుపాడులోనే జరిగెను. మా అమ్మగారి మాతామహుడు, సుబ్బారావుగారి పుట్టిల్లు పెనుగుదురుపాడు. మా మాతామహుడు నరసింహారావు గారి చిన్న చెల్లెలు రంగమ్మగారు. ఆమెను చీరాల స్వర్ణవారికి కోడలిని చేసిరి. ఆమె బాల్య వితంతువు. పెనుగుదురుపాడు లోనే వుండేది. మా మాతామహుని పిన తల్లులు సీతారావుమ్మగారు, చుండూరు శ్రీరామయ్యగారి భార్య. సీతారామమ్మ గారికి ఒక్కడే కుమారుడు. ఆయన కుంటముక్కల సుబ్బారావుగారు. ఈ యిద్దరు అప్పచెల్లెళ్ల పిల్లలందరు ఉమ్మడి కుటుంబముగా వుండేవారు.వ ఈ కారణముగా మా అమ్మగారి పుట్టినిల్లు పెనుగుదురుపాడు. పెనుగుదురుపాడు చినగాదెలవర్రుకు 3 మైళ్ల దూరంలో వుంది. చినగాదెలవర్రు నుండి పెనుగుదురుపాడు వెళ్లవలెనన్న వలివేరును దాటి, తుంగభద్రను దాటి వెళ్ళవలెను. ఆ ఊరిలో ఎక్కువ కుటుంబములు పోచిరాజువారే. తరువాత, భర్తిపూడి వారి రెండు కుటుంబములు, కొమ్మరాజు వారిది ఒక కుటుంబం, కుంటముక్కల వారివి రెండు కుటుంబములు, భీమవరపు వారిది ఒక కుటుంబం, చుండూరు వారిది ఒక కుటుంబం, మిగిలిన వారు కుమ్మరులు, పంచములు. ఆ గ్రామములో అన్ని కుటుంబముల వారికి ఒకరికొకరితో బాంధవ్యములున్నాయి.

ఆ కాలములో రాజకీయ పరిస్థితులు అల్లకల్లోలముగా వున్నాయి. సైమన్ కమీషన్ నిష్ఫలమయింది. సైమన్ కమీషన్ వల్ల దేశంలో, ఒరిస్సా ఒక రాష్ట్ర మయింది. అప్పటి వరకు బెంగాల్, బీహార్, మదరాసు రాష్ట్రముల లోని భాగములు కలిపి ఒరిస్సా అయినది. దానివలన తెలుగు

జిల్లా లయిన బర్హాంపురం, కోరాపుట్ జిల్లాలు ఒరిస్సాలో భాగ మయినాయి. దేశంలో భూమి ధరలు వ్యవసాయ ఫలసాయపు ధరలు పడిపోయాయి. మాగాణి భూమి ఎకరం రూ౯600 లకు పడిపోయింది. వరి ధాన్యము బస్తా ఒకటికి 2.50 లకు పడిపోయింది. రైతులు, గ్రామస్తులు వ్యవసాయంపైన ఆధారపడిన వారంతా, భూములకు పన్ను కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. భూములు కొనేవారు కూడా లేక ప్రభుత్వానికి చెల్లించ వలసిన బూమి పన్ను చెల్లించ లేక, గ్రామ వాసులు భూమిని 'విడుదలకు' పెట్టు చుండిరి. ఈ సమయంలో, అప్పులిచ్చిన వారు అతి తక్కువ ధరకు భూములను స్వాధీనము చేసుకుని లాభం పొందారు, బంగారము సంపాదించ గలిగారు. 'మన గ్రామములో బలుసు అప్పయ్య ఒక్కడే బాగు పడ్డాడని' మా నాయన గారు అనే వారు. ఈ సమయంలో చిన గాదెలవర్రులలో, కుటుంబ పరిస్థితులు మెల్ల మెల్లగా చెడుట మొదలైనవి. తెనాలిలో కాపురం, గ్రామంలో కాపురం నడుపుటకు వ్యవసాయ ఫలసాయమే ఆధారం. తెనాలి కాపురానికి ఇంటి అద్దె, పాలు, పెరుగు, కూరగాయలు, మిగిలిన కొన్ని నిత్యావసరములకు డబ్బు అవసరం. ధాన్యము, చినగాదెల వర్రులో దొరుకుతుంది గాని, దానిని డబ్బు క్రింద మార్చిన, తెనాలి కుటుంబమునకు సరిపోవు డబ్బు కోసం చాలా ఎక్కు వధాన్యం అమ్మ వలసి వచ్చేది.

* వీళ్ళందరూ పెనుగుదురుపాడు వాస్తవ్యులు.

నెలా నెలా డబ్బురూపంలో వచ్చే ఆదాయం లేదు. ఆ సంమయంలో మా నాయన గారు తెనాలిలో ఒక మ్యూజిక్‌దుకాణము పెట్టారు. దీనిలో గ్రాంఫోను సామానులు, రికార్డులు అమ్మకం, గ్రాం ఫోను, హార్మోనియం రిపేర్లు చేసేవారు. మా నాయన గారు గుంటూరు జిల్లా లోనే మొట్టమొదటిదిగా ఆ దుకాణమును రూపొందించారు. ఆయన కథనం ప్రకారం దుకాణములో బాగా లాభాలు వచ్చేవి, కాని, వారి నాయనమ్మ శేషమ్మగారు కొంత డబ్బు, తెనాలిలో పినతండ్రి గారి కుటుంబమునకు, తమ తమ్ములు చంద్ర కళాధరరావు, వేంకట చలపతిరావు (హనుమంతరావుగారి పెద్ద కొడుకు) లు తీసుకు వెళ్లుటవలలను, స్నేహితులు తీసుకు వెళ్ళడం వలననూ ఆదుకాణం పై గడించినది నిలువచేయలేక పోయారని. అంతేకాక, తెనాలి కుటుంబమునకు డబ్బు అవసరమైనప్పుడు మానాయనగారితో ఋణ పత్రము వ్రాయించి, మా తాతమ్మ శేషమ్మగారు తీసుకొనేవారట. ఈ లావాదేవీలు చివరికి, మానాన్నగారికి, మా తాతమ్మగారికి మధ్య చిన్న చిన్న ఘర్షణలకు దారితీశాయట. 'ఎక్కడి నుంచి తెచ్చి పెట్టను మీ అందరికీ' అన్నారటమా తాతమ్మగారు. మా నాన్నగారు చాలా కటువుగా' నెల నెలా డబ్బు తీసుకుంటున్నావు, పూట కూళ్ళలో పెట్టున్నట్లు పెడుతున్నావు' అన్నారట. తెనాలి నుంచి తాతగారు హనుమంతరావు గారికి క్రీ.శ. 1930 వరకు, శ్యామసుందరావు, కామేశ్వరి పుట్టిరి. తెనాలి కుటుంబములో 5 గురు పిల్లలు. ఈ పరిస్థితులలో మా చిన తాత హనుమంతరావు గారు, కో ఆపరేటివ్ బ్యాంక్‌సొమ్ము పోగొట్టారు. తల్లికి చెప్పగూడదు! వెంటనే సొమ్ము బ్యాంక్‌లో వుంచకపోతే ప్రమాదము.

ఆయనతో నీడగా వుండే తాడికొండ శేషగిరిరావుగారు ఎక్కడైనా అప్పు తీసుకోమని సలహా యిచ్చారట. ఒక మార్వాడీ దగ్గర ఎక్కువ వడ్డీతో ఆ సొమ్ము యిప్పించారట. వెంటనే ఆ డబ్బు బ్యాంకులో జమ చేసి, తాత్కాలికముగ ప్రమాదమునుండి బయటపడ్డారట. కాలము గడచిన కొలది అసలు కన్న వడ్డీ ఎక్కువయ్యి, మార్వాడీ అప్పు తీర్చమని బలవంత పెట్టగా, గత్యంతరం లేక తల్లికి అసలు విషయం చెప్పవలసి వచ్చిందట. అప్పటికే అసలు, వడ్డీ కలిపి చాలా పెద్ద మొత్తమయినదట. వెంటనే భూమి అమ్మి అప్పు తీర్చడమే మార్గముగా కనబడినదట.

ఈ సమయములో మా చిన తాతగారిపై క్రిమినల్ కేసు ఆరోపింపబడి, అరెస్టు వారంటు పై కోర్టులో ప్రవేశ పెట్టారట. మఖ్యంగా అప్పుడు జరిగేది ఆయనను జైలులో పెట్టటమే. ఆయనను జైలులో వుంచారంటే మా తాతమ్మ గారు గండె ఆగి మరణించేదే. అప్పుడు ఆ కేసు ఒంగోలు కోర్టులో వుండేదట. అక్కడ వున్న జడ్జి మా నాన్నగారి స్నేహితుడు ప్రభల సీతారామ శాస్త్రి గారి తండ్రికి చాలా దగ్గరి స్నేహితుడు. అందువలన మా నాన్నగారు ఆయనను తీసుకుని ఒంగోలు చేరారట. ఆయన సహాయంతో కేసు మరురోజుకు వాయిదా పడిందట. అప్పటికే సాయంత్రము అయిపోవడం వలన, జైలరు, మా తాతగారు జైలులో వుంచేందుకు వీలు లేదన్నారట. అందువలన ఒక మంచం తెప్పించి, మా చినతాతగారు హనుమంత రావు గారు ఆ రాత్రి గడపటానికి వసతి చేశారట. మర్నాడు బెయిల్ పిటిషన్ జడ్జి ముందుంచి, బెయిల్ తీసుకుని ఆయనను యింటికి తీసుకుని వచ్చారట. తర్వాత ఆ కేసు విచారణలో నిలువ లేదట. ఆ కేసుని విచారించిన శ్రీ

అనంతరామన్ ఐ.సి.యస్ తర్వాత కాలంలో ఆంధ్రప్రదేశ్ కు ప్రధాన కార్యదర్శి (Chief Secretary) గా వుండి పదవీ విరమణ చేశారు. శ్రీ అనంతరామన్ అప్పుడే ఐ.సి.యస్ చేసి సబ్ కలెక్టరుగా వచ్చారు. ఆయన ఈ కేసులో మా చిన తాతగారిని నిర్దోషులుగా నిర్ణయించడం వల్ల ప్రతి కక్ష్య వారు ఆయనను భద్రాచలం బదిలీ చేయించారట.

తరువాత ప్రభల సీతారామ శాస్త్రి గారు న్యాయవాదిగా చేరుటకు సుంకము చెల్లించలేని పరిస్థితి వచ్చి నప్పుడు, మా నాన్న గారు మా అమ్మగారి నగలు అమ్మి ఆయనకు యిచ్చారు. బహుశః సీతారామ శాస్త్రి గారు మా కుటుంబమునకు చేసిన సహాయమును మరువలేక మా నాన్నగారు అలా చేశారేమో.

కుటుంబంలో ఆస్తి విక్రయము చేయు ప్రసక్తి వచ్చినది. మా నాయనాగారి అంగీకారం అందుకు అవసరం. కుటుంబము ఉమ్మడి కుటుంబము. అప్పు తీర్చక పోయిన మార్వాడి కోర్టుకి తీసుకు వెళ్లి ఆస్తిని వేలం వేయించ గలడు. ఆ పరిస్తితులలో 'మీరు భాగము తీసు కుంటే కనీసం మీ ఆస్తిఅయినా దక్కు తుందని' మా నాయనమ్మ గారికి ఊరిలోని వారు హితవు చెప్పారట. ఆ విషయం ఆమె మా నాన్నగారితో ప్రస్తావిస్తే, ఆయన 'ఆస్తి కొంత మిగులుతుంది నిజమే కాని, మార్వాడి వానికి మనమీదున్న గౌరవము తుడిచి పెట్టుకు పోతుంది. గ్రామములోనూ మన గౌరవం పోతుంది. కనుక అప్పు తీర్చడం మన మొదటి కర్తవ్యం' అని అన్నారట. బహుశః హనుమంతరావు తాత గారు, మా నాయన గారు ఆస్తి విభజనము చేసుకొన్నారనే నే ననుకుంటున్నాను. ఆస్తిలో 16 ఎకరముల భూమి, చినగాదెలవర్రులో వున్న యిల్లు విక్రయము

చేయ వచ్చెనట. అంతేకాక, యిట్లోని బంగారమంతా అమ్మ వలసి వచ్చెనట. ఆ క్రయ ధనముతో అప్పంతయూ తీర్చగా, మా నాన్నగారికి, మా పిన తండ్రికి, చెరి 2 ఎకరముల భూమి మాత్రం మిగిలింది. మా చినతాతగారి కుటుంబమునకు ఏమియూ మిగులలేదు. ఈ పరిష్కారము వలన వారు ఆస్తి పంచుకున్నారనే అనుకుంటున్నాను. ఉమ్మడి ఆస్తిగా విక్రయించి వుంటే మా చిన తాతగారు హనుమంతరావుగారికి 2 ఎకరములు, మా నాయన గారికి, మా పిన తండ్రికి చెరి ఒక ఎకరం భూమి వచ్చేది. అలాకాక, ఆస్తిని విభజించడం వల్ల హనుమంతరావుగారి ఆస్తి అంతా పోయింది. వీరి ఆస్తిలో 6 ఎకరములు, యింటిలో భాగము, బంగారము మా చిన తాతగారు చేసిన అప్పు తీర్చుటకు అమ్మటం వలన పోయినది. మా చిన తాతగారి కుటుంబము నకు భూమిగాని, యిల్లు గాని లేకుండ ఒక్కసారిగా నిరు పేద లైరి. మా తాతమ్మ గారికి ఒక్క సారిగా మిన్ను విరిగి మీద పడి నట్లైనది.

తాడికొండ శేషగిరిరావు గారు దీనికంతకూ మూలమని మా నాయనగారు భావించేవారు. అప్పు తీసుకోవడం అనివార్యం, లేకపోయిన ప్రమాదం. కాని ప్రమాదము తప్పిన వెంటనే మా చిన తాతగారు తల్లితో చెప్పి వుంటే, యింత నష్టము కలిగి వుండేది కాదని మా నాయన గారి అభిప్రాయము. 'దీనికంతటికీ తాడికొండ శేషగిరిరావు గారు, మా తాతగారికి నెరపిన మంత్రిత్వమే' అని మా నాయన గారి భావన. మా చిన తాతగారు చాలా తెలివి గలవారు. ఎంత ప్రమాద పరిస్థితులలో వున్నా, ఆలోచించి తగు నిర్ణయము తీసుకొన గలరు. ఎందుకు తీసుకోలేదో నాకు యిప్పటికీ అర్థం కాలేదు. భూమిని విక్రయించడం

కన్న వేరే మార్గముతో ధన సంపాదన చేయ గలిగి వుంటే, ఈ విషయం దాచటంలో అర్ధంవుంది. లేనప్పుడు వెంటనే మేలుకొనక పోవడం ఆలోచింప చేస్తుంది. మార్వాడి అప్పు, కాబూలీ వాడి అప్పు క్షణంలో మనుషుల్ని తలక్రిందులు చేస్తుందని అందరికీ తెలుసు. మా తాత గారు చేయదలచుకున్నది, తాడికొండ శేషగిరిరావు గారు చేయనీయలేదా. ఆయన కంత శక్తి ఎలా వచ్చింది. వీటికి సమాధానాలు లేవు.

తరతరాలుగా మర్యాదా, గౌరవమూ, ధనమూ కల వంశం అప్పులపాలై బీదరికం లోకి రావడం ఆశ్చర్యం. దాదాపు 43 సంవత్సరముల వయస్సు వరకు ఒక జమీందారుగా జీవించిన మా చిన తాతగారు ఒక్క సారిగా దుర్భర దారిద్ర్యంతో చివరి 40 సంవత్సరముల జీవితం గడప వలసి వచ్చింది.

పిల్లలకు చదువు చెప్పించలేక, భోజనం పెట్టలేని పరిస్థితికి రావడం హృదయ విదారకం. ఆ సమయానికే ఆయన పెద్ద కుమార్తె శ్యామ సుందరిని మా తాతమ్మగారి పెంపుడు తమ్ముడు కోటంరాజు దుర్గయ్యగారి మూడవ కుమారుడు శేషగిరిరావు గారితో వివాహం జరిగంది. ఆయన రెండవ కుమార్తె ప్రభావతిని పులిపాక నరసింహారావు గారికిచ్చి వివాహం జరిపించారు. ఈ ప్రభావతి అన్న మా నాయన గారికి ఎంతో ప్రేమ అభిమానము అని, మా చిన తాతగారు చెప్పేవారు. కాని ఆమె చాలా చిన్న తనములోనే చనిపోయారు. మా చిన తాతగారు తర్వాత యిన్స్యూరెన్స్ కంపెనీకి (Sun Life Insurance Co) కి ఎజెంట్‌గా పని చేశారు. ఆయన జీవితాంతం అదే వృత్తి చేశారు. దానివల్ల వచ్చే డబ్బే జీవనాదారం అయ్యింది. ఆ కాలంలో యిన్స్యూరెన్స్

ఎంతమంది చేసేవారో, ఆయనకి ఎంత తక్కువ ఆదాయం వచ్చేదో తలుచుకుంటేనే భయమేస్తుంది.

క్రీ.శ. 1933 34 లో మా పిన తండ్రి చంద్ర కళాధరరావు గారు స్కూలు ఫైనల్ పరీక్షలో వుత్తీర్ణులైనారు. కాలేజీలో చేరటానికి ఉత్సాహం వుండేదట. ఆయనను చదివించడం మా నాయన గారికి కూడాయిష్టమే. తనకు కాలేజీ చదువులేకపోయినా తన తమ్ముడికి కాలేజీ చదువు వుండాలని అని అనుకున్నానని నాకు చెప్పారు. కాని ఏ కారణం చేతనో మా బాబాయి గారు వెంటనే ఏ కాలేజీలో చేరలేదు. యింటిలోని ఆర్థిక పరిస్థతులు, ఆస్థినష్టముల వలన, గృహ కలహముల వలన, కాలేజీలో చేరలేదని నా ఊహ. క్రీ.శ. 1934 35 సంవత్సరములలో మా చిన తాతగారి పెద్ద కుమారుడు వేంకట చలపతిరావు గారు స్కూలు ఫైనల్ ఫెయిలయ్యారు. మా నాయన గారు ఈ యిద్దరి తమ్ముళ్ళకు తెనాలిలో హోటల్ లో ఉపాహారము యిచ్చే వ్యవస్థ చేసానని చెప్పేవారు. గృహకలహము లెన్నియున్నా మా నాయన గారికి తన తమ్ముని పైనను, పిన తండ్రి కుమారులపైననూ అనురాగం ఉండేది. వారికి కూడా మా నాయనగారిపై ప్రేమా గౌరవం మిక్కుటముగా వుండేవి. వేంకట చలపతిరావు గారు, శ్యామసుందరరావుగారికి కొన్ని సమయములలో తమ తండ్రికన్నా, పెదతండ్రి కుమారుడైన మా నాయనగారిపై అధిక గౌరవము నెరపెడి వారు. వారిద్దరికీ మా నాయనమ్మగారి వద్ద ఎక్కువ స్వేతంత్రము వుండేది. ఆమె కూడా వారిని తమ స్వంత కుమారుల లాగానే ఆదరించేది. మా నాయనమ్మ (సీతారామమ్మ) గారు తమ ఆడబిడ్డ కామేశ్వరి కూతురు సుశీలను తన స్వంత కూతురులాగా పెంచింది. ఆ

ప్రేమ ఆమె జీవిత పర్యంతం వుండేది. మా సుశీల పిన్ని కూడా ఆమెను అమ్మా అని పిలిచేది. ఈ పరిస్తితులలో మా అమ్మగారిని కాపురానికి తీసుకు రావడం తర్వాత క్రీ.శ. 1935 లో నా జననం జరిగింది. నా జననం పెనుగుదురుపాడులో మా తల్లిగారి మేనమామ /మేనత్త గారి యింట్లో జరిగింది. నా జనన సమయానికి మా తాతమ్మగారు పెనుగుదురుపాడు వచ్చారట. ఆమెకు ముని మునిమడు ఆమె జీవిత కాలంలో కలుగుట అమెకు చాలా సంతోషం యిచ్చిందట. తర్వాత మా నాయనమ్మగారు కూడా తన జీవిత కాలంలో తనకు ముని మనవణ్ని చూడాలని తన కోరిక అని చెప్పేవారు. భగవంతుడు ఆమె కోరిక తీర్చి నాడు. మా చిన తాతగారికి 1933లో ఒక కుమారుడు పుట్టాడు. అయనకు వేంకట లక్ష్మీ నరసింహారావు ( వారి తండ్రి పేరు) అని పేరు పెట్టారు.

నేను పుట్టిన తర్వాత, 1935 లో మా నాన్నగారికి గ్రామ కరణం పదవి యిచ్చారు. దానితో కుటుంబంలో కొంత ఊరట కలిగింది. ఈ పదవితో గ్రామములో గౌరవము, ప్రతి నెలా జీతము లభిస్తాయి కదా. మా నాయన గారి నెల జీతము 15 రూపాయలు. ఆ కాల పరిస్థితులలో 15 రూపాయలలో ఒక చిన్న కుటుంబము అన్న వస్త్రములకు యిబ్బంది లేకుండా గడప గలిగేది.

అప్పటి గృహ పరిస్తుతులను సింహావలోకనము చేసినచో తెలిసే విషయాలు ఇవి కుటుంబము ఉమ్మడిగానే వున్నది. మా నాయన గారికి ఒక ఉద్యోగం వున్నది. మా పిన తండ్రిగారు, మా చిన తాత గారు వారి పెద్దకుమారుడు వేంకట చలపతిరావుగారు చదువులేక,

ఉద్యోగములు లేక వున్నారు. మిగిలిన పిల్లలలో శ్యామసుందర రావును పాఠశాలలో చదివించు చున్నారు. ఈ సమయంలో తాడికొండ శేషగిరిరావు గారు రంగ ప్రవేశం చేశారట. వారు మా చిన తాతగారితో, మా తాతమ్మ గారితో మా పినతండ్రి చంద్ర కళాధరరావు గారికి తమ కూతురు సావిత్రిని వధువుగా యిచ్చుటకు సిద్ధముగా వున్నట్లు ప్రస్తావన తెచ్చారట. వివాహము సమయములో ఒక ఎకరము భూమి యిచ్చుటకును, పెండ్లి తర్వాత తమ అల్లునికి పై చదువులు చెప్పించడానికి సిద్ధమనీ చెప్పారట. అప్పటికే మా నాయన గారి మేనత్త కామేశ్వరమ్మగారి కుమార్తె సుశీలకు గూడ, ఆ కాలపు పద్ధతుల ప్రకారము, వివాహ వయస్సు వచ్చిందట. ఆమెను మా పినతండ్రి గారికియిచ్చి వివాహము చేయాలని అనుకొనే వారట. దీనికి అందరూ సుముఖులుగా వుండేవారట. మా సుశీల పిన్ని తండ్రిగారు వేంకటప్పయ్యగారు కూడా దీనికి వ్యతిరేకులు కారు. తాడికొండ శేషగిరిరావు గారి ప్రస్తావన వలన, మా చిన తాత గారు కొత్త పధకము ఆలోచించి, మా పిన తండ్రి గారికి తాడికొండ శేషగిరిరావు గారి సంబంధం చేసుకుని, సుశీలను తమ కుమారుడు వేంకటాచలపతిరావుకు చేసుకొనుట మంచిదను కున్నారు. ఈ వివాహంతో ఆయన ఉద్దేశ్యం మరి కొంత ఆస్థి వచ్చునని. తాడికొండ శేషగిరిరావు గారు కొంత ఆస్తి (ఒక ఎకరము) మా పిన తండ్రికి యిస్తారు. ఆలాగే వేంకటప్పయ్యగారి ఆస్తి వేంకటా చలపతిగారికి వస్తుంది. అందువలన కుటుంబమునకు కొంత ఆస్తి వచ్చునని ఆయన తలచి వుండవలెను. ఇలా ఎందుకు చేశారు. తాడికొండ శేషగిరిరావు గారు తమ కూతురును వేంకటాచలపతిరావుకు యివ్వవచ్చు గదా, అనే

సందేహము వస్తుంది. కాని తాడికొండవారికి, కొమరవోలు వారికి వున్న బంధుత్వముతో వేంకటాచలపతిరావు గారికి, సావిత్రి గారికి అన్నా చెల్లెళ్ల వరుస వస్తుంది. ఇవి అన్నీ ఆలోచించిన తర్వాత, మా తాతమ్మ గారు, విషయమును మా నాయనమ్మ గారితో ప్రస్తావించారట. మా నాయనమ్మగారు తనకేమీ తెలియదని, మా నాయనగారి తోను, సుశీల పిన్నితోను మాట్లాడమని చెప్పారట. సుశీల పిన్ని వెంటనే 'అమ్మా, నువ్వు ఎవరిని చేసుకోమంటే వాళ్ళనే పెళ్లి చేసుకుంటాను' అని చెప్పారట. మా నాయనగారితో మాట్లాడగా, ఆయన తాము తాడికొండ వారి సంబంధానికి యిష్టపడమనీ, సుశీలను తమ కోడలిగా హనుమంతరావుగారుచేసుకోటానికి తన కభ్యంతరం లేదన్నారట. తాడికొండ శేషగిరిరావు గారి మంత్రిత్వము వల్లనే తమ కన్ని కష్టాలు కలిగాయని మా నాయన గారి ధృఢ విశ్వాసము.

అందువల్ల ఎట్టి పరిస్తితులలోను, ఈ సంబంధము తనకు యిష్టము లేదన్నారు. మా పిన తండ్రి గారు తమకు కాలేజీ చదువుకు వీలవుతుందని, కాలేజీలో టెన్నిస్ ఆడవచ్చనీ అనుకొని ఈ వివాహమునకు తన అంగీకారమిచ్చారు. ఆయన తరచు, 'నాకు టెన్నిస్ బ్యాట్ పట్టుకునే అదృష్టం పట్టున్నది' అననేవారట. వేంకటా చలపతిరావు గారు తనకు సైకిల్ కొనిస్తే చాలు పెళ్లి చేసుకుంటానన్నారట. వివాహానికి ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా ఆలోచించారని, దాని వలన కలుగు లాభాలు మాత్రమే దృష్టిలో వుంచుకున్నారని తెలుస్తున్నది. ఏది ఏమైనా అందరి ఆలోచనలు మా నాయన గారి యిష్టానికి వ్యతిరేకమే. మా నాయనమ్మగారు సుశీల పిన్ని తటస్థము. ఈ పరిస్తితులలో ఒక రోజు

మా పిన తండ్రి మా నాయన గారితో 'నేను తాడికొండ శేషగిరిరావు గారి కుమార్తెను పెండ్లి చేసుకోవటానికి నిశ్చయం చేసుకున్నాను. నువు పీటమీదకూర్చుంటావా, లేదా' అని అడిగారట. వెంటనే మా నాయన గారు 'నీకు అన్న లేడనుకో' అని అన్నారట. వెంటనే ఒక వంక వివాహ ప్రయత్నాలు జురుగుతున్నప్పుడు, వేరొక వంక మా నాయన గారు తమ భార్య, కుమారులతో ఆ యింటి నుండి వెళ్లి పోయారు. అప్పటి నుండి మా నాయన గారు మా పిన తండ్రితోను, తమ పిన తండ్రి తోను, తమ నాయనమ్మతోను సంబంధము తెంపు కొన్నారు. ఈ వివాహము వలన, మా నాయన గారికి తమ తల్లితోను, వేంకట చలపతిరావు గారితోను, సుశీలతోను సంబంధాలు చెడిపోలేదు.

తర్వాత చాలా కాలం వరకు మా సుశీల పిన్నికి పుట్టింట జరగవలసిన మర్యాదలు, ఆదరణ మా నాన్న గారు చేసేవారు. మాకు భూమి నుండి ధాన్యము వస్తుంన్నంత కాలం ప్రతి సంవత్సరం మా సుశీల పిన్నికి లాంఛనాను సారంగా సోదరికిచ్చే 'తవ్వగంప' యిచ్చేవారు. కొత్త ధాన్యము యింటికి వచ్చిన తర్వాత పాతరలో పోసేవారు. ఆ సమయంలో పెద్ద గంపెడు వడ్లుసోదరికి 'తవ్వ గంపగా' యిచ్చుట ఆచారము. ఈ ఆచారము దాదాపు క్రీ.శ. 1952 వరకు జరిగి నట్లు జ్ఞాపకము. తర్వాత మా నాయనగారు భూమి విక్రయం చేయడం వలన భూ వసతి లేదు. పంట లేదు. తవ్వ గంప లేదు.

ఈ పెళ్లిళ్ళ పర్యవసానంగా ఉమ్మడి కుటుంబం మూడు ముక్కలయింది. మా నాయన గారు వేరు కుటుంబం, మా పిన తండ్రిగారు తమ తల్లితోను, నాయనమ్మగారితోను, ఒక్క కుటుంబం, మా చిన

తాతగారు తెనాలి కుటుంబాలుగా చీలి పోయారు. మా నాయన గారికి రెండు ఎకరముల ఆస్తి, ఉద్యోగం వున్నాయి. మా పిన తండ్రికి 2 ఎకరముల భూమి వుంది. కాని మా చిన తాతగారు నిరాధారులైయ్యారు.. ఆ కాలంలో మా నాయన గారు దంతలూరు పెదవేంకట్రాజు గారింట్లో ఒక భాగంలో ఉండేవారు. మా పినతండ్రి పువ్వాడ సుబ్బమ్మ (కోమటి సుబ్బమ్మ) గారి యింట్లో వుండేవారు. ఈ సుబ్బమ్మ, ఆమె కుమారుు సుబ్బారావు నిరాశ్రయులుగా వున్నప్పుడు మా యింటి ఆవరణలో ఒక చిన్న యిల్లు వేసుకుని వ్యాపారం చేసుకునే వారు. కాల క్రమంలో వారొక యిల్లు కొనుక్కుని, దాంట్లోకి మారారు. ఈ తారుమారు

బహు విచిత్రం. నిర్వాసితులై బలభద్రపాత్రుని వారింట కొంత కాలమున్న వారింట్లో నే బలభద్రపాత్రుని వారు నిర్వాసితులై చేరడం బహు విచిత్రం.

తర్వాత కొన్ని రోజులకు మా నాయనగారు రుద్రరాజు వేంకట్రాజు గారింటికి తమ నివాసము మార్చు కున్నారు. ఈ యింట్లోమేమి 1943 వరకు వున్నాము. మా పిన తండ్రిగారు కూడా వేరొక యింటికి (పుల్లంరాజు గారింటికి) మారారు. వాళ్లు కూడా 1942 వరకు అక్కడే వున్నారు. తర్వాత హైదరాబాదులో ఉద్యోగము కొరకు వచ్చి స్థిర పడ్డారు.

ఈ విభజన జరిగిన కొన్ని రోజులకే మా తాతమ్మగారు మంచం పట్టారు. వైద్యం కోసం తెనాలి తీసుకు వెళ్ళారు. మా నాయనమ్మ గారు కూడా ఆమె వెంట తెనాలి వెళ్లారు. మా తాతమ్మ గారు ఒక గ్రహణం రోజున ( సూర్య గ్రహణమో, చంద్ర గ్రహణమో జ్ఞాపకం లేదు) పరమపదించారు. ఈ విషయం జ్ఞాపకం వుండటానికి కారణం

ఉంది. మా తాతమ్మ గారిని చూడటానికి వైద్యుడు వస్తే, ఆమె 'గ్రహణం ఎప్పుడుపడ్తుంది, ఎప్పుడు విడుస్తుంది' అని అడిగారట. వైద్యుడు 'గ్రహణము సమయములో స్నానం చెయ్యాలనా, అలా అడిగారు' అని ప్రశ్నించాడట. ఆమె 'లేదు, నేను గ్రహణము పట్టే సమయంలోగాని, విడిచే సమయంలో గాని చనిపోతాను' అని చెప్పారట. అలాగే గ్రహణం సమయంలోనే అమె చనిపోయారు. బహుశః అదిసూర్య గ్రహణ మేమో. మా నాయన గారు సూర్యారావుగారు. మా పిన తండ్రి గారు చంద్రకళాధరరావు గారు. ఇద్దరూ సూర్య చంద్రులని అనుకొనే వారామె. చంద్రకళాధరుడనగా శివుడు. కాని ఆమె ఆయనను చంద్రం అని పిలుచుకుంటూ చంద్రుడని అనుకునే వారు. ఆమెకు మా నాయన గారన్న మిక్కిలి ప్రేమ అని తెసులుగదా. అయనతో సంబంధము విఛ్ఛిన్న మై పోవుట ఒక విధముగా ఆమెకు సూర్య గ్రహణమే! ఆరోజు మా నాయన గారికి ఈ విషయం తెలిసింది. తెనాలిలోనే వుండి కూడా, ఎంత వెదికినా దొరకలేదట ఆమె దహనమునకు గాని, ఆమె కర్మలకు కాని వెళ్ళలేదు. అంతమాత్రాన మా నాన్నగారికి ఆమె మీద వున్న ప్రేమా అభిమానం ఏమీ తరగ లేదు. ఎప్పుడైనా ఆమె ప్రసక్తి వచ్చినపుడు తనకు ఆమెపై గల గౌరవము, ఆమెకు తనపైన గల ప్రత్యేక ప్రేమ గురించి ఎంతో చెప్పేవారు.

మా పిన తండ్రి గారికి వివాహము తర్వాత ఆశాభంగ మైనది. ఆయన కాలేజీ చదువుకు ఆయన మామ గారు సహాయము చేయలేదు. ఆయన చదువు అంతటితోనే ఆగిపోయింది. కాలేజీలో టెన్నిస్ బ్యాట్ పట్టుకోవాలనే ఆయన కల కలగానే మిగిలిపోయింది. తర్వాత

హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నప్పుడు టెన్నిస్ ఆడేవారు. ఆయనకు వరకట్నం క్రింద యిస్తానన్న ఎకరం భూమి యివ్వలేదు. దాదాపు 12 సంవత్సరముల తర్వాత మా పిన తండ్రి గారు హైదరాబాదులో రజాకార్ ఉద్యమ సమయంలో ఉద్యోగం వదిలి, మా గ్రామానికే వచ్చి, మా యింట్లోనే వుండేవారు. అప్పుడు తాడికొండ శేషగిరిరావు గారు, మా యింటికి వచ్చి. అల్లునికి యిస్తానన్న ఎకరం భూమిని యిచ్చారు. మా చినతాతగారు హనుమంతరావు గారు కూడా ఈ వివాహముల వల్ల లాభ మేమీ పొందలేదు. కొమ్మమూరి (కొమ్మూరి) వేంకటప్పయ్యగారికి యిదివరలోనే మా చిన తాతగారి మీద కొప ముండేదని తెలుసు గదా .

మా తాతమ్మగారికి ఆయన తమ్ముడు వరస అయిననూ ఆయన ఆస్థి ఏమాత్రం తన కూతురికి, అల్లునకు యివ్వలేదు సరికదా, పై పెచ్చు ఒక చిన్నపిల్లవాడిని దత్తత చేసుకున్నారు. ఆ దత్తు కుమారుడు ఆయనపై వ్యాజ్యము వేసి, ఆస్తిలో భాగము తీసుకున్నాడు. వేంకటప్పయ్యగారు 1952 లో సికింద్రాబాదు కూతుర్ని చూడటానికి వచ్చారు. అప్పుడు నేను చదువుకుంటూ సికింద్రాబాదులో వుండేవాణ్ణి. కూతురికి 20 రూపాయలో, 30 రూపాయలో యిచ్చి వెళ్ళి పోయెను. మా సుశీల పిన్ని బహశః అప్పుడే ఆయనను చివరిసారిగా చూసిందేమో! పాపం ఈ పెద్దవారి సంకల్పము వల్ల అదివరకే తండ్రి వద్ద వాత్సల్యమును పోగొట్టుకున్న ఆమె చివరికి ఆస్తి కూడా పోగొట్టుకుంది. ఆ తండ్రీ కూతుళ్ళు యిద్దరికి ఒకరిపై ఒకరికి ఏమాత్రం అభిమానం లేకపోవడం దురదృష్టము.

బలభద్రపాత్రుని అప్పయ్యగారి విషయము లోనూ, శేషయ్యగారి విషయములోను, చివరకు మా నాయన గారి విషయంలోకూడా ఒకే సారూప్యము కనిపిస్తుంది.అప్పయ్యగారు వలివేరు వదలి తమ దాయాదులతో తెగతెంపులు చేసుకున్నారు. శేషయ్యగారు తమకు సన్నిహితులు, ప్రీతి పాత్రులైన సుందరరావు గారిని వదలుకున్నారు. మా నాయన గారు తమ నాయనమ్మతో తెగతెంపులు చేసుకున్నారు. వారు జీవితాంతం ఎప్పుడూ ఈ విషయాన్ని పునర్విమర్శ చేయలేదు. నారి నిర్ణయాలను విశ్లేషించి తప్పొప్పులు ఎంచే అధికారం మనకు లేదు. వారి వారి కాలములో వున్న పరిస్థితులు, వారి మానసిక ప్రవృత్తి, వారి విలువలు మనము తెలిసుకోలేము.

మా చిన తాతగారు తెనాలిలోనే వుండేవారు. మా పిన తండ్రి వేంకటాచలపతిరావు గారు 1939లో కంభంమెట్టు వెళ్లి బస్ కండక్టరు ఉద్యోగం సంపాయించిన తరువాత, ఆయన తండ్రికి కొంత సాయము చేయ గలిగారు. 1947 ప్రాంతములో మా పినతాతగారి రెండవ కుమారుడు, శ్యామసుందర రావు సికిందరాబాదు రైల్వేలో ఉద్యోగము సంపాదించి స్థిర పడ్డారు. మా చిన తాతగారు 1950లో తమ నివాసమును సికిందరాబాదుకు మార్చుకుని తమ పిల్లల దగ్గరే వుండేవారు. ఆయన తర్వాత వరంగల్ లో తమ కనిష్ట కుమారుడు లక్ష్మీ నరసింహారావు గారి వద్దనే వుండి, క్రీ.శ 1972 లో పరమపదించారు. ఆయన దాదాపు 84 సంవత్సరాలు జీవించారు. మొదటి సగము జీవితము ఒక జమీందారులా వెలిగి, పిదప సగము జీవితము అతి దారిద్ర్యమును అనుభవించారు. ఆయన ఎప్పుడూ నిర్వేదము గాని, బాధకాని వ్యక్తము

చేయ లేదు. ఆయన తనకు అన్యాయము జరిగనదని గాని, జరిగిన దానికి బాధ వుందని కాని నా కెప్పుడూ చెప్పలేదు. ఆయన మరణమే ఒక చిత్రము. ఆయన ఎప్పుడూ చెప్పులు తొడిగి ఎరుగరు. ఎంత దూరమైనా ఆ వయస్సులో నడిచే వెళ్ళేవారు. ఆ వయస్సులో కూడా యిన్స్యూ రెన్స్ చేయించటానికి ఎవరినైనా కలుసు కునేందుకు వెళ్ళేవారు. అలా ఒక రోజు సాయంత్రం బయటకు వళ్ళిన ఆయన యింటికి తిరిగి రాలేదు. రాత్రి 7గంట లప్పుడు మా పిన తండ్రి లక్ష్మి నరసింహారావు నా దగ్గరకు వచ్చి, 'నాన్నగారు యింటికి రాలేదు.'

'ఎవరో ఒక ముసలాయన హోటల్‌లో చనిపోతే హాస్పటల్ కి తీసుకెళ్లారని ఎవరోచెప్పారు. చాలా ఆదుర్దాగా వుంద'ని చెప్పారు. మేమిద్దరం వెళ్లి విచారిస్తే, చని పోయింది మా తాతగా రేనని, మార్చురీలో భద్రపరిచారనీ, పోలీసుల పర్మిషన్‌తో శవాన్ని తీసుకు వెళ్ళవచ్చనీ తెలిసింది. అప్పుడింక చేసేదేమీ లేక, మర్నాడు పోలీసు పర్మిషన్ తీసుకుని, శవాన్ని మా పినతండ్రి లక్ష్మి నరసింహారావు గారింటికి తీసుకుని వెళ్ళి, ఆయన కుమారులందరూ వచ్చిన తర్వాత దహనము చేసాము. తర్వాత మేము హోటల్‌కి వెళ్ళి విచారించాము. వాళ్లు, 'ఆయన దోశ తెమ్మని అడిగారు. తెచ్చిన తర్వాత ఒక్క ముక్క నోట్లో పెట్టుకుని, వెనకకు పడిపోయారు. మేము వెళ్ళే సరికే చని పోయారు, ఎవరోతెలియక పోలీసులకు కబురు పంపాము' అని చెప్పారు. పోలీసులు హనుమ కొండ లోని పెట్రోలు పంపులో చెప్తే వాళ్లు ఈ వార్త మా పిన తండ్రికి తెలియ జేశారు. మా నాయన గారు కరిణీకం చేస్తున్నా, యింకా సినిమాల మోజు వుండేది.

అప్పుడప్పుడే సినిమా దేశమంతా పాకుతున్నది. ఆ వ్యాపారంలో భాగం పంచు కోవాలని, సినిమాలు తీయాలని ప్రయత్నాలు చేసేవారు. ఆయన స్నేహితుడు భీమవరపు నరసింహారావు మద్రాసులో సంగీత నిర్దేశకుడు. అప్పుడు ఆయన ప్రారంభించిన సినిమాతో సంబంధం పెట్టుకోవాల అనుకున్నారు. కాని ఆయన మా నాయన గారిని ఆహ్వానించలేదు. అందువల్ల మరో స్నేహితుణ్ణి ప్రొడక్షన్ మేనేజరుగా పెట్టుకోమని నరసింహారావు గారితో చెప్పి మా ఊరికి తిరిగి వచ్చారు.

మా గ్రామములో క్షత్రియ యువకులు స్నేహితులు. వారితో బాటు గుఱ్ఱపు స్వారి నేర్చుకున్నారు. తమ తాత ముత్తాతలు గుఱ్ఱముల మీదప్రయాణంచేసేవారు. ఆయన కూడా ఒక గుఱ్ఱమును కొని, అప్పుడప్పుడూస్వారి చేయడం, దగ్గర ఊళ్లకు గుఱ్ఱం మీద వెళ్ళడం చేసేవారు. ఆ గుఱ్ఱానికి శాల మా యింట్లో లేక పోవడం వల్ల వేరే చోట వుంచేవారు. ఈ విధానం సరిగా లేక చివరకు గుఱ్ఱాన్ని అమ్మివేశారు. ఆ తర్వాత ఆ క్షత్రియ యువకులతో కలిసి సైకిల్ పై మద్రాసు వెళ్ళాలని అనుకుని, వారందరూ బయలుదేరి, సాయంత్రానికి సూళ్లూరు పేట జేరి, ఆ రాత్రి అక్కడ విశ్రాంతి తీసుకుని, మరునాడు 9 గంటలకు మద్రాసు చేరారు. అక్కడ కొన్ని రోజులుండి, తనతో వచ్చిన వీళ్లు వేరే ప్రదేశములకు పోవాలను కోవడంతో, సైకిల్‌ను రైల్లో వేసుకుని (బుక్‌చేయించి), తిరిగి వచ్చారు. మదరాసు సినిమా ప్రపంచంతో పరిచయం అయిన తర్వాత ఆయన 'Exacta' అనే కెమేరాను కొన్నారు. దానితో ఫొటోలు తీయడమే కాదు, డెవలపింగ్, ప్రింటింగ్ కూడా స్వయంగా చేసుకునేవారు. తర్వాత దానిపై మోజు తగ్గి, దాన్ని ఆలపాటి

వేంకట్రామయ్యగారికి 150 రూపాయలకు అమ్మేశారు. తను ఎక్కువగా సైకిల్ మీదే ప్రయాణం చేసేవారు. సైకిల్ రిపేరింగ్ క్షుణ్ణంగా నేర్చుకుని, స్వయంగా తానే రిపేర్ చేసుకునేవారు. అంతేకాక ప్రయాణములో యిబ్బంది లేకుండా, ఒక సైకిల్ పంపును, యితర పంక్చర్ సామానులను ఒక డబ్బాలో వేసి సైకిల్‌కు బిగించేవారు. రాత్రి పూట ప్రయాణంలో డైనమోతో వెలిగే దీపం ఉండేది. ఈ వ్యాపకములన్నిటి వలన కరిణీకంపై శ్రద్ధ తగ్గింది.

ఆ కాలములో చుట్టు ప్రక్కల గ్రామములలోని వాళ్లకి మా నాయన గారు చేసే ప్రతి పనీ వింతగా వుండేది.

క్రీ.శ. 1933లో ప్రజల జీవితంలో కాఫీ ప్రవేశించింది. అదీ తెనాలి వంటి పట్టణాల్లో మొదలై బ్రాహ్మణ కుటుంబాలకు చేరింది. దానిని మొట్టమొదటసారి మా గ్రామానికి మా నాయన గారే తీసుకు వచ్చిరి. ఆ కాఫీ ప్రహసనము ఈ విధంగా వుండేది  కాఫీ గింజలు తీసుకు వచ్చి, వాటిని వేయించి డబ్బాలో పోసేవారు. తర్వాత ఉదయాన్నే కొలత ప్రకారం ఆ గింజలు కాఫీ పౌడర్ కోసం ప్రత్యేకంగా కొన్న చేతి మరలో వేసి గ్రైండ్ చేయించి, ఫిల్టర్‌లో వేయించి, వేడి నీళ్లు పోయించి, డికాక్షన్ తయారుచేయించిన తర్వాత పాలు చక్కెర కలిపి కాఫీ త్రాగే వారు. ఈ కాఫీ మా అమ్మగారికి కూడా అలవాటు అయింది. ఆమె తన పుట్టింటికి పెనుగుదురుపాడు వెళ్లేటప్పుడు గూడాఈ సరంజామా అంతా తన వెంట తీసుకు వెళ్ళేవారు. పెనుగుదురుపాడులో ఈ విషయం అబ్బురంగా చెప్పుకునే వారు. ఆ ఊళ్లో ఎవరూ కాఫీ త్రాగే వారు కాదు. తెనాలి వెళ్లి నపుడు కాఫీ త్రాగిన కొందరు,యింటికి వచ్చి,

ధనియాలు వేయించి, వాటితో కషాయం చేయించి, పాలు చక్కెర కలిపి ధనియాల కాఫీగా త్రాగే వాళ్ళు. కాఫీ అలవాటు ఖరీదైన ఆలవాటు. వీసె (120 తులాలు) కాఫీ గింజల ఖరీదు 2.50 రూపాయలు. మా నాయని గారి నెలసరి వేతనం 15 రూపాయలు. నెలకి కావలిసిన కాఫీ 2 వీశలు అనగా 5 రూపాయలు. పాలు చవకయినా చక్కెర కూడా కావాలి కదా. ఆ కాలములో ఒక తులం వెండి ధర 14 అణాలు. అంటే 7/8 రూపాయి. ఈ కాఫీ అలవాటు మానలేక కొంత మంది బ్రాహ్మణ కుటుంబాలు తమ యిండ్లలో నున్న వెండి సామాను విక్రయించేవారు. అలా మాయింట్లో పొద్దున, మధ్యాహ్నం కాఫీ త్రాగే అలవాటు అలాగే నిలిచి పోయింది. ఈ ఆలవాటుపై మా వూరులోను, పెనుగుదురు పాడులోను చర్చలు జరిగేవి. ఇంత ఖరీదైన ధనవంతుల అలవాటున్న మా కుటుంబాన్ని ఈర్ష్యతో చూసేవాళ్ళు. వాళ్లు మా యింటికి వచ్చినపుడు కాఫీ యిస్తే వారి సంతోషము వర్ణనా తీతము.

ప్రఖ్యాత గాయనీ మణి, సంగీత విద్వాంసురాలు శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి గారు ఒక వ్యాసంతో ఈ కాఫీ గురించి చెప్తూ, తనకు చిన్నతనంలో కాఫీ కర్చు ఎక్కువ అవటం వల్ల, ధనియాల కాఫీ అలవాటు చేసుకన్నాననీ, యిప్పటికీ తను ధనియాల కాఫీ త్రాగటం మానలేదని చెప్పారు.

మా నాన్నగారి జీవిత విధానం లో ఆ కాలపు వారికి వింత గొలిపే వి ఎన్నో వుండేవి. ఆయన మద్రాసు నుండి వచ్చే టప్పుడు పొగాకు పైపు (టొబాకో పైప్) తెచ్చారు. దానికై ప్రత్యకముగా చేసిన కాప్‌స్టన్ పొగాకు నింపి ఆ పైపు త్రాగేవారు. ఆ రోజులలో ఆదో వింత. మరొక

విడత మద్రాసు నుండి వచ్చేటప్పుడు సిగరెట్ ఫిల్టర్ (ఆరోజులలో దాని ఖరీదు 10 రూపాయలు మాత్రమే), ఒక డబ్బా సిగరెట్లు తెచ్చారు. ఆఫిల్టర్‌లో సిగరెట్ పెట్టి దాని ద్వారా పొగ త్రాగేవారు. ఇది కూడ ఒక వింతగా అందరూ చెప్పుకునే వారు. కొన్ని రోజులు హుక్కా తో పొగ త్రాగేవారు. మరో మారు మద్రాసు నుంచి వస్తూ ఒక

పెట్టె కాగితాలు, ఒక పెట్టె పొగాకు తెచ్చి, అప్పటి కప్పుడు సిగరెట్ చేసుకుని త్రాగేవారు.

ఇలా జరుగుతుండగా మా నాయన గారు క్రీ.శ. 1938లో సినిమా తీయాలని, డబ్బు పెట్టుబడి పెట్టే వారిని కుదుర్చుకుని బొంబాయి వెళ్లారు. అక్కడ సొహ్రాబ్ మోడీ ని కలుసుకుని, మినర్వా స్టూడియోలో సినిమా తీయటానికి ఆయనను ఒప్పించారు. ఆయన సినిమా కథ అడిగినప్పుడు, The Forgotten Empire అనే పుస్తకము లోని కథను సినిమాగా తీస్తామని చెప్పారట. ఆయనకు విజయ నగర సామ్రాజ్యము, శ్రీకృష్ణ దేవరాయల కథను వినిపించారట. సొహ్రాబ్ మోడీ తను కూడ పెట్టుబడి పెట్టడానికి సంసిద్ధమని చెప్పారట. ఆ కాలములో మినర్వా స్టూడియోలో అన్ని వసతులూ వుండి, సినిమా తక్కువ కర్చుతో అయేదట. అక్కడి నుండి పూనా వచ్చి, బాలగంధర్వ తో మాట్లాడి, ఆంధ్రదేశంలో ఆయనకున్న పరపతిని చెప్పి, ఆంధ్రలో కచేరీలు చేయటానికి వప్పించారట. పూనా నుండి కొల్హాపూర్ వెళ్లి మహారాజా సినీటోన్, మహారాణీ సినీటోన్ వారితో మాట్లాడి, మినర్వా స్టూడియో కంటే తక్కువ రేటుకు వారిని వప్పించిరట. ఈ యాత్రకు ఆయన ప్రత్యేక మైన భోజన ఏర్పాట్లు చేసుకున్నారు. ఒక సంచీలో గోంగూర పచ్చడి, ఆవకాయ,

కంది పొడి, కారపు పొడి డబ్బాలు వుంచుకుని వెళ్లారు. ప్రతి పట్టణములో హోటల్‌కు వెళ్ళి భోజన సమయంలో సంచీ విప్పి, తను వాటిని తింటూ తనతో పాటు భోంచేసేవారికి రుచి చూపే వారట. ఈ అలవాటుతో హోటల్ వారు ఈయనపై ప్రత్యేక శ్రద్ధ చూపే వారట. అట్లా యాత్ర ముగించుకుని తిరిగ వచ్చిన తర్వాత పెట్టు బడి పెట్టే ఆసామి తన కూతురుకు సినిమాలో ముఖ్య పాత్ర యిస్తేనే పెట్టుబడికి సిద్ధమని చెప్పారు. అది వీలు కాని పరిస్థితి. అది మా అదృష్టమని అనుకుంటాను. పెట్టుబడి డబ్బు దొరికి సినిమా కోసం మా నాయన గారు బొంబాయి వెళితే, అప్పుడు కథ మరో రకంగా వుండేది. అప్పుడే యుద్ధము ముమ్మర మయింది. సొహ్రాబ్ మోడీ కి ఈ విషయం తెలియజేస్తూ, యుద్ధ పరిస్తితులలో బొంబాయిలో వుండటం కష్టమని, యుద్ధమైన తర్వాత మరల వచ్చి సినిమా తీద్దామని అనుకుంటున్నామని ఉత్తరం రాశారు. సొహ్రాబ్ మోడీ దానికి ఎప్పుడైనా తన స్టూడియోలో సినిమా తీయుటకు రావచ్చునని జవాబు రాశారు. అప్పటికి ఆ అధ్యాయము అయింది. బహుశః తను సినిమా తీయుట అసంభమని తెలుసుకున్నారను కుంటాను. ఈ కాలము లోనే మరొకసారి బొంబాయికి వెళ్లి వచ్చిరి. వారి మిత్రులు ప్రభల సీతారామ శాస్త్రి గారు విజయ్ హజారే గొప్ప క్రికెట్ ఆటగాడనీ, ఆయని ఆట చూడని వాని జీవితం వ్యర్థమని చెప్పేసరికి, వెంటనే ఆయనతో బయలుదేరి బొంబాయి వెళ్ళి, టికెట్టు కొని ఆటచూస్తున్నారట. విజయ్ హజారే బ్యాటింగ్‌కి వచ్చి నప్పుడు అందరూ ఆసక్తితో చూస్తుండగా, అతను ఒక రన్ చేసి అవుటయ్యాడట. మా నాన్నగారు తన స్నేహితుణ్ణి తిట్టి, వెంటనే మా గ్రామానికి వచ్చేశారు.

ఈ యాత్రలలో ఆయన ఎప్పుడూ యింటర్ క్లాస్ డబ్బాలోనే ప్రయాణం చేసేవారు. నడుముకు కాశీ కోక బిగించి అందులో డబ్బుదాచుకుని ప్రయాణం చేసేవారు. ఈ వ్యాపకాలు, అభిరుచుల వల్ల, మా నాయన గారు నెలలో దాదాపు 20 రోజులు తెనాలి వెళ్లేవారు. కొన్ని సమయములలో తెనాలిలోనే రాత్రి గడిపేవారు.

తెనాలిలో రత్నాహాలు సినిమా థియేటర్ నాజర్ పేటలో వుండేది. దానికి ఎదురుగా నాయుడి కొట్టుగా ప్రసిద్ధి గాంచిన ఒక చావడి అది. తెనాలిలో ఆయన వుండేది అక్కడే. అక్కడ స్నానాదుల వసతులుండేవి. ఆ చావడిలో ఒక సోడా దుకాణము, ఆయిల్ యింజన్ల రిపేరు చేసే ప్రదేశం వుండేది. దాని యజమాని నరసింహరావు నాయుడు గారు. ఆయన ఆ దుకాణము చూసే వారు. సినిమా హాలుకు ఎదురుగా వుండటం వలన సోడాలకు, సిగరెట్లకు, చిరు తిళ్ళకు మంచి గిరాకి వుండేది. రాత్రి 11 గంటల వరకు దుకాణము నడిచేది. అందువలన దుకాణము ఉదయం ఆలస్యముగా తెరిచేవారు. పగలు అక్కడ ఆయిల్ యింజను రిపేరు చేసేవారు. ఆయన పేరు నారాయణరావు. అడపా నరసింహారావు, నారాయణరావులు అన్నదమ్ములు. వారు బుర్రిపాలెం రోడ్డుపై నున్న స్వంత యింటిలో వుండేవారు. మా నాయనగారికి వారిద్దరూ పరమ మిత్రులు. నారాయణరావుగారు మా నాయన గారిని అన్నా అని పిలిచే వారు. ఒక సారి నన్నుకూడా మా నాయన గారు తెనాలి తీసుకు వెళ్ళారు. అప్పుడు నారాయణరావు గారు నన్ను వారింటికి తీసుకు వెళ్తా మన్నారు. ఆ రాత్రి హోటల్ నుండి భోజనం కారియర్‌తో తెప్పించగా, నేను మా నాన్నగారు భోజనము చేసితిమి. తర్వాత నేను నారాయణ బాబాయి (

నారాయణ రావుగారిని నేను బాబాయి అని, నరసింహారావు గారిని నాయుడుగారు అని పిలిచే వాడిని) తో కలిసి వారింటికి వెళ్ళాను. ఆయను భార్యను పిన్నీ అని పిలిచే వాడిని. ఆ రాత్రి నాతో ఆప్యాయంగా మాట్లాడి నన్ను నారాయణ బాబాయి మంచం మీదనే నిద్ర పుచ్చింది. ఉదయం నాయుడు గారు గోల్డెన్ కేఫ్ అనే హోటలుకు తీసుకు వెళ్ళారు. నాతో ఆయన పెద్ద కుమారుడు లక్ష్మయ్యకూడా వున్నాడు. అందరం పీటల మీద కూర్చుని టిఫిన్ చేశాము. తర్వాత మా నాయన గారి దగ్గరకు వచ్చాము. ఆ సాయంత్రం మేము బుడ్డుగాడి గుఱ్ఱపుబండిలో యింటికి చేరాము. బుడ్డుగాడి గుఱ్ఱపుబండికి ఒక ప్రత్యేకత వుంది. అతను ఎక్కడవున్నా, మా నాయనగారి పేరు చెప్పగానే అన్ని బాడుగలు వదులుకుని మా నాయనగారి దగ్గరకు వచ్చేసేవాడు. ఒక రోజు రాత్రి మేము చిన గాదెలవర్రులో వున్నాము. రాత్రి 11 గంటలప్పుడు, గాలి వాన మొదలై బాగా వాన పడుతున్నది. ఆ సమయములో మా సుశీల పిన్ని బుడ్డుగాడి గుఱ్ఱపుబండిలో యింటికి వచ్చారు. అందరూ ఆశ్చర్య పోయారు. ఆమె ఆ ఉదయమే హైదరాబాదు నుండి తెనాలి వచ్చి, బుడ్డుగాడికి సాయంత్రం గాజులూరు వెళ్లాలని చెప్పిందట. అంతే సాయంత్రం వెళ్లి ఆమెని తీసుకుని ఆ గాలివానలో మా ఊరికి తీసుకు వచ్చాడు. వాన తగ్గిన తర్వాత తిరిగి బుడ్డుగాడు వెళ్ళిపోయాడు. బుడ్డుగాడి గురించి యింకా చెప్పాల్సిన విషయం వుంది.

మేము బండిలో వచ్చే టప్పుడు మా నాన్నగారు రాత్రి నారాయణ బాబాయి యింట్లో ఏమి చేసావు అని అడిగారు. నేను పిన్ని నాతో మాట్లాడింది. కాళ్లూ చేతులూ కడిగింది. నిద్ర వచ్చిన తర్వాత మంచంమీద

పడుకోపెట్టి, నా పక్కనే కూర్చుంది అని చెప్పాను. ఏం మాట్లాడింది అని మా నాన్న గారు అడిగారు. గ్రామములో మా అమ్మతో వుంటాము. మా చెల్లిలితోనూ, మిగిలిన వారిలోను ఆడుకుంటామని చెప్పాను. ఇంకేమి అడిగింది అని మా నాన్నగారు అడిగారు. నువ్వు, నీ చెల్లెలు, నీ తోటివారితో ఆడుకుంటావు. మీ నాయన గారు ఎక్కువ సమయం తెనాలిలో వుంటారు. మరి మీ అమ్మగారు ఒక్కరూ ఎలా వుంటారు అని అడిగిందని చెప్పాను.

తర్వాత ఆయన మౌనముగా వుండిపోయారు. ఈ సంభాషణ చెప్పటానికి కారణం ఏమిటంటే ఆ తర్వాత మా నాన్న గారు తెనాలిలో అవసరమైనప్పుడే వుండేవారు. ఎక్కువ కాలం మా ఊరిలోనే వుండేవారు. అప్పుడు కరిణీకం మీద శ్రద్ధ పెరిగింది. తదుపరి రోజులలో గుంటూరు జిల్లా లోనే గొప్ప కరణమని పేరు తెచ్చుకున్నారు. ఈ గొప్పతనం నిజాయితీలోను, నిష్కర్షలోను, కరిణీకం లెక్కల తయారీలో తీసుకునే శ్రద్ధ లోనూ, ఆయన దస్తూరిలోనూ వుండేవి ఏ లెక్కలలోనూ ఎవ్వరూ ఎక్కడా తప్పులు చూపించలేక పోయే వారు. జమాబందిలో రెడ్ ఎంట్రీ వచ్చిన కరణం గా మా నాన్న గారికి గుర్తింపు వుండేది.

1940 లో నుకుంటా, మా నాన్నగారు ఒక ట్రయంఫ్ మోటర్ సైకిల్ కొన్నారు. అది జర్మనీలో మొదటి ప్రపంచ యుద్ధం అయిన తర్వాత తయారైన మోటర్ సైకిల్. దీనికి బెల్ట్‌డ్రైవ్, పుష్ స్టార్ట్ వున్న బండి. దానికి క్లచ్ వుండదు. ఆ బండిని నారాయణ బాబాయి చేత బాగు చేయించి నడుపుతూ వుండేవారు. దానికి గేర్ సిష్టమ్ మార్చి, పెట్రోలు టాంక్‌మీద గేర్ షిఫ్టర్ అమర్చి, నడిపేవారు. దానికి వెనక

సీటు సైకిల్ కారియర్ సీటు లాగా వుండేది. ఆ కాలములో తెనాలి తాలూకాలో మోటారు సైకిల్ వున్న వ్యక్తులు యిద్దరే. అందులో ఒకరు మా నాయన గారు. యుద్ధ సమయమున పెట్రోలు కొరత వుండుట వలన కిరోసిన్ తో నడిపే వారు. కార్బొరేటర్ లో కొంత పెట్రాల్ పోసి ట్యాంక్నుండి కార్బొరేటర్ వచ్చు గొట్టము మూసి వేసి బండిని నెట్టి స్టార్టు చేసే వారు. తరువాత బ్రేక్వేసి ట్యాంక్నుండి కిరోసిన్ వదిలేవారు. అట్లు రెండు మూడు నిముషాలైన తర్వాత బండిపై బయలు దేరే వారు. ఎక్కడైన ఆగి మళ్లీ బయలు దేరాలంటే పెట్రోలు కావాలి కదా. అందుకు ఒక చిన్న డబ్బాలో పెట్రోలు తీసుకుని బండికి క్లాంపుతో బిగించేవారు. ఈ విధముగా ఆయన తెనాలి, పెనుగుదురుపాడు మిగిలిన గ్రామములకు వెళ్ళ వలసి వచ్చినప్పుడు ఆ మోటర్ సైకిల్ పై వెళ్ళేవారు. ఆ మోటర్ సైకిల్ని చూడటానికి, దానిని నెట్టడానికి గ్రామస్తులు ఉత్సాహముతో వచ్చేవారు.  ఆ గ్రామములలో అది ఒక వింత. ఆ మోటర్ సైకిల్కి షాక్ఎబ్జార్బర్లు లేవు. బాగా కుదుపులుండేవి.  ఎక్కడైనా నీళ్ళలో దిగి బెల్టు తడిసిందంటే  బండి ఆగిపోయేది. అంతే కాక బెల్టులు దొరికేవి కావు. అందుకని మా నాయన గారు సైకిల్ చెయిన్ బెల్టుని తయారు చేయించి దానిపై గోగు తాడుతో బెల్టు లాగా అల్లించేవారు. దానిపై రెసిన్ని  మర్దించి మోటర్ సైకిల్ కి అమర్చి వాడే వారు. అటు వంటివి ఒకటి రెండు బెల్టులు, ఒక డబ్బాలో రెసిన్ ఎప్పుడూ వెంట వుంచుకునే వారు.  ఆ మోటర్ సైకిల్ మా నాయన గారి వద్ద నున్న కాలంలో దారిలో ఎక్కడా యిబ్బంది పెట్టిన గుర్తు లేదు. అప్పుడప్పుడు నన్ను గూడా ఆ మోటారు సైకిల్ పై తెనాలి తీసుకు వెళ్లేవారు. అప్పుడు వెనక వున్న

కారియర్ పై రెండు దిళ్ళు కట్టిదాని మీద నన్ను కూర్చుండ బెట్టి తీసుకును వెళ్ళే వారు. తర్వాత ఆ మోటర్ సైకిల్ పై మోజు చూపించి, దానిని కొనవలెనని కుతూహలంతో పోచిరాజు మంగపతి బాబాయి (మంత్రయ్య తాతగారి అన్న కామేశ్వరరావు గారి పెద్ద కుమారుడు) అడిగితే ఆయనకు అమ్మి వేశారు.

కాని మంగపతి బాబాయికి దాన్ని పరిచర్యలు పూర్తిగా అవగాహన కాక పోవడంతో, కొన్నిరోజులలోనే దానినిమూల పెట్టడం జరిగింది. నారాయణ బాబాయి, పిన్ని, నాయుడు గారు, ఆయన భార్య ( పెద్దమ్మ అనే వాడిని) లక్ష్మయ్య అందరూ నన్ను చూసి సంతోషించి నేను తిరిగి వెళ్లే వరకు నాతో వుండటానికి ప్రయత్నించేవారు. మా నాయన గారు తమ పనికై వెళ్ళి నపుడు నేను వీళ్ళతో వుండేవాడిని.

ఈ సమయంలో మా పిన తండ్రి గారు, నాయనమ్మ, మా పిన్ని అందరూ మా గ్రామంలోనే వున్నారు. మా నాయన గారు గ్రామములో లేని సమయమున నేను మా చెల్లెలు సుందరి వారింటికి వేళ్ళేవాళ్లం. మేము వాళ్ళింటికి వెళ్ళిన సంగతి మా నాయన గారికి తెలిసిన దెబ్బలు బాగా తగిలేవి, ఒక్కొక్కప్పుడు రూళ్ళకఱ్ఱ తో తగిలేవి. అందువల్ల మోటర్ సైకిల్ చప్పుడు వినబడగానే మా చెల్లెల్ని తీసుకుని తొందరగా రావటానికి ప్రయత్నం చేసే వాడిని. కానీ అన్ని సమయాల్లోనూ యింటికి చేరుకో లేక పోయే వాణ్ణి. దానితో దెబ్బలు తగులు తుండేవి. ఒక రోజు కలిదిండి జాలంరాజు మామ వుండగా మా నాయన గారు నన్ను కోప్పడుతూ, రూళ్ళకఱ్ఱ తీశారు. జాలంరాజు మామ భయపడి అడ్డుపడగా ఆ దెబ్బ ఆయనకు తగిలి పెద్ద వాత తేలింది. కఱ్ఱ విరిగి పోయింది.

జాలంరాజు మామ ఆ దెబ్బ వాతచూచి ‘ పిల్లవాడికి ఈ దెబ్బ ఎంత ప్రమాదమో చూచారా’ అని మా నాయన గార్ని అడిగారు. కోపము తగ్గి మరేమీ మాటాడలేదు. మా పిన తండ్రి గారింటికి వెళ్ళిన విషయం తెలియజేయటానికి సరిపల్లె సుబ్బరాజు గారు బహు శ్రమ తీసుకుని మా నాయన గారికి చెప్పేవారు. ఆయన నన్ను కొట్టే దెబ్బలు, నేను నాయనమ్మ దగ్గరకు వెళ్ళినందుకు కాదేమో!. వెళ్ళుట చూసిన సుబ్బరాజు గారు మా నాయన గారితో చెప్పి ఆయనకు కోపం తెప్పించి నందుకు, వాళ్ళ బదులుగా నన్ను కొట్టారేమో! ఆయన గ్రామంలో వున్నంత కాలం నేను ఆయన పక్కనే కూర్చుండి వుండే వాడిని. ఆయన కరిణీకపు పని ఆసామీలతో మాట్లాడి నప్పుడు నన్ను పక్కనే వుండనిచ్చే వారు.

ఒకసారి మా సుందరిని దంతలూరి చిన వేంకట్రాజు (సంగీతం వేంకట్రాజు అనేవారు అనుకుంటాను) వారింటికి తీసుకు వెళ్ళారు. అక్కడ తనకు ఏదో పిండివంట పెట్టారు. తర్వాత ఆ విషయం మా నాయన గారికి తెలిసి, వెంటనే రాగి కాడను వేడి చేసి, సుందరి నాలుకమీద అంటించారు. ఆ కాడ మరీ వేడిగా వుండుంటే నాలుక కాలి పుండయ్యేది. అది చూచిన వారు అప్పడి నుండి మాకు తగిలే శిక్షను ఊహించి, మాకు ఏమీ తినుటకు యివ్వడం గాని, బలవంతం చేయడం గాని చేసేవారు కారు. ఏదైనా పండుగాని, తాటి ముంజెలు గాని, తేగలు గాని యిచ్చేవారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో మా నాయన గారికి ఎక్కువ పని వుండేది. గ్రామ మున్సిఫ్ తో కలిసి భూమి పన్ను వసూలు చేసి, తెనాలి సబ్ ట్రెజరీలో జమ చేయాలి. అప్పుడు మున్సిఫ్ గట్టినేని

గోపయ్య చౌదరి గారు. మా నాయన గారు ఆయనను తాతా అని పిలిచే వారు. ఆయన మా నాయన గారిని మనవడా అనేవారు.

ప్రతి యిర్నాలు రోజుకు క్రితం రాత్రి ఆయన మా యింటికి వచ్చి రూపాయలు, అర్ధలు, పావలాలు,బేడలు, అణాలు, కానీలు, పైసలు విడివిడిగా కుప్పలు పెట్టి వాటిని లెక్కించి వ్రాసుకుని వేరువేరుగా మూటలు కట్టేవారు. తర్వాత వాటన్నింటిని ఒక ప్రత్యేక మైన సంచిలో వుంచి, పైన సంతకాలు చేసేవాళ్ళు.

ఆ కాలములో నోట్లు చాలా తక్కువగా వుండేవి. ఆ సంచీని మున్సిఫ్ గారు వాళ్ళింట్లో భద్ర పరిచి మరుసటి రోజు మొహతాదు తో సబ్ ట్రెజరీకి పంపేవారు. అప్పుడప్పుడు నేను కూడా ఆ డబ్బును వేరు వేరు గా చేయటానికి ఉత్సాహ పడేవాణ్ణి, కాని ధైర్యము చాలేదు కాదు. నేను చూస్తూ వుండేవాడిని.

గట్టినేని గోపయ్యగారు చనిపోగా వారి దాయాదులేన గట్టినేని కోటయ్య గారి కుమారుడు, రామయ్యగారు మున్సిఫ్ పదవి తీసుకున్నారు. వారే మా యింటిని కొనుక్కున్నారు. రామయ్యగారు పదవి స్వీక రించగానే తమ నాయకత్వాన్ని స్థాపించ వలెనని ఉత్సాహముతో వుండిరి. గ్రామములో పోలీసు అధికారము లన్నియు మున్సిఫ్‌కే వుండేవి. యివన్నీ తెలుసుకుని కరణం నాయకత్వమును తీసివేసి, తన నాయకత్వం స్థాపించాలని అనుకున్నారు. కొన్ని రోజుల తర్వాత ఆయన మాదిగ పల్లెకు వెళ్ళి ఏదో నెపంతో కొంత మంది మాదిగలను కొట్టించారు. అందు బేబి అనే ఒకడికి చెవినించి రక్తం కూడా వచ్చింది. వారందరూ మా నాయన గారికి ఈ విషయం చెప్పారు. చుండూరు వెళ్ళి పోలీసు

స్టేషన్‌లో రిపోర్టు చేద్దామనుకున్నారు. అప్పుడు మా నాయన గారు వారితో రామయ్య చిన్న వాడు. తెలియక తొందర పడెను. మీరు తొందర పడ కూడదు. మీరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మీకే నష్టం. మీకు సాక్ష్యం ఎవరూ యివ్వరు. తర్వాత మీరు గ్రామంలో వుండటం కష్టమౌతుంది' అని చెప్పారు. దెబ్బలు తగిలిన వాళ్లకి వైద్యం చేయించారు. మాదిగలందరూ పోలీసు స్టేషన్‌లో రిపోర్టు యిస్తే ఏం చెయ్యాలా అని రామయ్య గారు అలోచించ సాగారు. కానీ మాదిగలు మెదలకుండటం వారికి ఆశ్చర్యం కలిగించింది. అలా కొన్ని నెలలైన తర్వాత భూమి పన్ను వసూలు చేసే సమయం వచ్చింది. గ్రామ కరణం పన్ను వివరములు, చెల్లించ వలసిన వాని పేరు మొదలైన వివరాల లెక్క తయారు చేసి మున్సిఫ్‌కు పన్ను వసూలులో సాయం చేయు చుండిరి. ఇప్పటి పరిస్థితులలో తన కర్తవ్యమైన లెక్కలు సిద్ధము చేసి వాటిని మున్సిఫ్‌కు పంపించారు. పదవీ న్యాయము వల్ల మున్సిఫ్ పన్ను వసూలు చేసి సబ్ ట్రెజరీకి యిర్సాలు చేసి కరణమునకు వివరములు తెలియజేయాలి. రామయ్య గారు చినగాదెలవర్రులో చాలా కొంచెం పన్ను వసూలు చేయగలిగారు. కాని పెద గాదెలవర్రులో ఏమీ వసూలు కాలేదు. జనవరి, ఫిబ్రవరి గడిచిపోయాయి. మార్చి నెలలో రెవెన్యూ అంతా ట్రెజరీకి చేరాలి. అప్పుడు రామయ్య గారికి భయం వేసింది. ప్రతి సంవత్సరం కరణం, మున్సిఫ్‌లు కలిసి పన్ను వసూలు చేయడం వల్ల మార్చి నెల వరకు మొత్తం పన్ను యిర్సాలు చేయు చుండిరి. ఆ సంవత్సరము పన్ను అంతా బాకీ గానే వుంది.

అది ఆయన పదవికి వచ్చిన మొదటి సంవత్సరం. వెంటనే ఆయన

మా నాయన గారి దగ్గరకు వచ్చి, పన్ను వసూలుకు సాయం చేయమని అడిగారు. మా నాయన గారు 'నువ్వు గ్రామాధి కారివి. నీకు పోలీసు అధికారములు కూడా వున్నాయ్. నీ ధర్మాన్ని నువ్వు నెరవేర్చు. నా ధర్మం నేను నెరవేరుస్తాను. నీకు పన్ను వసూలులో సాయం చెయ్యడం నా పదవీ ధర్మం కాదు' అనిరి. రామయ్య గారు వెంటనే లేచి మా నాయనగారి చెయ్యి పట్టుకుని, 'నేను మీ తమ్ముడిని. నా వల్ల తప్పైంది. నన్ను క్షమించండి. యిప్పటి నుండి మీరు చెప్పినట్లే నడుచు కుంటాను. నేను మీ మాటకు ఎదురరాడ'నని చెప్పారు. అప్పుడు మా నాయన గారు రైతులను పిలిపించి ఆ నెలలో దాదాపు పన్నంతా వసూలు చేయించిరి. అప్పటినుండి రామయ్యగారు మా నాయన గారిని అన్నగారు లాగానే భావించి ప్రవర్తించే వారు. మా నాయన గారు క్రీ.శ. 1965 లో స్వచ్ఛందంగా పదవి విరమణ చేసే వరకూ ఈ సంబంధం వుండటమే కాక, తర్వాత కూడా ఆయన గౌరవం, ప్రేమ, అభిమానములు చూపించారు. స్వచ్ఛంద పదవీ విరమణ సమయంలో ఆయన నిర్ణయం మార్చుటకు రామయ్యగారు శతవిధాలుగా ప్రయత్నం చేశారు. అప్పుడు మా నాయన గారు 'రామయ్యా ఈ గ్రామములో నీతో సమానముగా ఆస్థి పరులమై గౌరవముతో వున్నాము. ఇప్పుడు మాకు ఆస్థి లేదు. పిల్లలందరూ హైదరాబాదులో వున్నారు. ఇంక యిక్కడ నేనుండలేను' అని చెప్పారు. అయితే నాకు లోపాయకారీ లెక్కలు వ్రాసివ్వమని అడిగారు. లోపాయకారీ లెక్కలనగా ఒక సర్వే నెంబరులో ఎవరికెంతెంత భూమి వుందో, వారెంత పన్ను చెల్లించాలో తెలియజేసే లెక్క. అది వ్రాయాలంటే ప్రతి సంవత్సరం జరిగే క్రయ విక్రయాలు, ఆస్తి పంపకాలు

దృష్టిలో వుంచుకుని చేయవలసిన లెక్క. ఆ లెక్కలు కరణము తన తర్వాత వచ్చే తన కుమారునికి చెప్పే లెక్క. రామయ్య గారు అడిగిన వెంటనే ఆ లెక్క తయారు చేసి ఆయన కిచ్చారు. ఆయన స్వఛ్ఛందంగా పదవీ విరమణ చేస్తున్నారని తెలిసి, పెద గాదెలవర్రు రైతులు వచ్చి, మేము రెండు ఎకరాల భూ వసతి, యిల్లు ఏర్పాటు చేస్తాము, మీరు వెళ్ళవద్దని బలవంతం చేశారు. మా నాయన గారు మా వంశం ఈ వూళ్ళోను, చుట్టు పక్కల గ్రామాల్లోను దానములే చేశారు. నేను దానము ఎలా తీసుకుంటాను. మా పెద్దలను కించ పరచలేను, అని వారిని సమాధాన పరచి, తన పదవి త్యాగం చేశారు. అలాటి త్యాగం కూడా భగవంతుడిచ్చిన వరమే. లేకున్న ఎన్.టి. రామారావు వరము వల్ల అందరు గ్రామాధికారులతో బాటు తమ పదవి కూడా పోయి వుండేది. ఒక మనిషి వరముతో పదవి పోవుట కన్న, భగవంతుని వరముతో పదవి త్యాగం చెయ్యడం మంచిది గదా !

క్రీ.శ. 1942 లో దేశము అల్లకల్లోలముగా వున్నది. ఒక వంక యుద్ధము, వేరొకవంక రాజకీయోద్యమము తీవ్ర తర మగు చుండెను. ఆ సమయములో జమాబంది వచ్చెను. ప్రతి జమాబందికి మా నాయన గారు తెనాలిలో 10 రోజులు బస చేసే వారు. జమాబంది అనగా, ప్రతి గ్రామము యొక్క రెవెన్యూ పన్ను ఎంత వసూలైనది., మొత్తము ఎందుకు వసూలు కాలేదు, గ్రామ విషయములలో ప్రభుత్వము చేయవలసిన పనులు సమీక్షించే ఒక సభ.

ఆ సంవత్సరం యధావిధిగా జమాబందీకై మా నాయన గారు తెనాలి వెళ్ళారు. ఆ సమయంలో యింట్లో మా అమ్మగారు, నేను, మా

చెల్లెలు సుందరి, తమ్ముడు నారాయణ వున్నాము. తలుపు చప్పుడైతే తలుపు తీశాము. ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు లోపలికి వచ్చి, మా యిల్లు సోదా చేయాలన్నారు. మా అమ్మగారు ఆయనతో 'నేను నా పిల్లలున్నాము. మా వారు జమాబందికై తెనాలి వెళ్లారు. వారు వచ్చిన తర్వాత మీరు యిల్లు సోదా చేసుకోండి' అని చెప్పారు. అందుకాయన 'రాజకీయ కుతంత్రము జరుగుతున్నదని, అందుకు మా యిల్లు కేంద్రమని, యిక్కడ దానికి సంబంధించిన పత్రాలు, పుస్తకాలు వున్నాయని మాకు సమాచారం అందింది, ఆలస్యము చేయటానికి వీలు లే'దని చెప్పారు. వెంటనే మా అమ్మగారు నాతో మా నాయనమ్మ గారిని తీసుకు రమ్మనిరి. నేను వెంటనే మా పిన తండ్రిగారింటికి వెళ్లి, మా నాయనమ్మగారిని తీసుకు వచ్చాను. అప్పుడు ఆ ఇన్‌స్పెక్టరు యిల్లు సోదా చేసి, పుస్తకాలు, మా నాయనగారి కాగితాలు, పరిశీలించి, చివరికి హిట్లర్ ఆత్మ కథ, 'మెయిన్ కాంఫ్' అనే పుస్తకాన్ని తీసుకుని వెళ్లి పోయారు. ఆ సాయంత్రం తెనాలి నుండి వచ్చిన మోహతాదుతో ఈ విషయం మా నాయన గారికి తెసియజేశారు మా అమ్మగారు. మరిసటి రోజు మా నాయన గారు కలెక్టరు గారిని జమాబందిలో కలిసి, ఈ విషయం అడిగితే, ఆయన పోలీసు అధికారిని పిలిపించి ఈ విషయం ప్రస్థావించారు. ఆందుకు ఆ పోలీసు అధికారి 'మా కొక పితూరీ ఉత్తరం వచ్చింది, అందువల్ల మేము వీరి యిల్లు సోదా చేశాము, ఈ పుస్తకం దొరికింది' అని చెప్పి ఆ పుస్తకాన్ని యిచ్చారు. అప్పుడు మా నాన్నగారు 'ఇది బ్రిటిష్ రెడ్‌క్రాస్ వారు ప్రచురించి ప్రభుత్వ ఆమోదముతో విక్రయించిన పుస్తకము. మీరు వివరంగా చూడండి.. అయినా నేను

జమాబందిలో తెనాలిలో నే వున్నా నాకు మాట మాత్రం చెప్పకుండా, గ్రామములో మాయింటిని సోదాచేయాలని నా భార్యాబిడ్డలను భయపెట్టడం మీకు న్యాయంగావుందా 'అని అడిగారు. వెంటనే కలెక్టరు 'మీరు మనిషిని పంపే ముందు నాకు విషయం చెప్పలేదు. ఈ పుస్తకంతో ఏం సాధిద్దా మనుకున్నారు' అని ఇన్‌స్పెక్టరును నిలదీయగా, అయన 'క్షమించండి. తప్పైందని' ఆ పుస్తకాన్ని మా నాన్న గారికి తిరిగి యిచ్చి వేశారు. తర్వాత విచారించగా, మా గ్రామములోనే ఒక పెద్ద మనిషి అయినంపూడి వేంకట్రామయ్యగారు ఆ వినతి పంపారని తెలిసింది. మానాయన గారిని ఎట్లాగయినా అవమాన పరచాలని ఆయన వుద్దేశ్యం. విచిత్ర మేమిటంటే, స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత, ఈ పెద్ద మనిషే కాంగ్రెస్ పార్టీ పక్షాన ఓట్ల ప్రచారానికి బయలు దేరారు. ఈ విచిత్రమును చూచి, అప్పటి వరకూ చేనేత బట్టలు మాత్రమే ఉపయోగించే మా నాయన గారు వాటిని వాడటం మానివేశారు.

మానాయన గారు గ్రామములోనున్న సమయంలో క్రీ.శ. 1942 లోనే నేను మా పినతండ్రి గారింటికి వెళ్ళాను. అక్కడకు మా పెద తాతమ్మ సుబ్బమ్మ గారు వచ్చివున్నారు. ఈమె మండూరు వాస్తవ్యులు, బలభద్రపాత్రుని శేషయ్యగారి భార్య. అప్పటికే శేషయ్యగారు మరణించారు.

అయినాగూడా అమ్మవారి గణాచారిగానే వున్నది. ఆమె వంటిపై అమ్మవారు పూనడం మానలేదు. ఆ రోజున ఆమెకు పూనకం వచ్చింది. కళ్ళు బాగా తెరిచి వూగుతూ వున్నారు. 'దాహం దాహం' అంటున్నారు. వెంటనే పానకం తయారుచేసి యిచ్చారు. 'నాకు పానకం వద్దు, పసుపు

నీళ్ళిమ్మని' అడిగారు. పసుపునీళ్ళు త్రాగిన తరువాత గూడా ఆమె వూగడం ఆగలేదు. నాకు భయం వేసింది. ఇంతలో మా పిన తండ్రిగారు ఆమెతో వాగ్వాదము ప్రారంభించారు. 'నువ్వు మా ఆస్థి పరువు నాశనమవుతుంటే చూస్తూ కూర్చున్నావు. మా తండ్రిగారు అకాల మరణం పొందితే నువ్వు ఏమీ చెయ్యలేదు' అని అన్నారు. 'ఇప్పుడు మా యింటికి ఎందుకు వచ్చావు, నీకు పూజ లెందుకు చేయాలి' అని వివాదం మొదలు పెట్టారు. అందుకు అమె 'ఈ విషయం నీకు ఎలా చెప్పాలో నాకు అర్థం కావటల్లేదు. నీవు తెలుకో లేవు' అని అనెను. ఆ సమయంలో మా నాయనమ్మగారు నన్ను పట్టుకుని ఆమె ముందుంచి నా నాలిక పై బీజాక్షరాలు వ్రాయమని ప్రార్థించింది. నేను భయముతో కుంచించుకు పోయాను. ఇంతలో ఆమె మామూలు మనిషయ్యింది. మా నాయనమ్మగారు నా నాలుకపై బీజాక్షరములు వ్రాయలేదని చాలా బాధ పడెడివారు. మనము చేసే ప్రతి కార్యమునకు ఫలితము మనమే అనుభవించ వలెను కదా! ప్రతిదానికీ భగవంతుని నిందించుట ఎందుకో తెలీదు. అన్ని విషయములు భగవంతుని యిష్ట ప్రకారం జరుగునని నమ్మిన యివి కూడా ఆ భగవంతుని లీలలే. లేక మన పురుషకారం మీద ఆధారపడితే ఫలితాలకు వగవ కూడదు కదా. జనన మరణాలు మన ఆధీనంలో లేవు. వాటి వల్ల ఎవరికి మంచి జరుగుతుందో, ఎవరికి చెరుపు జరుగుతుందో ఎలా విశ్లేషణము చేయగలము. ఈ విషయమును విశద పరిచేందుకే టాల్‌స్టాయ్‌ది ఒక చక్కని కథ వున్నది.

క్రీ.శ. 1942 ఆగస్టులో క్విట్‌యిండియా ఉద్యమం మొదలైంది. తెనాలి రైల్వే స్టేషన్ తగల పెట్టారు. గూడ్స్ యార్డ్ లూటీ చేశారు.

జనము పరుగులతో తెనాలి వెళ్ళి ఎవరికందినవి వారు ఎత్తుకెళ్ళి పోయారు. పోలీసులు కాల్పులు జరిపారు. ఉద్యమముతో సంబంధము లేని ఒక వ్యక్తి చనిపోయారు. మా గ్రామములో మాయింటి ప్రక్కగా కలిదిండి జోగిరాజుగారు వుండేవారు. ఆయన గాంధేయవాది. నూలు వడికే వారు. ఆయనను పోలీసులు తీసుకు వెళ్ళి మర్రోజు విడుదల చేశారు. ఉద్యమమును ధ్వంసము చేయు మిషతో, ప్రభుత్వముతో చేతులు కలిపిన కమ్యూనిస్టులు ఈ పని చేయించారని అనుకొనేవారు.

మా నాయనగారికి భూమిపై చాలా మక్కువను కుంటాను. ఆస్థిని సంపాదించటానికి పలు విధములుగా ఆలోచించే వారు. ఆ ఆలోచనలో భాగమే ఆయన నైజాం యాత్ర. ఎఱ్ఱుబాలెం లోని జమలాపురం వారు మాకు బంధువులు. ఆ బంధుత్వము పురస్కరించుకుని మా నాయనగారు కలిదిండి రామచంద్రరాజు, కలిదిండి జాలంరాజు, ఇంకొక యిద్దరిని తీసుకుని ఎఱ్ఱుబాలెం వేళ్ళారు. అక్కడ బంధువులు వారిని ఆదరించి, మీరు భూమిని చూసుకోండి, అది నచ్చితే తక్కిన విషయాలు మాట్లాడుకుందాం అని అన్నారట. వీరందరు ఉదయాన్నే లేచి ఆప్రదేశమంతా తిరిగి చూచి వచ్చారట. చాలా ప్రయాస కలిగిన తిరుగుడు. మా నాయనగారికి ఉదయమునే కాఫీ అలవాటు.

అందువల్ల అక్కడకు దగ్గరగా వున్న ఒక దుకాణం దగ్గర బెల్లం, టీ పొడి , కొన్ని పాలు కొని అక్కడ టీ కాచుకుని, అందరూ త్రాగిన తర్వాత మళ్ళీ భూమి చూచారట. ఆరు వందల ఎకరములు. ఇంటికి తిరిగి వచ్చే టప్పటికి మధ్యాహ్నం అయిందట. మా నాన్నగారికి తీసుకోవాలని సంకల్పం కలిగింది. కారణము మా గ్రామమలో ఒక ఎకరం విక్రయించిన

అక్కడ మూడొందల ఎకరములు కొన వచ్చును. పొగాకు, మిర్చి వేయుటకు పనికి వచ్చే భూములు. వరి వేయటానికి సరిపోయే నీరు లేదు. కాని మా నాయన గారితో వెళ్ళిన వారు, ఆయన వెంట తరలి వెళ్ళటానికి యిష్టపడలేదు. అందువలన అందరూ తిరిగి వచ్చారు. మరొకసారి మా పినతండ్రి వేంకటాచలపతిరావు గారు ఖమ్మంమెట్టులో వున్నప్పుడు మా నాయన గారు అక్కడికి వెళ్లారు. అక్కడకూడా తిరిగి వైరా అనకట్ట వద్ద భూమి బేరం చేసి అనిశ్చితులై తిరిగి వచ్చారు.

క్రీ.శ. 1943లో మా నాయన గారు 16 సెంట్ల నివేశ స్థలాన్ని కొని దాన్లో గృహనిర్మాణము చేసి గృహప్రవేశం చేశారు. తర్వాత అక్కడ రుద్రాభిషేకం చేయించారు. తెనాలి నుండి శివలింగం పూలను ప్రత్యేకంగా తెప్పించారు. స్వంత యింటికి వచ్చిన కొన్ని నెలల తర్వాత మా నాయన గారికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. వైద్యులు ఆలపాటి వాస్తవ్యులు, మా గ్రామములోని మల్లేశ్వరస్వామి గుడి పూజారులు మామిళ్ళ పల్లి కుటుంబరావుగారు. ఆయన మా నాయన గారికి బాల్యస్నేహితులు. దాదాపు నెలరోజులు మా నాయన గారు ఈ టైఫాయిడ్ తో బాధ పడ్డారు. ఆ సమయంలో ఎప్పుడూ తెనాలి నుండి బయటకు వెళ్లని అడపా నరసింహారావు నాయుడు గారు వచ్చారు. అలాగే ఎప్పుడూ పెనుగుదురుపాటి నుంచి వెళ్లని మా అమ్మగారి మేనమామ పోచిరాజు మంత్రయ్య తాతగారు వచ్చారు. మా నాయనమ్మ గారు సికింద్రాబాదు నుండి వెంటనే వచ్చిరి. ఆమె మా నాయన గారిని కౌగలించుకుని భోరున ఏడ్చారు. జ్వరము తగ్గిన తర్వాత ఆమె పథ్యము పెట్టింది. నోటికి హితవు లేక పోవుట వలన ములగ కాడ

చారు, కారపు పొడి, బీరకాయ పొట్లకాయతో కూర, శీకాకాయ లేత చిగురుల పచ్చడితో పథ్యం పెట్టారు. తర్వాత 15 రోజులకు మా నాయన గారికి స్వస్థత కలిగింది.

మా నాయన గారికి జ్వరము వచ్చుచున్న దని తెలిసి మా పెద తాతమ్మ సుబ్బమ్మగారు వచ్చారు. ఆమె మా నాయన గారి మంచము ప్రక్కనే పక్క వేసుకుని పడుకునేది. ఒకరోజు అర్ధరాత్రి లేచి వడివడిగా గ్రామ స్మశానం వరకూ వెళ్ళారు. కొంత సేపటికి ఏదో గొణుగుతూ వచ్చి స్నానం చేశారు. త్రవాత ఒక కాగితం కలం అడిగి తీసుకుని దానిపై ఏదో వ్రాసి, కాగితం మడిచి, మా నాయన గారి తల క్రింద పెట్టారు. ఆయనకు స్వస్థత చిక్కిన తర్వాతనే ఆ కాగితం తీయవచ్చని చెప్పింది. రాత్రి క్షుద్ర శక్తులు వచ్చాయని, వాటిని పారద్రోలుటకు వెళ్లాననీ ఆమె చెప్పారు. తర్వాత, మామూలు మనిషి అయిన తర్వాత ఆమె చేసిందేదీ జ్ఞాపకం లేనిదానివలే ప్రవర్తించారు.

ఆమెకు చదవడం, వ్రాయడం రాదు. ఆమెకు రూపాయికి, అణాకి, కానీకి భేదం తెలియదు. ఏ వస్తువు క్రయం చేసినా ఎవరో ఒకరు దాని విలువ తెలుసుకుని, డబ్బులు యివ్వాలే గాని తనంతట తాను డబ్బు చెల్లించగలిగేది కాదు. అటువంటి అమాయకురాలు కాగితం కలం అడిగి తీసుకుని దాని పై ఏదో వ్రాసి మా నాయన గారి తల క్రింద వుంచడం ఆశ్చర్యం. తర్వాత ఆమెను అడిగితే తనకేమీ తెలీదని చెప్పారు. అర్ధ రాత్రి బయటకు వెళ్ళినది కూడా తెలీదని చెప్పారు. ఆ కాగితంలో ఏ మున్నదో నని అడిగితే ఒక యంత్రము, కొన్ని బీజాక్షరాలున్నాయని మా నాయన గారు చెప్పారు.

ఆమెని గురించి మరియొక ఉదంతము శ్రుతము. ఒకసారి ఆమెను అమ్మవారు ఆవహించగా మా తాతగారిని వెంటనే ఆ అమ్మవారికి సహస్రం చేయరా అన్నదట. మా తాతగారు శ్రీలలిత సహస్రనామ స్తోత్రం పుస్తకాని కోసం వెతుకుతూ వుంటే, 'ఏమిటిరా వెతుకు తున్నావు, సహస్రనామం నేను చెప్తాను రా' అని దగ్గర కూర్చొని సహస్రనామం చెబుతూ పూజ చేయించారట. ఆ విషయం బహు వింతగా తోచేది. మామూలుగా ఆమెకు ఏ స్తోత్రం రాదు. అదే మా తాతమ్మగారికి మంత్రపుష్పం శ్రీ లలితా సహస్రనామం, విఘ్నేశ్వర పూజ నోటికి వచ్చేవట. మా నాయనమ్మగారు కూడా విఘ్నేశ్వరపూజ పుస్తకం లేకుండానే చదివి మాతో పూజ చేయించేవారు. సుబ్బమ్మ తాతమ్మగారి గురించి యింకొక విషయం కూడా మా బామ్మగారు చెప్పేవారు. మా తాతగారు మరణించే ముందు సుబ్బమ్మ తాతమ్మగారు వున్నప్పుడు శ్రీ లలితను పూజ చేయగా, గణాచారి యైన సుబ్బమ్మగారు పెద్దగా రోదించుచూ, యినుముకు చెదలు పట్టినవి, యిపుడు నేనేమి చేయలేనని అన్నారట. తర్వాత ఈ విషయం గురించి విశ్లేషణ చేయగా, మా తాత గారు బ్రతుకుట అసంభవమని సంకేతంగా తెలియ జేసిందని నా ఊహ.

క్రీ.శ. 1944 సంవత్సరంలో నాకు టైపాయిడ్ జ్వరం వచ్చి రెండు సార్లు తిరగ బెట్టింది. మొత్తము 63 రోజులు మంచం మీద పడివున్నానట. వైద్యము కుటుంబరావుగారి అన్నగారు గురవయ్యగారు చేశారు. గురవయ్యగారు అసాధారణ వైద్యులని, ఆయన మామూలుగా వైద్యం చేయరని కుటుంబరావుగారు చెప్పేవారు. ఆ సమయంలో కుటుంబరావుగారు ఆలపాడు గ్రామం నుంచి మా గ్రామానికి వచ్చేవారు.

నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చిన సంగతి తెలిసి నన్ను చూడటానికి వచ్చే బంధువులకు మా నాయనమ్మ గారు భోజన వసతులు చేసేవారట. ఆమెకు ఆ భోజనం వ్యవస్థ తర్వాత నా దగ్గర వుండటం రోజుకు 24 గంటల పని అయ్యేదట. మా నాయన గారు ఆ అవస్థలో నన్ను చూడలేక నా మంచం దగ్గరికి రావడమే మాను కున్నారట. ఇంటికి వచ్చిన బంధువులంతా తెనాలి తీసుకు వెళ్లి వైద్యం చేయించమనే వారట. వైద్యులు గురవయ్యగారు తగ్గుతుందని చెప్పే వారట. కుటుంబరావుగారు మా నాయన గారితో మీకు తెనాలి తీసుకు వెళ్లాలని వుంటే, తీసుకు వెళ్లండి. నేను కూడా తోడు వస్తాను అన్నారట. ఈ సమయంలో మా పెదతాతమ్మ సుబ్బమ్మగారు నన్ను చూడటానికి మండూరు నుంటి వచ్చారట.

ఆరోజు యింకా 10 మంది బంధువులు వున్నారట. వాళ్లందరూ భోజనము చేయుటకు కూర్చున్నారట. మా తాతమ్మగారు కూడా ఆ పంక్తిలో వున్నారట. వడ్డన జరిగే సమయంలో ఒక్కసారిగా అమె వూగడం మొదలు పెట్టిందట. అందరూ అమ్మవారు వచ్చిందని అనుకోటం మొదలు పెట్టారట. ఆమె పెద్దగా త్రేన్పుతూ, ఆవలించుతూ 'నేనిప్పుడు త్రిపురాంతకం నుండి వస్తున్నాను. ఒక భక్తుడు దున్న పోతును బలి యిచ్చాడు. భుక్తాయాసంగా వుంది' అని అన్నారట. మరి కొంత సేపటికి ఆమె తల నుండి ధారాపాతంగా నీళ్ళు కారాయట. 'యిప్పుడు నేను గంగలో స్నానం చేశాను, దోసిలి పట్టు, విశ్వనాధస్వామి విభూతి, అన్నపూర్ణ దేవాలయములోని కుంకుమ తీసుకో' అని ఒక దోసెడు విభూది, మరొక దోసెడు కుంకుమ పోసి, 'పిల్లవానికి విభూతి, కుంకుమ

పెట్టండని' చెప్పారట. ఆంజనేయస్వామి విగ్రహంవున్న రక్షరేకు యిచ్చి 'దీన్ని పిల్లవాడి మెడలో కట్టండి. భయమేమీ లేదు' అని చెప్పారట. నాకు మెడలో రక్షరేకు కట్టి, ప్రతి రోజూ ఆ కుంకుమ, విభుది పెట్టేవారు. 63 రోజుల తర్వాత నాకు పథ్యము పెట్టారు. ఆ జ్వరము వల్ల నాకు చెముడు వచ్చింది. నడక లేదు. మా నాయనమ్మ గారు రోజూ నన్ను పట్టుకుని నడక నేర్పడం, మెల్లగా మాట్లాడి నన్ను వినేటట్లు చేయటం చేసే వారు. ఒక నెలరోజులలో నీరసం తగ్గి, కొంచెం బలం వచ్చి, మళ్ళీ వినబడడం, నడవడం వచ్చాయి.

శ్రీ లలితని మా యింట్లో ఆడపడుచుగా భావించడం మా అదృష్టం. అప్పయ్య గారి యింట్లో ఆయన కుమార్తెలతో బాటు గాజులు వేయించుకున్న సంఘటన, శ్రీ లలిత తన కుమార్తె అని సంతోషించడం వలన నేమో, యిప్పటికీ ఆ భావన మేము ఎక్కడ వున్నా, మా అందరిలోనూ వుంది. మేము గ్రామములో వున్నప్పుడు, హైదరాబాదు వచ్చిన తర్వాత కూడా ఒక్కొక్కసారి మా యిల్లంతా సాంబ్రణీ సువాసనతో గుబాళిస్తుంది. ఇంట్లో సాంబ్రాణీ వేసిన గుర్తులేవీ వుండవు. అప్పుడు మా అమ్మగారు, నాన్నగారు అమ్మవారు వచ్చింది అనే వారు. మా యింటనున్న దైవ పీఠాన్ని కృష్ణానదిలో వదిలేశామని బాధ పడుతుంటే దేవి ఉపాసకులు 'ఇది దైవ నిర్ణయం, వగవ పనిలేదు. ఇప్పటి వరకు జరిగిన ఉపాసనా పద్ధతి జరగదని శ్రీ లలితకు తెలుసు. మీ యింట్లో ప్రతి శుక్రవారం అమ్మవారి సహస్రం కోడలి చేత చేయించండి' అని చెప్పడంలో ఒక విశేషం వుంది. వంశంలో కోడలు తల్లి అవుతుంది కదా. అమ్మవారు మా కూతురుగదా. అందువలన ఈ

పరంపర నిరంతరం నడుస్తుంది. మండూరులో శ్రీచక్ర ప్రతిష్ఠ చేసి, దాదాపు 115 సంవత్సరాలుగా కుటుంబములో శ్రీచక్రార్చన, నవరాత్రులలో కలశం పెట్టి పూజ చేయుట నిరాఘాటంగా జరిగింది. ఆ కాలములో నవ రాత్రుల సమయంలో కుంకుమ పూజ చేసేవారు. పూజ చేసిన మరుసటి దినము ఉదయం కుంకుమ రాశిపై చిన్ని చిన్ని అడుగులు కనిపించేవి. ఈ సంఘటన ఒక సంవత్సరమే కాక, ప్రతి సంవత్సరం కనిపించేది. ఈ మహిమ చూసి, ఒక వామాచారి తత్పరుడైన ఉపాసకుడు మండూరు వచ్చి, దేవీ ప్రసన్నం వామాచార పద్ధతిలో త్వరగా జరగుతుందని చెప్పగా ఆ సంవత్సరం అలాగే చేశారు.

దాని వలన ఆ సంవత్సరం దేవీ ప్రసన్నం కాకపోవడమే కాక కుటుంబంలో మనశ్శాంతి లోపించెనట. అప్పుడు మరల శ్రీచక్రమునకు సంప్రోక్షణము, పునఃప్రతిష్ఠా కార్యక్రమములు జరిపి, దక్షణాచార పరంగా యధావిధిగా పూజలు చేయడం మొదలెట్టారు. మండురులో మాణిక్యారావు తాతగారి మరణానంతరం శ్రీచక్రమును కృష్ణలో వదిలిరని వ్రాసితిని గదా.

కుంకుమ పూజానంతరం దేవి పాదముద్రలు కుంకుమపై కన్పించడం చిన గాదెలవర్రులో మా యింటిలో మేము చూశాము. తర్వాత వరంగల్ లో నరసింహారావు బాబాయి గారి యింట్లోను, మా తమ్ముకు తివిక్రమ శర్మ (చలపతిరావు బాబాయి పెద్ద కుమారుడు) యింట్లో అతని భార్య శ్రీమతి గీత పూజచేసిన తర్వాత కుంకుమ రాశిలో అమ్మ వారి పాద ముద్రలు చూశామని చెప్పారు. ఈ సంఘటనలు శ్రీచక్రమును కృష్ణానది లో వదిలిన తర్వాత జరిగినవి.

శ్రీలలిత పూజ అవిఘ్నంగా, ఈ వంశంలో వుంటుంది. బలభద్రపాత్రుని వారి యింటిలోని ప్రతి కోడలికి యిది అమ్మవారు యిచ్చిన వరం. ఆ వరాన్ని నిలుపుకోవడం ఈ యింటి ప్రతి కోడలి విధి. బయట వున్న సమయంలో శ్రీ లలిత పూజ కూడదు. శుద్ధియైన తర్వాత మరల చేయవచ్చును.

## ధనార్జనకై తహతహ

బహుశః క్రీ.శ. 1950 ప్రాంతములో మా నాయన గారు గ్రామములో వుంటూ, ధనార్జన గురించి ఆలోచించే వారు. ఆయనకు గతవైభవం, తమ తండ్రిగారి కాలంలో అను భవించిన జీవితం, ఆ హోదా మరపుకు రాక, మరల ఆ వైభవం పొందవలెనని తహతహ వుండెడిది. కరిణీకం చేయునప్పుడు ఆ గ్రామములో మొత్తము మీద క్రయ విక్రయ పత్రములు వ్రాసి, భూమిని సర్వేచేసి, విభాగపు పత్రములు వ్రాసి దాదాపు రూ. 5000 వరకు సంపాదించేవారు. ఆ రోజుల్లో ఆదిపెద్ద సంపాదన గానే పరిగణించేవారు. కాని, కుటుంబము పెద్దది కావడం, కర్చు మీద అదుపు లేక పోవడం, సంపాదన ప్రతి నెలా కాక వేసవికాలం లోనే వుండటం వలన అప్పు చేయవలసి వచ్చేది. అప్పులో వున్న విచిత్రం ఏమిటంటే, అప్పు తీర్చగలిగి కూడా తీర్చక పోతే అనతి కాలంలోనే అప్పు భార మౌతుంది. మా నాయన గారికి అదే జరిగేది. అందువల్ల ఎక్కువ సంపాదనకు మార్గాలు వెదికే వారు. దానిలో భాగంగా సహకార రంగంలో (co-operative) పాలు సేకరించి, వాటిని పాశ్చ్యరైజ్ చేసి, పట్టణానికి సరఫరా చేయాలనే పధకం తయారు చేశారు. ఆ పాలను పట్టణానికి

రవాణా చేయటానికి ఒక మోటారు బండి అవసరమని ఒక ఫియట్ కారు (టూరర్) కొన్నారు.

కాని పాశ్చరైజ్ చెయ్యాలంటే దానికి కావలసిన యంత్రములు సమకూర్చు కొనవలయును. దానికి పెట్టుబడి అవసరము. పెట్టుబడికి ధన సంపాదన మార్గము లేదు. అందువలన ఆ ప్రయత్నము విరమించడం జరిగింది. కాని ఆ గ్రామములో కారు కొన్న ఘనత మిగిలింది.

తర్వాత అయినంపూడి వేంకటరామయ్య గారు, అయినం పూడి రంగయ్యగారి కుమార్డు మల్లేశ్వరరావుతో కలిసి మొట్టమొదటి వడ్ల మర పెట్టిరి. దాని వలన అధిక ధన సంపాదన లేక పోయినా, కొంత వెసులు బాటు వుండేది. కాని, వేంకటరామయ్యగారికి, మల్లేశ్వరరావు గారికి కలిగిన విభేదాల వలన మా నాయన గారు ఆ మర నడుపుట నుండి విరమించుకుని, వేంకట్రామయ్యగారికి వది వేశారు. అందువలననే అయినంపూడి వేంకటరామయ్య గారిని మర వేంకట్రామయ్యగారు అనేవారు.

మా గ్రామములో గట్టినేని కోటయ్య గారు మొట్ట మొదటగా బి.ఏ.బి.ఎల్ చేశారు. ఆయనను ప్లీడరు కోటయ్య అనేవారు. ఆయను ఒక మోటార్ సైకిల్ కొని గ్రామానికి తీసుకు వచ్చారు. దానిని నడుపుటకు మా నాయన గారి సహాయము అర్ధించారు. మా నాయన గారు ఎంత ప్రయత్నించినను కోటయ్యగారు నడపలేక పోయారు. అందువలన రెండు మూడుసంవత్సరములు ఆ మోటారు సైకిల్ ని మా నాయనగారే నడిపే వారు. క్రీ.శ. 1956 సంవత్సరములో మా నాయన గారికి మడిచి పెట్టెలో పెట్ట గలిగే సైకిలును గురించి ఎవ్వరో చెప్పారు. ఆయన దానికోసం

గాలించి, చివరకు కొన గలిగారు. ఆ సైకిల్ వారు హైదరాబాదు వచ్చిన తర్వాత కూడా పిల్లలందరూ వాడు కున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంటిలో మేము నివసించే కాలంలో ఆ సైకిల్ ఒక వింతగా చూడబడి చుట్టుపక్కల పిల్లలకు దానిపై ఒక సారియైనా తిరిగి రావాలనే కోరిక వుండేదనడం అతిశయోక్తి గాదు.

మా నాయన గారిని గురించి వ్రాస్తుంటే ఒక పుస్తకం కాగలదు. ఆయన క్రీశ. 1928లో S.S.L.C లో ఉత్తీర్ణులైన ఆయనకు ఇంగ్లీషు సాహిత్యం పై మక్కువ. మా అన్న దమ్ములలో ఈ చదివే అలవాటు ఆయన వద్ద నుండే వచ్చినదని నా ఊహ. నేను హైస్కూలులో చదివే రోజులలో ఆయన నన్ను అలెగ్జాండర్ డ్యూమా నవలలను పైకి చదవమని వినేవారు. పల్లెటూరులో ఆ కాలములో ఇంగ్లీషు పత్రిక బ్లిట్జ్ దిన పత్రిక, ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ యిండియా లకు చందా కట్టి తెప్పించేవారు. ఆయనకు బహు విధమైన విషయములందు ఆసక్తి. వాటిని తెలుసుకొనుటకై చేసే పరిశ్రమ చాలా ఆశ్చర్యం గొలుపుతుంది. ఆయన కున్న ఆలోచనలు పది పదిహేను సంవత్సరాల తర్వాత నే ఆచరణలోకి వచ్చాయంటే ఎంత దూరదృష్టి వుండేదో అంచనా వేయవచ్చు.

.... మంగళమ్ మహత్ ...

***

# అను బంధము 1

మామిడి సింగన్న గారి మిత్రులుగా బలభద్రపాత్రుని వారికి 44 గ్రామములు లభించెను. వీరికి క్రీ.శ. 1515కు ముందే ఈ గ్రామములు లభ్యములు. రెడ్డి రాజుల తరువాత కొండవీడు రాజ్యము గజపతి అధీనములో నున్నది. అప్పుడు కొండవీటి ప్రాంతముపై అధికారము కలిగి గజపతులకు మంత్రియైన గోపరాజు రామన్నగారు. ఈ 44 గ్రామములు మరొక సారి వీరికే నిర్ధారించారు. అంతేకాక క్రీ.శ 1515 లో బలభద్రపాత్రుడు పాత్ర సామంతునిగా వర్ణింపబడుట వల్ల, ఈ 44 గ్రామములే సామంత రాజ్యములుగా రూఢి చేయగలమా అట్లు కాకూడదు. బలభద్రపాత్రుడు తమ దాయాదులతో అనుభవించ వలసిన 44 గ్రామములు ఒక్క బలభద్రుని సామంత రాజ్య మెట్లగును అందువలన గజపతులు బలభద్రపాత్రునికి వేరొక సంస్థాన మిచ్చి యుండవలెను. కాని గజపతిచే అవమానింపబడిన బలభద్రపాత్రుడు తన కిచ్చిన సామంత రాజ్యమును వదిలి తిరిగి కొండవీడు వచ్చి తర్వాత హైదరాబాదు చేరి యుండ వలెను. హైదరాబాదీ నవాహబులు కుతుభ్‌షాహీలు కొండవీడును తమ రాజ్యంలో కలుపుకుని దానిని మూర్తజానగరు సర్కారుగా వ్యవహరించిరి. క్రీ.శ. 1600 లో బలభద్రపాత్రుని తిరువేంకటానాధుడు, గోవిందరాజులు ఈ ప్రదేశంలో స్థల కరణాలుగా వున్నట్లు తెలియు చున్నది. *(1 గ్రామ కైఫీయత్తు 4 వ భాగం, పుట 176).* వంశవృక్షం ప్రకారం తిరువేంగళులు యిద్దరు వున్నారు. పెద తిరువేంగళం, చిన తిరు వేంగళం. వారికి సమకాలికుడు రామానుజం వున్నాడు. క్రీ.శ. 1810 కి ముందున్న పరిస్థితులు కైఫీయత్తుల

వల్ల రూఢి గావు. ఆ కైఫీయత్తులు, అప్పటికి ప్రాచుర్యంలో వున్న విషయములు వ్రాసారు కాని దానికి ఎటువంటి ప్రమాణము లేదు. స్థల కరణాలు అనగా వంశపారంపర్యంగా వచ్చే పదవిని పొందినవారు. వంశపారంపర్యంగా వచ్చే పదవి కుటుంబంలో జ్యేష్టునకు దక్కుతుంది. అందువల్ల క్రీ.శ. 1600 లో పెదతిరువేంగడం, రామానుజులు స్థల కరణాలుగా వుండి వుండవచ్చు. వీరు బలభద్రపాత్రునికి ముని మనుమలు. చిన్న కుమారుల సంతతి. అందువలన బలభద్రపాత్రుని పెద్ద కుమారుని సంతతి హైదరాబాదు నవాబుల వద్ద శస్త్రజీవులుగా వుంటే, చిన్న కుమారుల సంతతి కొండవీడు నందు స్థలకరణాలుగా వుండి తమ జమీ వ్యవహారములు చూచుకొనుచుండిరని అనుకొనవలెను. క్రీ.శ 1600 ల నుండి క్రీ.శ. 1710 వరకు కొండవీడు రాజ్యము హైదరాబాదు నవాబు ఆధీనంలో వుండి ఖిలాదారులచే పరిపాలింపబడు చుండేది. ఆ సమయంలో ఖిలాదారులు ఆ ప్రాంతంలోని దేవాలయములను నాశనము చేసి, మసీదులు నిర్మించుటయే ముఖ్యమైన పనిగా పెట్టుకొనిరి. అంతకు క్రితం వున్న అగ్రహారములు, జమీందారీలు ప్రభుత్వం తనపరం చేసుకుంది. మరల హైదరాబాదు నవాబు వద్ద హిందువులు మంత్రులైనప్పుడు నవాబుకు దమన నీతితో సత్ఫలితములు లేకున్నప్పుడు, నవాబు కొండవీటిపై పాలనలో కొంత మార్పు చేసెనని తెలియుచున్నది. పాలనలో దమననీతి భయమును మాత్రమున్న జనులు వ్యవసాయము చేయలేరు. అందువలన పన్ను చెల్లించ లేరు. ముస్లింలు రాజ్యము చేసిన కాలములో యుద్ధములు ఎక్కువగావుండి, ధనావశ్యకత మిక్కుటమైనది.

భయపెట్టి కొంత కాలము పన్నులు తీసుకో గలరుగాని, ప్రజలలో బీదరికము, అనిశ్చిత పరిస్థితులున్న పన్నులు రావు. ఆ పరిస్థితులలో పాలకులు తప్పని సరిగా ప్రజలకు కొన్ని సౌకర్యములు, కొంత స్వేఛ్ఛ యివ్వ వలెను. పన్నులు సకాలములో చెల్లించుటకు వ్యవస్త అవసరము. అందుకు పాలకులు తమకు పూర్వమున్న వ్యవస్తనుండి పలుకుబడి, గౌరవము గల కొంత మంది అధికారులను తిరిగి ఆ పనులకు ఉపయోగించు కొనుట సామాన్యముగా జరిగే విషయము. బ్రిటిష్ రాజ్యమేర్పడిన తర్వాత కూడా గ్రామ పరిపాలనా వ్యవస్థలో పెద్ద మార్పులు చేయలేదు. బలభద్రపాత్రుని వారి వంశీయులు హైదరాబాదు నవాబు వద్ద పలుకుబడి సంపాదించి తమ గ్రామములను రక్షించు కొనిరని అనుకొనవలయును. అప్పుడున్న అనిశ్చిత పరిస్థితులలో రాజ్యములో శాంతి లేని కారణంగా, అప్పటివరుకు పాలకులుగా వున్న హిందూవంశముల పేర్లు తెలియుట లేదు. క్రీ.శ. 1700 వరకు ఒక ప్రక్క మహారాష్ట్రులు, వేరొక ప్రక్క ఔరంగజేబ్ ఒత్తిడి చేయడం వల్ల హైదరాబాదు రాజ్యము సంకటములో నుండినది. ఔరంగజేబ్ హైదరాబాదు రాజ్యమును కబళించి క్రీ.శ. 1707 వరకు దక్కనులోనే యుండి, మరల రాజ్యములో దమన నీతి ప్రారంభించెను. క్రీ.శ. 1707 లో ఔరంగజేబ్ మరణించిన తర్వాత, జిరగిన యుద్ధములు, సింహాసనము కోసం ఔరంగజేబ్ కుమారుల అంతర్యుద్ధములు జరిగిన తర్వాత దక్కన్‌కు నిజామ్ ఉల్‌ముల్క్ ఆసఫ్‌జా రాజ ప్రతినిధి అయ్యెను. క్రీ.శ. 1710 వరకు ఆయన మొగలాయీ రాజ ప్రతినిధిగా వుండి, తర్వాత స్వాతంత్ర్యము ప్రకటించెను. నిజాం బలవంతుడు. అనుభవజ్ఞుడు.

అందువలన వీరి పరిపాలన మరల వ్యవస్థాగతంగాచేయబడినది. ఆ పర్యవసానమే బలభద్రపాత్రుని పెద అప్పయ్యగారికి క్రీ.శ. 1710 లో దేశపాండ్యా పదవి తెచ్చి పెట్టింది. ఆ కాలంలో ఖిలాదారు సర్వాధికారి. వారందరూ ముసల్మానులే. ఖిలా దారు క్రింద దేశ్ ముఖ్‌లు, దేశపాండ్యాలు, చౌధరులు పని చేసేవారు. దేశ్ ముఖ్‌లు పన్ను సేకరించవలసిన బాధ్యత కలవారు. దేశపాండ్యాలు ఆ బాధ్యతలో సహాయంగావుండేవారు. ఆ లెక్కలు వ్రాసే కరణాలు. చౌధరులు వర్తక విషయమును చూచెడి అధికారులు. సామాన్యంగా దేశ్ ముఖ్‌లు, దేశపాండ్యాలు బ్రాహ్మణులు. చౌధరులు ఎక్కువ భాగం కమ్మవారు.

తదనుగుణంగా క్రీ.శ. 1710లో బలభద్రపాత్రుని పెద అప్పన్న గారిని దేశపాండ్యాగా నియమించిరి. తిరిగి వీరి 44 గ్రామములు కూడ వీరి పరమైనట్లు తెలుస్తున్నది. 1710 నుంచి1780 వరకు కొండవీడు పాలన చేతులు మారుతూనే వున్నది. అసఫ్‌జాలు వారసత్వపు యుద్ధాలు, వారికి కర్నాటక నవాబుతో యుద్ధాలు, టిప్పుసుల్తాన్‌తో జరిగిన యుద్ధాలు పాలక వ్యవస్థను దెబ్బతీశాయి. బ్రిటిష్ వారు, ఫ్రెంచ్ వారు ఈ యుద్ధాలలో ప్రత్యక్షంగా ఎవరిదో ఒకరి పక్షములో పోరాడి తమ సామ్రాజ్యాం వృద్ధి చేసుకోటానికి ప్రయత్నించారు. ఆలాటి పరిస్థితులలో క్రీ.శ. 1750 నుండి క్రీ.శ. 1757 వరకు కొండవీడు ఫ్రెంచ్ వారి పాలనలో వుంది. కాని దేశ్ ముఖ్‌లు, దేశపాండ్యాలు, చౌధరుల వ్యవస్థ మారినట్లు కనబడలేదు. బలభద్రపాత్రుని పెద అప్పన్న దేశపాండ్యా క్రీ.శ. 1755లో కారెంపూడిలో మిరాసి యిచ్చిరి. ఆయన కుమారుడు చన్నయ్య దేశపాండ్యా(2 గ్రామ కైఫీయత్తులు, 4 వ భాగం పుటలు 231 232)

క్రీ.శ 1782లో ఈ మిరాసి ని ధృవపరిచిరి. క్రీ.శ. 1710 లో కొండవీడు ( మూర్తజానగర్ సర్కార్) ను 14 సంతుల క్రింద (3 గ్రామ కైఫీయత్తులు, 1వ భాగం పుట13) క్రింద విభజించిరి. బలభద్రపాత్రుని వారి 44 గ్రామములు కూచిపూడి ంసతులో చేరినవి. ఆ కాలములో వీరిని జమీందారులుగా (4 ఈ విషయం బలభద్రపాత్రుని వంశవృక్షం మొట్ట మొదటి సారిగా వ్రాసిన రావినూతల పెదకేశిరాజు గారి మునిమనుమలు చెన్నకేశవులు పెద అప్పయ్యగారిని జమీందారుగా ఉదహరించారు. ఆ వంశవృక్షము మండూరు వచ్చిన అప్పన్నగారి కాలంలో వ్రాయబడినట్లు విశదము. కారణము అప్పయ్యగారి తరము తరువాత చలమయ్య గారి కుమారుడు కోటయ్యగారు, చన్నయ్య గారి కుమారులు కోటయ్య, రామయ్యల వరకే వ్రాయబడినది. ఈ వంశవృక్షము శిధిలావస్తలో మా దగ్గర వున్నది) వ్యవహరించెడివారు.

క్రీ.శ. 1711 లో పరిపాలనా వ్యవస్థ కొంత మార్పు చెందింది. మార్తజానగర్ సర్కారును మూడు భాగములు చేసి, (౪ *గ్రామకైఫీయత్తు 1 వ భాగం, పుటలు 17 22)* ఒక్కొక్క భాగము ఒక్కొక్క జమీందారు పరం చేశారు. వీరు 1. తిరుమల మాణిక్యారాయుడు 2. మానూరి వారు, 3. వాసిరెడ్డి వారు. తిరుమల మాణిక్యారావుగారు అళియ రామరాయలు కొండవీటికి రాజ ప్రతినిధి గా నియమించిన కృష్ణవేణి తిరుమలరాయని వారి సంతతి. వీరు మొదట దేశముఖ్‌లు గా వున్నారు. మానూరి వారు మధ్వ బ్రాహ్మణులు. వీరు గూడ బహుశః దేశముఖ్‌లుగా వున్నారు. వాసిరెడ్డి వారు నవాబు పాలనలో నవాబుకు నమ్మకస్తులై జమీ సంపాదించారు. ఈ మూడు జమీందారీలలో నున్న సంతులన్నిటికీ

బలభద్రపాత్రునివారే దేశపాండ్యలు. క్రీ.శ. 1788 సెప్టెంబరులో బ్రిటష్ ఈస్టిండియా కంపెనీకి మూర్తజానగర్ సర్కారు అప్పగించిన బలభద్రపాత్రుని జోగన్న దేశపాండ్యా మొదటి దేశపాండ్యా అప్పన్న ( పెద అప్పన్న) గారికి నాలుగవ తరం వారు. చివరి దేశపాండ్యా కూడా, జోగన్న దేశపాండ్యాతో పాటు తాఖీదు పొందిన సుందర రామయ్య, శ్రీనివాసరావులు జోగన్న దేశపాండ్యాకు పిన తండ్రు వరుస. వారు దేశపాండ్యాలు కారు. జోగన్న దేశపాండ్యాకు సహాయకులు. అందువలననే జోగన్న దేశపాండ్యా వారి నొక్కరినే దేశపాండ్యాగా సంబోధించిరి.

క్రీ.శ. 1793 తర్వాత కొండవీటి రాజ్యము (మూర్తజానగర్ సర్కారు గుంటూరు జిల్లా) లోని మూడు జమీందారీలు మూడు కుటుంబములు కొనుగోలు చేశారు. తిరుమల మాణిక్యారావుగారి జమీందారీ మల్రాజు వంశము వారు కొనుగోలు చేశారు. మల్రాజు వంశం వారు బ్రాహ్మలు, నియోగులు. వీరు కూడా దేశ పాండ్యాలట. వీరి గురించి కైఫీయత్తులలో ఎక్కువ వివరములు లేవు. వీరు రేపల్లె లోని రాచూరుకు జమీందారులు. వ ఆకాలములో తెనాలికి రేపల్లెకు *ప్రాముఖ్యం లేదు. కూచిపూడి సంతు మొత్తము (బలభద్రపాత్రుని వారి 44 గ్రామాల మొత్తం) ఈ జమీందారీలో చేరినవి. బలభద్రపాత్రుని వారికి వారు వాసమున్న గ్రామములోని భూమి స్వంతమైనది.*

రెండవ జమీందారీ మానూరు వారు కొనుగోలు చేసిరి. వీరు మధ్వ బ్రాహ్మణులని యిదివరకే చెప్పి యుంటిని. వీరు సత్తెనపల్లికి జమీందారు. మూడవ జమీందారీ వాసిరెడ్డి వారు కొనుగోలు చేశారు. వీరు చింతపల్లి

జమీందారులుగా తెలుస్తున్నది. వీరు కమ్మవారు. వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు గారి పూర్వీకులు. క్రీ.శ. 1793 తర్వాత భూమి శాశ్వత నిర్ధారణ తర్వాత బ్రిటిష్ యీస్టిండియా కంపెనీ వారు ఈ జమీందారీలు కొనుగోలు చేశారు. వీరు కొండవీటి నందున్నప్పుడే త్రిపురాంతకం లోని దేవికి పూజలు చేసేవారని యిదివరకే వ్రాసితిని. త్రిపురాంతకం లోని దేవాలయాన్ని క్రీ.శ. 1710 నుండి క్రీ.శ. 1788 వరకు జరిగిన ముస్లిముల దౌష్ట్యమునకు గురియైనందున దేవీ విగ్రహమును బావిలో పడవేసిరని తెలియు చున్నది. యిందుకు ఆకాలపు కథ యొకటి శ్రుతము. ముస్లిములు దేవాలయమును ధ్వంసం చేసి అక్కడనుండి రాళ్ళు మొదలయినవి తరలించి తరచు మసీదులు నిర్మించే వారు. ఈ విషయము గ్రామ కైఫీయత్తులు విరివిగా ఏకకంఠంతో నుడివినవి. ఆ కాలపు యుద్ధములలో ఆ దౌష్ట్యమును ఆపుటకై హిందువులు కొన్ని ప్రదేశములలో ముస్లిములను తరిమారు. అలా ఒకసారి ముస్లిములు పారిపోతూ త్రిపురాంతకం వద్ద ఒక దిగుడు బావిలో దాక్కున్నారట. వారికై వెదికే హిందువులకు ముస్లిముల జాడ తెలియ లేదట. దిగుడు బావి ప్రాంతమునకు వచ్చినపుడు ఒక తొండ బావిపై తల పైకి క్రిందకీ ఊపుతూ కనబడెనట. అప్పుడు హిందువులు దిగుడు బావిలో ముస్లిములు వున్నారేమోనని చూడాలని నిశ్చయించుకుని, దిగుడు బావిని చుట్టు ముట్టి, ముస్లిములను మట్టుపెట్టిరి. ముస్లిములు అక్కడ దాగున్నారని తొండ వలననే తెలిసినదని, ఆ ప్రాంతమపు ముస్లిములు అప్పటినుండి తొండలను నాశనము చేసే వారని ప్రతీతి.

అట్లే క్రీ.శ. 1514 నుండి కర్నాటక ప్రభుత్వపు కాలములో వలివేరునందు వలివేటి నాగులు అనునతడు భూమిని దున్నుచుండగా అక్కడ బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వామి మూర్తులు కనిపించెనని, తర్వాత ఆ చోట ప్రతిష్ఠ చేసి ఆ స్వామిని స్వయంభువేశ్వర స్వామి అనేవారట. క్రీ.శ. 1580 లో హైద్రా బాద్ బాదుషా యేలు బడిలో ఈ దేవాలయము ధ్వంసముచేయబడి, ఆ దేవాలయపు మాన్యము ప్రభుత్వ పరము చేసుకొన్నారట.

కొండవీడు సముతు బంద్దీలు చేసే టప్పుడు ఈ గ్రామము ప్రత్తిపాటి సముతులో కలపబడి, దేశపాండ్యా పెదఅప్పన్నగారికి ఈ గ్రామము మనోవర్తి క్రింద ఉంచారు. పెద అప్పన్న దేశపాండ్యా ఈ గ్రామములకు తన కుమారుడు కోనప్ప గారిని తాలూకాధికారిగా చేశారు. కొంతకాలం ఆయన తమ్ముడు పాపన్న తాలూకాధికారిగా ఉన్నారట. ఈ గ్రామమును పాపన్న, పట్టాభిరామయ్య, సుందరరామయ్య, అప్పయ్యలు క్రీ.శ. 1805 వరకు మనోవర్తిగా అనుభవించారు. క్రీ.శ 1805 లో అప్పయ్యగారు శివాలయమును పునరుద్ధరించి, శ్రీ లలితామ్మవారిని ప్రతిష్ఠ చేసి, యినాములు యిచ్చారు. 1*(1 గ్రామ కైఫీయత్తులు 5వ భాగం, వలివేరు పుట 148 151).* ఈ కైఫీయత్తులు, క్రీ.శ. 1810కాలమున వ్రాయబడినవి కాబట్టి అప్పయ్యగారు స్వయంభువేశ్వర స్వామి ఆలయం పునరుద్ధరించి, శ్రీ లలితాంబను ప్రతిష్ఠ చేసిన విషయం రూఢి అవుతున్నది.

***

# అనుబంధం 2

## మూర్తజానగర్ సర్కారును బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి అప్పగించమని కంపెనీ వారు బలభద్రపాత్రుని వంశం వారికి పంపిన తాకీదు.

జుసరు హయకరాను బలభద్రపాత్రుని సుందరరామన్న శ్రీనివాసరావుని జోగన్న దేశపాండ్యాని హవేలి మూర్తజాంనగరు బాషియ్యేతు బాషంద్దు బంద్ది గాని ఆలీసు వారు కరారు నామా ప్రకారం హానరబుల్ యారు డైరెత్ యింగరీజు యీస్టు యింజ్చి కుంప్పినీ వార్కి గుంటూరు సర్కారు అనుకూలంగా అప్పగించ్చ గలందులకు కబూలు అయినారు గన్క యిందున్ గురించ్ని సంగ్గత్కి చంన్నపట్టపు అధికార్ల హుకుం నకల్లు ప్రచురించేశిన దండోరా కాకితంకు నకల్లు యింద్దులా బిడాయించ్చి పంప్పించి నాము గన్క మీరు యీ నకళ్ళను మీ తాలూకాలలో యావత్తుంన్ను దండ్డించ్చేది మేము కుంప్పిణీ తరుఫున గుంట్టూర్కు సర్కారు ఆధీనం చేసుక్కూటంద్కు బుమీదార్ల కున్నూ మరి రహితులకుంన్ను రుజ్వూ చేసుకో గలంద్దులకున్ను మంమ్ముంన మొకర్రరు చేసిన దాని కాగితం వల్ల మీకు తెలియస్తుంద్ది గదా మేముంన్ను యీ పని నిమిత్తమయి గుంట్టూరుకు ఆలష్యం లేకుండ్డా తరలి వస్తూవుంన్నాము. మీరు తక్షణమె హాజరు బాషి కావలిసినది. ఈ దండోరా కాగితములో వున్న క్రమం చొప్పున మనఃపూర్వకంగా తక్షణమె నడచు కున్నంద్దు వల్ల మీ యొక్క వాజిబీ హక్కులు యావత్తు సలామతుగా వుండ్డెటంద్కు హేతువు అవును. లేక యింద్కు యదిరించ్చి జాప్యం

చేశినట్టు అయితే కుంప్పిణీ వారి యతిరాజులోకి  వచ్చి మీ నడతలకు తగ్గట్టు శిక్షకు తగిన వారు అవుదురు. కీలక నామ సంవత్సర బాద్రపద 5,  శనివారం. ఆన సెప్పటంబర్ 5,1788.

***

# పరిశీలించిన గ్రంధములు

గ్రామకైఫీయత్తులు ః మెకంజీ రిపోర్టుల ఆధారముగా గుంటూరు గ్రామకైఫీయత్తులు ఆంధ్రప్రదేశ్ప్రభుత్వ అభిలేఖాగారము ప్రచురించినది. ఇవి ఐదు భాగములు. క్రీ.శ. 1750 వరకు వ్రాయబడిన విషయములు ప్రతి గ్రామము నందు అనుశృతముగా వచ్చు గ్రామ చరిత్ర, దేవాలయములలో నున్న శాసనములను ఆధారముగా చేసి వ్రాయబడినవి. క్రీ.శ 1750 తరువాత విషయములు పార్తిగా నమ్మ వచ్చును. కారణం ఈ గ్రామకైఫీయత్తులు క్రీ.శ. 1810 లో వ్రాయబడటమే.

1. గ్రామకైఫీయత్తు 1 వ భాగం (1984) ః
   క్రీశ. 1529 స్వభాను నామ సంవత్సర పుష్య బహుళ 3 వ ఆదివారం శ్రీమన్మహా మండలేశ్వర పూసపాటి గజపతి రాజుగారు త్రిపురాంతక లింగమును ప్రతిష్ట చేశారు. పోతూరు గ్రామము (వినుకొండ తాలూకా)లో ఈ ప్రతిష్ట జరిగింది. ఈయన బలభద్రపాత్రుడు మొదలైన 16 మంది పాత్రసామంతు లందరికీ సర్వ సైన్యాధ్యక్షులుగా శ్రీకృష్ణదేవరాయనితో యుద్ధము చేసెను (పుట 40)

2. గ్రామకైఫీయత్తులు 2 వ భాగం (1982) ః
   బలభద్రపాత్రుని అప్పన్న దేశపాండ్యాగారు వృష నామ సంవత్సర వైశాఖ శుద్ధ 15 (క్రీ.శ. 1755) లో కారంపూడి పాడు సంతు పొన్నూరు (సత్తెనపల్లి తాలూకా) కు మిరాసీ దాన పత్రం విశ్వేశ్వర సోమయాజులు గారికి యిచ్చారు.

- బలభద్రపాత్రుని చిన్నప్ప దేశ పాండ్యా గారు శుభకృతు నామ సంవత్సర శ్రావణ బహుళ 15 (క్రీ.శ. 1782) పూర్వం వలెనే మిరాశీ దాన పత్రమిచ్చారు. కారంపూడిపాడు పుటలు 6, 7
- గుజ్జంవారు, కౌండిన్యస గోత్రులకు క్రీశ. 1145 లో సంప్రతి (కరణము) గా నియమింప బడిరి. గుంటూరు పుట 33
- గుజ్జం బలభద్రడు తర్వాత బలభద్రపాత్రుడయ్యేను. తర్వాత ఆయన వంశం వారు బలభద్రపాత్రుని వారైనారు. గుంటూరు పుట 56
- వలివేరు సంప్రతిగా గౌతమ గోత్రీకులు సమయ మంత్రివారిని నియమించిరి. వీరు కొన్ని దినములు మండూరు గ్రామము కూడా అనుభవించిరి. వీరే తర్వాత మామిడి వారైరని మండూరు గ్రామ గ్రామ కైఫీయత్తు వలన తెలియు చున్నది. మామిడి సింగన వంశము బలభద్రపాత్రుని వారికి మాతామహులు. గుంటూరు పుట 39

3 గ్రామ కైఫీయత్తు 3 వ భాగం (1988)

- బలభద్రపాత్రుని అప్పన్న దేశ పాండ్యా ఈ గ్రామములో వేణుగోపాల స్వామి ఆలయాన్ని క్రీ.శ. 1712లో మరల బాగు చేయించి, స్వస్తి వాచకం చెప్పుటకు మాన్యము లిచ్చిరి. శ్రీ మాండవేశ్వర స్వామి వారికి కూడా మాన్యమిచ్చిరి. వీటన్నిటికి మొత్తము 11/4 కుచ్చెళ్లు అనగా 37 ఎకరముల భూమి యిచ్చారు. ఈ గ్రామము వీరి జమీందారీ లోనిది. వీరికి వలివేరు, ఎడ్లపల్లి, చినగాదెలవర్రు, అంగలకుదురు, కండెపాడు మొదలైన గ్రామములు కలవు. ఈ గ్రామాన్ని కొంత కాలం అప్పన్న

దేశపాండ్యాగారి కుమారుడు పాపన్న గారు అనుభవించిరి. తరువాత వీరి అన్నగారు చన్నప్ప దేశపాండ్యాగారు అనుభవించిరి. వారి తర్వాత వారి కుమారుడు అప్పన్న గారు ఈ గ్రామమును అనుభవించుచూ, బ్రాహ్మణులకు 2 3/4 కుచ్చెళ్ళు అనగా సుమారు 81 యకరముల భూమి మాన్యాలు యిచ్చారు. చన్నప్ప గారి కుమారుడు జోగన్న (జంగన్న) దేశపాండ్యా, చన్నప్పగారు క్రీ.శ. 1800 వరకు అనుభవించిరి. పచ్చలతాడిపర్రు పుటలు 69,70

- బలభద్రపాత్రుని అప్పన్నగారు క్రీ.శ. 1711లో మన్నవ గ్రామంలో కేశవస్వామికి, సోమేశ్వర స్వామికి యిచ్చిన మాన్యములు 11/4 కుచ్చెళ్లు అనగా 37 ఎకరముల భూమి.

  మన్నవి పుట 86

4 గ్రామ కైఫీయత్తు 4 వ భాగం (1990)

- మూర్తజానగర్ సర్కారు (గుంటూరు) ను 14 సముతులు గా పాలడ్గు, పులివర్రు, ప్రత్తిపాడు, సంతరావూరు, నూతక్కి, చేబ్రోలు పాండ్యం, మంగళగిరి, మునిగోడు, నాదెండ్ల, రావిపూడి, కూచిపూడి, గుంటూరు, తాడికొండ చేసిస బలభద్రపాత్రుని వారిని దేశపాండ్యాలుగా నిర్ణయించారు. కొండవీడు పుట 31
- బలభద్రపాత్రుని వారి జమీందారిలో గ్రామము పురాణం వరసం భొట్లకు బలభద్రపాత్రుని అప్పయ్య గారు ( క్రీ.శ. 1800) 1/2 కుచ్చెళ్లు అనగా 14 1/2 యకరముల భూమిని మాన్యముగా యిచ్చారు.

5 గ్రామ కైఫీయత్తు 5 వ భాగం (1990)

- కూచిపూడి సంతులోని గ్రామములు (24) కూచిపూడి, యరవూరు, జంపని వేమూరు, పెరవలి, భూతుమల్లె, కాకర్లమూడి, చదలవాడ, చముడుమాడు చివ్వలూరు, దావులూరు, కొల్లిపర, మున్నంగి, తెనాలి, కఠెవరం, పినపాడు, చినరావూరు, పెజరావూరు, చిన పరిమి, వరాహపురం, బుట్రిపాలెం, దంతలూరు, పులిచింతలపాలెం, పెద కొండూరు 24 వాసిరెడ్డి వారికి.

  మూల్పారు, పోతుమర్రు, కుంచవరం, అత్తోట, శిరిపురం, నందివెలుగు, గుడివాడ, యెరికెలపూడి 8 మానూరి వారికి చుండూరు, మండూరు, పెదపూడి, మోపర్రు, చినగాదెలవర్రు, వలివేరు, తేలప్రోలు, చింతలపూడి, దుగ్గిరాల, మచ్చికలపూడి, కుచ్చళ్ళపాడు 12 మాణిక్యరావుగారికి మొత్తము 44 గ్రామములకుబలభద్రపాత్రుని వారిని దేశపాండ్యాలుగా చేశారు. కూచిపూడి పుట 27 28

- చేబ్రోలు సంతులోని గ్రామాలు ః చేబ్రోలు, వడ్లమూడి, నారా కోడూరు, నయ్నివరం, కంఠంరాజు కోడూరు, పెనుమూడి, చిలువూరు, రేవంతి పాడు, కలనుకొండ, అనువర్లపూడి, మంచాళ్ళ, కోవెలమూడి, అన్నవరపు పాడు, నయ్నివరపు పాడు, కరకుర్జమూడిపాడు, కొత్తపల్లి, పెదగాదెలవర్రు, శృంగారపాడు, కాకాని, మొశలపూడి, కోపల్లి, శ్రీరంగపురం, తంగెళ్ళమూడి, పెనుగుదురు పాడు, పెరవలి, గుడిపాడు,

మంచికంపూడి, దుగ్గిరాల, చింతలపూడి, కొలకలూరు, చినకాకాని, కాడ, గోళ్ళమూడి, గుండవరం, నారికేళపల్లి, మట్టెగుంట్టె, దేవరాయజొట్ల పాలెం ఈ 37గ్రామాలకు బలభద్రపాత్రుని వారిని దేశపాండ్యాలుగా నిర్ణయించారు. చేబ్రోలు పుట 59 60

- దేశపాండ్యాలైన పాత్రుని పట్టాభి రామన్నగారు క్రీ.శ. 1755 లో వ్రాయించిన తాఖీదు బలభద్రపాత్రుని కోనప్పగారు వ్రాయించిన సనదు. క్రీ.శ. 1776 దుగ్గిరాల పుట 91 93
- బలభద్రపాత్రుని పట్టాభిరామన్నగారు, కోనప్పగారు క్రీ.శ. 1744 లో వ్రాయించిన శ్రోత్రియం. పోతుమర్రు పుట 119
- మండూరు పుట 127 129 కైఫీయత్తు మొత్తము
- ఎడ్లపల్లి పుట 141 142 కైఫీయత్తు మొత్తము
- వలివేరు పుట 148 151 కైఫీయత్తు మొత్తము

6. ఆముక్త మాల్యద శ్రీకృష్ణదేవరాయని కృతి
7. కృష్ణ కథావిపంచి పడాల రామ కవి విరచితము (1957) ఆతాణ పద్యములు 74 నుండి 78, 86 నుండి 90, 95,109 పుటలు 121,122,124,125, 129 యందు పాత్ర సామంతుల యుద్ధమున తిమ్మరుసు నీతిని విపులీకరించెను.
8. తిమ్మరుసు మంత్రి చిలుకూరి వీరభద్రరావుగారి ప్రణీతము 1917 పుట 118 నుండి 122 వరకు.
9. అద్దంకి గంగాధర కవి తపతీ సంవరణోపాఖ్యానమును మల్కి భరాము (ఇబ్రహీం కులీ కుతుబ్‌షా) (క్రీ.శ. 1530 1580) నకు కృతి యిచ్చెను. అందులోని పద్యము.

***

# దేశ పాండ్యా బిరుదు

1783, సెప్టెంబరు లో మూర్తజానగర్ సర్కారును బ్రిటిష్ వారికి అప్పగించవలసినదిగా చేసిన తాఖీదు లో బలభద్రపాత్రుని జోగన్న దేశపాండ్యా, సుందరరామయ్య, శ్రీనివాసరావు పేర్లున్నవి. వీరు ముగ్గురూ అన్నదమ్ములుగారు. కాని వారు ప్రథమ దేశపాండ్యా బలభద్రపాత్రుని పెద అప్పయ్యగారి సంతతి. క్రీ. శ. 1712 లో కొండవీడు నందు దేశపాండ్యాగా నుండిరి. ఈ కుటుంబము వారు క్రీ. శ. 1580 వరకు ఏమి చేసినది పూర్తిగా తెలియుట లేదు. కాని వారికి క్రీ. శ. 1580 సంవత్సరము నుండి వలివేరు, అంగలకుదురు, చావారి పాలెం మొదలయిన గ్రామాలు అగ్రహారములుగా నున్నట్లు తెలియు చున్నది.

మా నాయనగారు ఈస్ట్ ఇండీయా కంపెనీకి మూర్తజానగర్ సర్కారును అప్పగించిన వారు చన్నయ్య, రామయ్య అని వ్రాశారు. అట్లు వ్రాయుటకే ఆధారములున్నవో తెలియుట లేదు. కాగా బలభద్రపాత్రుని జోగన్న దేశపాండ్యా వీరి తరువాత తరం వారు. అందువలన స్పష్టముగా వీరు అప్పగించినట్లు చెప్పుటకు వీలులేదు. మా నాయన గారు వ్రాసిన ప్రకారం. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు కొంత భరణముల యిచ్చిరి. కాని కాలక్రమేణ ఆ భరణం ఆగి పోయింది.

గ్రామ కైఫీయత్తులలో మండూరు గ్రామ కైఫీయత్ వున్నది. దీని ప్రకారం ఈ గ్రామములన్నియు కూచిపూడి సంతులో జేరి, రేపల్లె తాలూకాలో భాగముగా నుండెనని తెలియుచున్నది. అప్పటికి తెనాలి

ఒక తాలూకాగా పరిగణింపబడక రేపల్లె తాలూకాలో భాగముగా నుండెనని విశదమవుతున్నది. ఈ రేపల్లె తాలూకాను ఒక జమీందారీ గా వ్యవహరించేవారు. దీనికి రాచూరు జమీందారు రాజా మల్రాజు వేంకట గుండారాయణంగారలు. వీరు బ్రాహ్మణులు. ఈ జమీందారీని వారు కొనుగోలు చేసినట్లు మండూరు కైఫీయత్ వలన తెలుస్తున్నది. క్రీ.శ. 1793 తర్వాత భూమిని శాశ్వత నిర్ధారణ చేసి రైత్వారీ పద్ధతి ప్రవేశ పెట్టిన తర్వాత, ఈ తాలూకాను బ్రిటిష్ వారు అమ్మకము చేసినట్లు తెలికొనవలయును. బలభద్రపాత్రుని వారికి, రేపల్లె తాలూకా జమీందారులకును మంచి స్నేహమున్నట్లు తెలియుచున్నది. ఆ స్నేహం మా ముత్తాత నరసింహం గారి తండ్రి కోటయ్యగారి వరకు వున్నట్లు తెలియుచున్నది. అనగా, క్రీ.శ. 1880 ప్రాంతము వరకు వున్నట్లు శ్రుతము. అంతేకాక, ఈ రెండు కుటుంబములకు బంధుత్వము కూడ కలదు. 1580 సంవత్సరమునుండి అనుభవించు అగ్రహారపు గ్రామములన్నియు బలభద్రపాత్రుని వారికి దక్కలేదు. 1793 సంవత్సరపు భూమి నిర్ధారణము వలన ఎవరు సాగు చేయు భూమి వారికి చెందుట వలన, వీరికి వలివేరు, చావారి పాలెం, అంగల కుదురులో నున్న భూమి, యిండ్లు మాత్రము మిగిలి నట్లు తెలియుచున్నది.

దేశపాండ్యా అను ఉద్యోగము వంశపారం పర్యంగా చెందు ఉద్యోగము. అనగా దేశపాండ్యాగా నున్న వారి పెద్ద కుమారునకు సంక్రమించు ఉద్యోగము. అందువలలనే జోగన్నను దేశపాండ్యాగాను, ఆయన కన్న పై తరముల వారైన సుందరరామయ్య, శ్రీనివాసరావులకు దేశపాండ్యాబిరుదు ఉపయోగింపకనూ తాఖీదును యిచ్చిరి. జోగన్న

దేశపాండ్యా గానూ, మిగిలిన యిద్దరూ(సుందరరామయ్య, శ్రీనివాసరావులు) వయస్సులో పెద్దవారైననూ, జోగన్నకు తండ్రి, తాతల తరము వారైనప్పటికీ, జోగన్న క్రింద పని చేయ వలసిన వారై యుండి యుందురు. బహుశః, తర్వాత వచ్చిన స్పర్థలకు యిదియే మూల కారణమైయుండుననుటకు సందేహము లేదు.

పెదఅప్పన్నగారు, మూర్తజానగర్ సర్కార్ (గుంటూరు) నకు(కొండవీడు ముఖ్యపట్టణముగా మున్నది), ప్రథమ దేశపాండ్యాగా నుండిరి. వీరు క్రీ.శ. 1719 ( 1122 ఫసలీ) లో దేశపాండ్యా గా వున్నట్లు మండూరు కైఫీయత్తు వలన తెలియు చున్నది. వీరికి చన్నయ్య, అచ్చయ్య, కోనయ్య, పెద పాపన్న అను నలుగురు కుమారులు. వీరిలో చన్నయ్య గారు, పెద అప్పన్న గారి తర్వాత దేశపాండ్యా పదవి చేపట్టిరి. వీరు సుమారు క్రీ.శ.1720సమయంలో దేశపాండ్యాగా వుండియుండవచ్చును.

***

## పాత్రుల ఉనికిని గుబాళించే సాహిత్య సుమాలు

1) అద్దంకి గంగాధర కవి తపతీ సంవరణోపాఖ్యానమును మల్కి భరాము ( ఇబ్రహీం కులీ కుతుబ్‌షా) (క్రీ.శ. 1530 1580) నకు కృతి యిచ్చెను. అందులోని పద్యము :

సీ॥ పడమటన సవాయి బసవనిగాజేసి
యచట గొయ్యలకొండ నావరించె
దమరి మల్లాఖాను దక్షిణంబునగొట్టి
హరియించెబొనుగల్లాది గిరుల
నుత్తరంబున బరీదోడి పాఱగద్రోలి
మెతుకు దుర్గం బాక్రమించి, మించె
బ్రథమ దిక్కున నొడ్డి ప్రాత్ర సామంతుల
ధట్టించి కంభము మెట్టు గొనియె

గీ॥ నతని బొగడంగ చెగడె యాచతురనీతి
రూఢిగిరి దురలుంతన ప్రౌఢ తేజు
వాహ శిఖరాధిరోహ రేవంత మూర్తి
కుతుబు శాహి నిక్షా మ్రపాలు గుణ విశాలు.

ఇందు వలన పాత్ర సామంతులు కంభము మెట్టు దుర్గము తో సంబంధము కలవారని తెలియు చున్నది.

ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము
రటన : కుందూరు ఈశ్వరదత్తు, బి.ఎ
ఆంధ్రప్రదేశ్‌సాహిత్య ఆకాడమి ప్రచురణ 1963 పుట 141

2) కొండవీటి దండపాట : ప్రతాప రుద్రు గజపతి కాలము నాటి బాపట్ల తాలూకాలోని కొమ్మూరు గ్రామము నందలి శాసనములో శ్రీశైలములోని మల్లికార్జున దేవరకు బాహుబలేంద్ర మహాపాత్రుడు దుర్గాప్రసాద కొండవీటి దండపాట కొమ్మూరు, వొరుగాండి, రావిపాడు, గోంగుల మూండి యను నాల్గు గ్రాములు స్వామి యమృత పళ్ళకు దానము చేసెనని చెప్పబడినది. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము పుట 109

3) మ॥ ఇది పాత్ర ప్రహరేశ్వర ప్రభృతి బంహిష్ఠోత్కళా నీక గుప్త
దివిస్ప్రృక్పటు యంత్ర కొండపల్లి హృద్భాహాసి కద్రూజదీవ్యదు
దారోద్యమ కృష్ణరాయనృప సంజ్ఞాన్మత్కృదా ముక్తమాల్యద
నాశ్వాసము హృద్య పద్యము తృతీయంబే మహింబొల్పగున్.

- ఆముక్త మాల్యద శ్రీకృష్ణ దేవరాయలు

*ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము పుట 107*

4) తుంగభద్ర : గుంటూరు మండలములోని ప్రాచీనాంధ్ర శాసనము లందు పేర్కొన బడినవి. కృష్ణానదికి దక్షిణ తీరమున సీతానగర కొండల ప్రాంతము నుండి ప్రవహించుచు బాపట్ల తాలూకాలో సముద్రమును కలయు నొక యేరు. ఇది కృష్ణా డెల్టా నిర్మాణము నందు కొంత దూరము పంట కాల్వగాను, మురుగు కాలువ గాను ఉపయోగ పడుచున్నది. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము పుట 163

5) పాత్రసామంతులు కృష్ణదేవరాయనితో చేసిన యుద్ధ ప్రస్తావన బాడాల రామకవి, యమ్.ఏ,ఆంధ్రోపన్యాసకులు, యువరాడ కళాశాల, మైసూరు 1957 కృతమైన 'కృష్ణకథా విపంచి' యందు 121 నుండి 125 పుటలలో నున్నది. ముఖ్యముగా74 నుండి 78, 86 నుండి 90, 95 పద్యములలో నీ ప్రస్తావన యున్నది.

(74)

శత్రు సమితి వోలె సంజ చీకటి గ్రమ్మెఁ
బాత్ర నాయకు లిదె ప్రబలి రంచు
బిడుగు వంటి వార్త విశ్వనాథుఁడు దెచ్చి
పరుగు పరుగులోనఁ బ్రభుని జేరి

(75)

పాత్రనాయకు లిదె ప్రతాపంబు పలుక
నాజగన్నాథుఁడే శరణ్యం బటంచు
దేవ!గజపతి మనపైకిఁ ద్రెళ్ళెనంచుఁ
గమలనాభయ్య పంపె వేగర్ల ననగ.

(76)

స్వామి భక్తుడౌ కమల నాభయ్య పంపు
వేగరుల లేఖలను గొంచు విశ్వనాథుఁ
డరుగ దేర మంత్రి గుడారమందుఁజొచ్చి
కృష్ణరాయ లొకండె మంత్రీంద్రు నరసె.

(77)

గొబ్బున నేగు దెంచు నృపకుంజరు తీరును గాంచి మంత్రి త

బ్బిబ్బులు సెంది రాజ ! తమ రీగతి రాతిరివేళ వచ్చుటల్

అబ్బురమయ్యె సేమమె గదా ! తమకున్ దమ వారికిన్ బ్రభూ!

ఉబ్బెడి శత్రుసైన్యముల నుక్కడఁగించుఁగదా స్వసేన నాన్

(78)

పాత్ర నాయకుల ప్రతాపంబు నా ప్ర

తాప రుద్రుని నిశ్చితార్థంబుఁ దెలుపు

కమలనాభయ్య పంపు లేఖలనుఁ జూపి

ధీర గంభీరుఁడౌచు క్షితీంద్రుఁడనియె

(85)

అనినంతన్ నెఱవేర్పఁగాఁగలరు, కయ్యంబందుఁగష్టంబు, యు

క్తిని గెల్వందగుఁ బాత్రనాయకుల, సాధింపన్ బ్రయత్నించెదన్

ధనరాసుల్ వ్రయ మౌను గాని మన యాప్తశ్రేణికిన్ గీర్తికిన్

దృణ మాత్రంబును లోప ముండ దటుపై దేవుండు లేడో! యనన్

(86)

భాండాగారాధీశుల

రండని పిలిపించి తిమ్మరుసు కోరుధనం

బిండని యాజ్ఞ లిడి నృపా

లుం డేగతి మమ్ముఁ బ్రోతురో యను చేగన్

(87)

శ్రీమదాంధ్ర కర్ణాటధాత్రీవరుండు
కృష్ణరాయల నాయకేగ్రసరు లగు
పాత్రులకుఁ గోరు ద్రవ్యంబుఁ బంప బడియె
గజపతింబట్టి యొసఁగ మీ కాంక్షదీఱు,

(88)

అని లేఖావళి పాత్రనాయకుల కా యప్పాజి వ్రాయించి
వేమణి మాణిక్య సువర్ణ సంచయములం బంపింప నో డ్రాధి
నాథుని సైన్యంబుల నాత్మ సేవకులఁబోఁద్రోలెన్ మాహామంత్రి
వర్యుని ప్రజ్ఞాబల మిట్టి దట్టిదని తా నూహింప లేఁడెవ్వడున్

(89)

రతనపుఁబేటికల్ తమ శిరంబులపై నిడి మంత్రి సేవకుల్
అతి నిపుణత్వమున్ మెఱయ నాపరసేనలఁబోవు చుండ
బందితు లయి నిల్చి రాగజపతి ప్రభుచెంత విరోధిచార
సంతతి యని శోధనల్ సలుప స్తంభితుఁడయ్యెఁ బ్రతాపరుద్రుఁడున్.

(90)

రమ్మని బిల్వలేదు, సమరంబున కేఁగఁగ జెప్ప లేదు సై
న్యమ్ముల తోడఁ దామె పదునార్వురు పాత్రులు వచ్చి శత్రు సై
న్యమ్ముల దగ్ధముల్ సలిపి యాంధ్రమహీపతి కృష్ణరాయకం
ఠమ్మును దెత్తుమంచుఁ గపటంబులఁ బల్కిరి కుట్రదారులై

(95) గజపతి చర్యలం దలఁచి కాలము కూడనివేళ మ్రగ్గదే
గజరిపు శౌర్యముం గడకుఁ గాంతులఁ బాయరె సూర్య చంద్రులున్
విజయ మరాతి సైన్యముల వీపులఁ దట్టి వరింప నుండె నీ
గజిబిజి యేల మళ్ళుట సుఖం బని విచ్చిరి పాత్రనాయకుల్

***